www.velthuru.com RNI TEL TEL/ 2019 / 78609 ఆదివారం

# వెలుతురు

రంగారెడ్డి। 25, ఫిబ్రవరి 2024 తెలుగు దిన పత్రిక

సంపుటి: 5 సంచిక: 277, పేజీలు: 12, వెల: రూ.5/-



## ప్రజాప్రతినిధుల రక్షణ ప్రభుత్వ బాధ్యత

- వీఐపీల డ్రైవర్లకు ఫిట్ నెస్ పరీక్ష నిర్వహిస్తాం
- మంత్రి పొన్నం కీలక ప్రకటన

హైదరాబాద్,ఫిబ్రవరి24 (వెలుతురు): చిన్న వయస్సులో ఎమ్మెల్యేగా గెలిచిన సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత ఊహించని రీతిలో కారు ప్రమాదానికి గురై మరణించింది. ఈ ఘటన అందరినీ దిగ్భ్రాంతి గురి చేసింది. తన తండ్రి సాయన్న మరణించిన సంవత్సరానికి ఆమె కూడా ప్రాణాలు వదలటం మరింత కలిచివేసింది. అయితే ఈ ప్రమాదానికి కారణం. డ్రైవర్ నిర్లక్ష్యంగా కారు నడపటం, అతివేగమేనని పోలీసులు నిర్ధారించారు. కాగా లాస్య నందిత ఎమ్మెల్యే గెలిచిన తర్వాత ఇది రెండు కారు ప్రమాదం. శుక్రవారం జరిగిన ప్రమాదానికి కారణం డ్రైవర్ ఆకాశే.. అయితే నల్గొండలో జరిగిన బీఆర్ఎస్ సభ నుంచి వస్తున్నప్పుడు ఆకాష్ కారు నడిపించాడు.

వివరాలు 2లో...

## ముగిసిన మహాజాతర

### మేడారానికి కోటిన్నర మంది భక్తులు

- గద్దెల నుంచి నిజస్థలాలకు వనదేవతలు
- తల్లుల ఆశీస్సులతోనే నాకు సంతానం
- పాతికేళ్లుగా దర్శించుకుంటున్నా: స్పీకర్
- ప్రపంచంలో ఇదే అతిపెద్ద జాతర: సీతక్క
- 8 లక్షల గొర్రెలు, మేకలు.. 4 లక్షల కోళ్లు
- మాంసానికే 500 కోట్లు పెట్టిన భక్తులు
- రూ.4.12 కోట్ల మేర మద్యం విక్రయాలు
- బెల్లం, కొబ్బరి కాయలు, చీరలు..
- అంతా కలిసి రూ.1000 కోట్ల బిజినెస్



వరంగల్, ఫిబ్రవరి 24 (వెలుతురు): మేడారం జాతరంటేనే ముక్క, చుక్క! ఈసారి జాతరలో వనదేవతలకు పెద్ద ఎత్తున జీవాలను బలిచ్చి.. ఆ మాంసం, మద్యంతో జాతరలో భక్తులు పండుగ చేసుకున్నారు. జాతరలో సుమారు 8 లక్షల గొర్రెలు, మేకలు తెగినట్లు అంచనా. ఒక్కొక్కటి రూ.8వేల చొప్పున వేసుకున్నా రూ.480 కోట్ల విలువైన మాంసాన్ని భక్తులు ఆరగించారన్నమాట. అలాగే 4 లక్షల దాకా కోళ్లు తెగాయి. జాతర మూడు, నాలుగో రోజు కోళ్ల ధరలను భారీగా పెంచారు. ఒక్కో కోడికి రూ.800 వరకు వసూలు చేశారు. తొలి రెండ్రోజులు మాత్రం కోడికి రూ.250 వరకే తీసుకున్నారు. కోడికి సుమారుగా రూ.500 చొప్పున లెక్క వేసుకున్నా రూ.20 కోట్లకు పైగా వ్యాపారం జరిగినట్లు అంచనా. మొత్తంగా మాంసం కోసమే భక్తులు సుమారు రూ.500కోట్ల వరకు ఖర్చు చేశారని భావిస్తున్నారు. ఎక్సైజ్‌శాఖ అధికారుల లెక్కల ప్రకారం జాతరలో రూ.4.12కోట్ల మద్యం విక్రయాలు జరిగాయి. ఎంఆర్‌పీపై 20శాతం ఎక్కువగా వసూలు చేయడంతో మరో రూ.కోటి దాకా వ్యాపారులు లాభపడ్డారు. సుమారు రూ.5కోట్ల మద్యం లోకల్‌గా అమ్ముడు పోయింది.

నాలుగు రోజుల్లో రూ.425

వివరాలు 2లో...

## ఉత్తరప్రదేశ్‌లో ఘోర ప్రమాదం

- భక్తులతో నిండిన ట్రాక్టర్ ట్రాలీ బోల్తా
- 7మంది చిన్నారులు సహా 15 మంది మృతి

కాస్‌గంజ్,ఫిబ్రవరి24 (వెలుతురు): ఉత్తరప్రదేశ్‌లోని కాస్‌గంజ్ జిల్లాలో శనివారం ఘోర ప్రమాదం జరిగింది. పాటియాలీ పోలీస్ స్టేషన్ పరిధిలోని దర్యాగంజ్‌లోని చెరువులో భక్తులతో నిండిన ట్రాక్టర్ ట్రాలీ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో 7 మంది చిన్నారులు



వివరాలు 2లో...

## సెప్టెంబరు నాటికి రెండు యూనిట్లు సిద్ధం



- యాదాద్రి పవర్ ప్లాంట్ పనుల వేగవంతం
- జాప్యం మూలంగా రాష్ట్ర ఖజానాపై మోయలేని భారం
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- వైటీపీఎస్ ఉన్నతాధికారులతో మంత్రులు సమీక్ష

హైదరాబాద్,ఫిబ్రవరి24(వెలుతురు): తెలంగాణ రాష్ట్రంలో యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ నిర్మాణాన్ని శరవేగంగా పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. యాదాద్రి పవర్ ప్లాంట్‌లో విద్యుదుత్పత్తి ప్రారంభించే దిశగా అధికార యంత్రాంగం

వివరాలు 2లో...





## ధరణి దరఖాస్తులకు మోక్షం

- మార్చిలో తహసీల్దార్ ఆఫీసుల్లో హెల్ప్ డెస్క్‌లు
- 2.45 లక్షలపైగా పెండింగ్ దరఖాస్తుల పరిశీలన
- అప్రూవ్, రిజెక్ట్ చేసినా రిపోర్టులు తప్పనిసరి
- ధరణి కమిటీ సూచనతో పరిష్కారానికి మార్గాలు
- తుది నివేదిక ప్రకారం చట్టసవరణ లేదా కొత్తచట్టం
- 'ధరణి'ని నిర్వహిస్తున్న ఏజెన్సీపై సమగ్ర విచారణ
- సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలు

ధరణి తెలంగాణ ప్రభుత్వం

హైదరాబాద్, ఫిబ్రవరి 24(వెలుతురు): ధరణి పోర్టల్‌కు సంబంధించిన పెండింగ్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. మార్చి తొలివారంలోనే అన్ని మండలాల్లోని తహసీల్దార్ ఆఫీసుల్లో హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటు చేసి, వాటిని పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. ధరణి కమిటీ సూచనలను పరిగణనలోకి తీసుకొని, పెండింగ్‌లో ఉన్న 2.45లక్షల దరఖాస్తుల పరిష్కారానికి విధి విధానాలు రూపొందించాలని రెవెన్యూశాఖను ఆదేశించారు. రైతులను ఇబ్బంది పెట్టకుండా దరఖాస్తులను పరిష్కరించేందుకు అవసరమైన ఉత్తర్వులు జారీ చేయాలని అన్నారు. ధరణిపై ఏర్పాటు చేసిన కమిటీతో సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి శనివారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ధరణి కమిటీ పలు అంశాలను సీఎం దృష్టికి తీసుకొచ్చింది. 2020లో అమల్లోకి వచ్చిన ఆర్వోఆర్ చట్టంలోనే లోపాలున్నాయని నివేదించింది. అప్పట్లో కేవలం మూడు నెలల్లో హడావుడిగా చేపట్టిన రెవెన్యూ రికార్డుల నవీకరణతోనే కొత్త చిక్కులు వచ్చాయని వెల్లడించింది. ఆ రికార్డులనే ప్రభుత్వం ప్రామాణికంగా తీసుకోవడంతో భూముల సమస్యలు, భూ రికార్డుల వివాదాలు ఎక్కువయ్యాయని పేర్కొంది. చివరకు పేర్లలో అక్షర దోషాలను సరిదిద్దుకునేందుకు జిల్లా కలెక్టర్ దాకా వెళ్లాల్సి వస్తుందని వివరించింది. ధరణి డేటాలో ఉన్న తప్పులను సవరించుకునేందుకు 35 మాడ్యూల్స్ ఉన్నప్పటికీ, ఏ మాడ్యుల్‌లో దేనికి దరఖాస్తు చేసుకోవాలనే అవగాహన లేకపోవడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారని తెలిపింది. లక్షలాది దరఖాస్తులు ఇప్పటికే తిరస్కరణకు గురయ్యాయని, ఒక్కో తప్పును సవరించుకోవాలంటే రూ.వెయ్యి ఫీజు చెల్లించాల్సి ఉండటం రైతులకు భారంగా మారిందని పేర్కొంది. రిజిస్ట్రేషన్లు, రెవెన్యూ శాఖల మధ్య సమన్వయలోపంతో నిషేధిత జాబితాలో ఉన్న భూముల క్రయ విక్రయాలు జరుగుతూనే ఉన్నాయని వివరించింది.


వివరాలు 2లో...



## తెలంగాణ ప్రణాళికా బోర్డ్ ఉపాధ్యాక్షుడిగా జి.చిన్నారెడ్డి

హైదరాబాద్,ఫిబ్రవరి24(వెలుతురు): తెలంగాణ ప్రణాళిక బోర్డ్ ఉపాధ్యాక్షుడిగా మాజీ మంత్రి జి.చిన్నారెడ్డిని ప్రభుత్వం నియమించింది.ఈ మేరకు శనివారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం చిన్నారెడ్డికి కేబినెట్ ర్యాంక్ హోదా కల్పించింది.ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో వనపర్తి నియోజకవర్గం నుంచి చిన్నారెడ్డి పేరును కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది.కానీ అంతలోనే చిన్నారెడ్డి పేరును తొలగిస్తూ మేఘా రెడ్డికి కాంగ్రెస్ పార్టీ అవకాశం కల్పించింది.మేఘా రెడ్డి..నిరంజన్ రెడ్డిపై భారీ మెజార్టీతో గెలుపొందారు.జి.చిన్నారెడ్డి వనపర్తి నియోజక వర్గం నుంచి మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. 1985లో యువజన కాంగ్రెస్ నేతగా ఉన్న చిన్నారెడ్డి..వనపర్తి నియోజకవర్గంలో పోటీ చేసి టీడీపీ అభ్యర్థి బాలకృష్ణయ్య చేతిలో ఓటమి పాలయ్యారు.1989లో మళ్లీ పోటీ చేసి బాలకృష్ణయ్యపై విజయం సాధించి,తొలిసారి శాసనసభలో అడుగుపెట్టారు.చిన్నారెడ్డి 1994 ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి

వివరాలు 2లో...



## సెల్లార్ నిర్మాణాలపై అనుమతి తీసుకోవాలి

- స్పష్టం చేసిన తెలంగాణ హైకోర్టు

హైదరాబాద్,ఫిబ్రవరి24(వెలుతురు): అపార్ట్‌మెంట్‌లోని బేస్‌మెంట్‌లో 2012 భవన నిబంధనల ప్రకారం వాచ్‌మెన్ గదితోపాటు రెండు మరుగుదొడ్లు నిర్మించుకోవచ్చని హైకోర్టు స్పష్టం చేసింది. 25 చదరపు మీటర్ల విస్తీర్ణంలో వీటి నిర్మాణం చేపట్టవచ్చని, అయితే ముందస్తు అనుమతి తప్పనిసరి అని తేల్చింది. హైదరాబాద్‌లోని మోహన్ నగర్‌లోని సీటీఓ కాలనీలోని అన్నపూర్ణ అపార్ట్‌మెంట్ బిల్డర్ కె.రమేష్ సెల్లార్‌లో వాచ్‌మెన్ గది నిర్మాణంపై ఈ నెల 7న జీహెచ్‌ఎంసీ జారీ చేసిన షోకాజ్ నోటీసును సవాల్ చేస్తూ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.ఈ అంశంపై జస్టిస్ టి.వినోద్ కుమార్ విచారణ చేపట్టారు. 500 చదరపు గజాల విస్తీర్ణంలో 15 ప్లాట్లు ఉన్నాయని, భద్రత కోసం సెల్లార్‌లో వాచ్‌మెన్ గదిని నిర్మించామని పిటిషనర్ తరపు న్యాయవాది తెలిపారు. దీన్ని కూల్చివేయాలని

వివరాలు 2లో...

## కాంగ్రెస్ అంటేనే బంధుప్రీతి, అవినీతి

- ఛత్తీస్‌ఘడ్‌లో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం
- ఘాటుగా విమర్శలు చేసిన ప్రధాని మోడీ



రాయ్‌పుర్,ఫిబ్రవరి24 (వెలుతురు): కాంగ్రెస్ అంటేనే బంధుప్రీతి, అవినీతి, బుజ్జగింపులకు కేరాఫ్ అని ప్రధాని మోదీ మండిపడ్డారు. దేశాభివృద్ధి ఆ పార్టీ అజెండాలోనే లేదని తూర్పారబట్టారు. ఆ పార్టీ విధానాల్లో మార్పు రాలేదన్నారు. విక్షిత్ భారత్, విక్షిత్ ఛత్తీస్‌గఢ్ కార్యక్రమంలో భాగంగా మోదీ రాయ్‌పుర్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా రూ.34,400 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 'స్వాతంత్ర్యం వచ్చాక చాలా ఏళ్లు కాంగ్రెస్ పాలించింది. ఆ పార్టీ దృష్టి ఎప్పుడూ ప్రభుత్వాలను ఏర్పాటు చేయడంపైనే ఉండేది. దేశ భవిష్యత్తుపై ఆ పార్టీ నాయకులకు పట్టింపు లేదు. కాంగ్రెస్ ఎప్పుడూ రాజకీయ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకునే నిర్ణయాలు తీసుకుంటుంది. ఇప్పటికీ కాంగ్రెస్ దశ, దిశ మారలేదు. బంధుప్రీతి, అవినీతి, అలకలు,

వివరాలు 2లో...

## 317, 46 జీవోలపై మంత్రివర్గ ఉప సంఘం

హైదరాబాద్, ఫిబ్రవరి 24 (వెలుతురు): రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఎదుర్కొం టున్న సమస్యలపై సర్కారు దృష్టిసారించింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం జారీ చేసిన 317, 46 జీవోలపై అధ్యయనానికి మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసింది. మంత్రి దామోదర రాజనర్సింహ చైర్మన్‌గా ఏర్పాటైన ఉప సంఘంలో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్‌ను సభ్యులుగా నియమిం చింది. ఈ జీవోల పర్యవసానాలను పరిశీలించి ప్రభుత్వానికి ఉపసంఘం నివేదిక సమర్పించనుంది. ఈమేరకు జీవో 292ను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి శనివారం జారీ చేశారు. ఈ నేపథ్యంలో ఉద్యోగులు, ఉపాధ్యాయుల బదిలీల సమస్య కొంతలో కొంతైనా పరిష్కారమయ్యే అవకాశాలున్నాయి. 2021 డిసెంబరు 6న 317 జీవో, 2022 ఏప్రిల్ 4న 46జీవోను జారీ చేశారు. వీటిపై అధ్యయనం చేసి నివేదిక ఇవ్వాలంటూ మంత్రివర్గ ఉప సంఘాన్ని ప్రభుత్వం ఆదేశించింది.



వివరాలు 2లో...

# టీఎస్పీఎస్సీ గ్రూప్-1 దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం

హైదరాబాద్,ఫిబ్రవరి24 (వెలుతురు): తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్పీఎస్సీ) గ్రూప్ 1 రిక్రూట్‌మెంట్ 2024 దరఖాస్తు ప్రక్రియను ప్రారంభమైంది. తెలంగాణ పీఎస్సీ ప్రిలిమినరీ పరీక్ష 2024 మే, జూన్‌లో జరిగే అవకాశం ఉంది. టీఎస్పీఎస్సీ ప్రిలిమినరీ ఎగ్జామ్ 2024 కోసం అధికారిక నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ రిక్రూట్‌మెంట్ పరీక్ష కోసం దరఖాస్తు ప్రక్రియను కమిషన్ ప్రారంభించింది.డిప్యూటీ కలెక్టర్, జిల్లా పంచాయతీ అధికారి, అసిస్టెంట్ లేబర్ కమిషనర్, జిల్లా గిరిజన సంక్షేమ అధికారితో సహా మొత్తం 563 ఖాళీల కోసం దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. ఈ దరఖాస్తులకు అభ్యర్థులందరూ అప్లికేషన్ ఫీజు రూ.200 చెల్లించాలి. పరీక్ష ఫీజు కాకుండా రూ.120 చెల్లించాల్సి ఉంటుంది. అయితే, ప్రభుత్వ ఉద్యోగులు, నిరుద్యోగ దరఖాస్తుదారులందరికీ పరీక్ష ఫీజు మినహాయింపు ఉంటుంది. 26 ఏప్రిల్ 2022 తేదీ నోటిఫికేషన్ నంబర్ 04/2022 కోసం గతంలో దరఖాస్తు చేసిన, ఫీజు చెల్లించిన అభ్యర్థులు ఈ నోటిఫికేషన్ కోసం మళ్లీ దరఖాస్తు చేయవలసిన అవసరం లేదు.టీఎస్పీఎస్సీ గ్రూప్ 1 పరీక్ష 2024 ఎంపిక ప్రక్రియలో మూడు రౌండ్‌లు ఉంటుంది. ఇందులో ప్రీ, మెయిన్స్, డాక్యుమెంట్‌ల వెరిఫికేషన్ రౌండ్స్ ఉంటాయి. టీఎస్పీఎస్సీ గ్రూప్ 1 ప్రిలిమినరీ పరీక్షలో ఒక పేపర్ ఉంటుంది, దీనిలో 150 ప్రశ్నలు ఉంటాయి. ప్రతి ప్రశ్నకు ఒక మార్కు ఉంటుంది. ప్రతి తప్పు సమాధానానికి 1/3 మార్కు తొలగిస్తారు. ప్రిలిమినరీ పరీక్ష 2.5 గంటలు, ప్రధాన పరీక్ష పేపర్ 3 గంటల పాటు ఉంటుంది.

## తెలంగాణ ప్రణాళికా బోర్డ్ ఉపాధ్యాక్షుడిగా జి.చిన్నారెడ్డి

(మొదటి పేజీ తరువాయి)

రావుల చంద్రశేఖర్ రెడ్డి చేతిలో ఓడిపోయారు.1999 ఎన్నికల్లో రావుల చంద్రశేఖర్ రెడ్డిపై చిన్నారెడ్డి 3,500 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు.2004 ఎన్నికల్లోనూ గెలుపొందారు. వైఎస్సార్ కేబినెట్‌లో గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రిగా పని చేశారు.2009 ఎన్నికల్లో రావుల చేతిలో ఓటమి పాలయ్యారు.2014 ఎన్నికల్లో చిన్నారెడ్డి గెలుపొందారు.మొత్తంగా నాలుగు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు.2018 ఎన్నికల్లో నిరంజన్ రెడ్డి చేతిలో ఓడిపోయారు.2021లో జరిగిన హైదరాబాద్ - రంగారెడ్డి - మహబూబ్‌నగర్ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి చవి చూశారు.ప్రస్తుతం పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్న ఆయనకు ప్రభుత్వం కేబినెట్ హోదా కల్పించింది.

## సెల్లార్ నిర్మాణాలపై అనుమతి తీసుకోవాలి

(మొదటి పేజీ తరువాయి)

జీహెచ్ఎంసీ అధికారులు నోటీసులు జారీ చేశారు. భవన నిబంధనల ప్రకారం వాచ్‌మెన్ గది నిర్మాణాన్ని చేపట్టవచ్చు. కేవలం షోకాజ్ నోటీసు మాత్రమే ఇచ్చామని, దీనిపై వివరణ ఇచ్చేందుకు పిటిషనర్ కు అవకాశం ఉందని మున్సిపల్ శాఖ తరఫు న్యాయవాది తెలిపారు. వాచ్ మెన్ గది నిర్మాణానికి అనుమతి తీసుకోవాలన్నారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి.. నిబంధనల ప్రకారం వాచ్‌మెన్ గది నిర్మాణానికి నిబంధనల ప్రకారం అనుమతి ఉన్నప్పటికీ ముందస్తు అనుమతి తీసుకోవాలన్నారు. ఇక్కడ పిటిషనర్ ఎలాంటి అనుమతి లేకుండా నిర్మాణం చేపట్టారని, ఈ నెల 24లోగా షోకాజ్ నోటీసుకు వివరణ ఇవ్వాలని పిటిషనర్ ను ఆదేశించింది. అంతే కాకుండా వాచ్‌మెన్ గది నిర్మాణాన్ని క్రమబద్ధీకరించేందుకు దరఖాస్తు చేసుకోవచ్చు. షోకాజ్ నోటీసుపై వివరణతో పాటు, పిటిషనర్ క్రమబద్ధీకరణ దరఖాస్తు (అప్లికేషన్స్) చేస్తే, దానిపై నిర్ణయం తీసుకునే వరకు ఎటువంటి కఠిన చర్యలు తీసుకోవద్దని అధికారులను ఆదేశించారు. క్రీడాభివృద్ధిలో భాగంగా ఐఎంజీకి అప్పగించిన భూమిని రిజిస్ట్రేషన్ రద్దు చేయడంపై బాధ్యులైన అధికారులపై ఏం చర్యలు తీసుకున్నారని మరో కేసులో హైకోర్టు ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. ప్రయివేటు కంపెనీకి అప్పగించిన భూమికి బాధ్యులైన వారిపై ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోలేదు. ఏకపక్షంగా భూముల బదలాయింపు కేసులో ప్రభుత్వమే దోషి అని వ్యాఖ్యానించింది. ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణలో భాగంగా ప్రభుత్వం చట్టం తీసుకొచ్చిందన్నారు. చట్టం తెచ్చే అధికారం ప్రభుత్వానికి ఉందన్నారు. వాదనల అనంతరం తదుపరి విచారణను ధర్మాసనం 28కి వాయిదా వేసింది.

## ఉత్తరప్రదేశ్‌లో ఘోర ప్రమాదం

(మొదటి పేజీ తరువాయి)

సహా 15 మంది మరణించారు. ట్రాక్టర్ ట్రాలీలో 30 మందికి పైగా భక్తులు ప్రయాణిస్తున్నారు. ఈ భక్తులందరూ మాఘ పౌర్ణమి సందర్భంగా కదర్‌గంజ్ ఘాట్‌లో గంగాస్నానం చేసి తిరిగి వస్తున్నారు. ట్రాక్టర్ ట్రాలీ ఒక్కసారిగా బోల్తా పడడంతో పెను ప్రమాదం జరిగింది. ఘటన అనంతరం డీఎం, ఎస్పీ సహా సీనియర్ పోలీసు అధికారులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. సహాయక చర్యలు ప్రారంభించారు. పోలీసులు, స్థానికులు సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను జిల్లా సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ప్రమాద స్థలం నుంచి మృతదేహాలను బయటకు తీశారు. సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాద ఘటనపై ప్రత్యక్ష సాక్షులు మాట్లాడుతూ.. ట్రాక్టర్ ట్రాలీ బోల్తా పడడంతో ఒక్కసారిగా అరుపులు వినిపించాయి. ట్రాలీలో ప్రయాణీస్తున్న వారిలో ఎక్కువగా మహిళలు, పిల్లలున్నారు.మృతుల్లో 8 మంది మహిళలు, 7 మంది చిన్నారులు ఉన్నట్లు స్థానికులు తెలిపారు. క్షతగాత్రులను తొలుత జిల్లాలోని సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. కొంత మంది భక్తుల పరిస్థితి విషమంగా ఉండడంతో వారిని మరో ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటన తర్వాత బాధితుల కుటుంబ సభ్యులు రోదనలతో మిన్నంటాయి.కస్గంజ్ రోడ్డు ప్రమాదంపై ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ఆయన ప్రగాఢ సానుభూతి తెలిపారు. అలాగే క్షతగాత్రులకు తగు చికిత్స అందించాలని జిల్లా అధికార యంత్రాంగానికి ఆదేశాలు జారీ చేశారు. కస్గంజ్ జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోవడం అత్యంత హృదయ విదారకరమని తెలిపారు. మృతుల కుటుంబ సభ్యులకు సానుభూతిని చెప్పారు. క్షతగాత్రులందరికీ ఉచిత వైద్యం అందించాలని జిల్లా యంత్రాంగం అధికారులను ఆదేశించారు. మరణించిన వారి ఆత్మలకు శాంతి చేకూరాలని, గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని శ్రీరాముడిని ప్రార్థిస్తున్నానని సీఎం యోగి చెప్పారు.ట్రాక్టర్ ట్రాలీలో 30 మంది ప్రయాణిస్తున్నట్లు కస్గంజ్ డీఎం సుధా వర్మ తెలిపారు. 15 మంది చనిపోయారు. క్షతగాత్రులకు చికిత్స అందిస్తున్నారు. మరికొంత మంది చెరువులో చిక్కుకుపోయి ఉంటారని ఆందోళన వ్యక్తం చేశారు. అందుకోసం ప్రస్తుతం సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.2 లక్షలు, క్షతగాత్రులకు రూ.50 వేలు చొప్పున ప్రభుత్వం పరిహారం ప్రకటించింది.

## కాంగ్రెస్ అంటేనే బంధుప్రీతి, అవినీతి

(మొదటి పేజీ తరువాయి)

బుజ్జగింపులు ఇవి తప్పా వేరే విషయంపై ఆలోచించదు. కాంగ్రెస్ నేతలు వారి కుమారులు, కుమార్తెల రాజకీయ భవిష్యత్తును రూపొందించడంలో బిజీగా ఉన్నారు. పేద ప్రజల కుమారులు, కుమార్తెల గురించి వారు ఎప్పుడూ ఆలోచించరు. దేశ ప్రజలంతా మోదీ కుటుంబ సభ్యులు. అందుకే దేశ అభివృద్ధి గురించే నేను, మా పార్టీ నేతలు మాట్లాడుతుంటారు. పేదలు, యువత, మహిళా సాధికారతతోనే అభివృద్ధి చెందిన దేశాన్ని నిర్మించవచ్చు. ఛత్తీస్‌గఢ్‌లో గత కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు ఇళ్ల పథకాన్ని నిలిపేసింది. మా ప్రభుత్వం ఆ పనుల్ని వేగవంతం చేసింది' అని మోదీ అన్నారు. ఈ కార్యక్రమంలో ఛత్తీస్‌గఢ్ సీఎం విష్ణు దేవ్ సాయ్, మంత్రులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్‌తో కాంగ్రెస్ లోపాయకారి ఒప్పందం: బిజెపి నేత లక్ష్మణ్

హైదరాబాద్,ఫిబ్రవరి24(వెలుతురు): తెలంగాణ సంపద దోచుకున్న బీఆర్ఎస్ నేతలతో కాంగ్రెస్ ప్రభుత్వం లోపాయికారి ఒప్పందం చేసుకుందని బీజేపీ ఎంపీ లక్ష్మణ్ అన్నారు. శనివారం నాడు బీజేపీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.... తెర వెనుక కుట్రలు, కుమ్మక్కు రాజకీయాలు బీఆర్ఎస్, కాంగ్రెస్‌కు అలవాటు అయ్యాయని ఆరోపించారు. బీజేపీ చెప్పిందే చేస్తుందని.. ఏ విషయనైనా బహిరంగంగా చెబుతుందని అన్నారు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో కాళేశ్వరం ప్రాజెక్టు, ధరణిపై సీబీఐతో విచారణ చేయిస్తామని రేవంత్ చెప్పారని.. ఇప్పుడెందుకు కాలయాపన చేస్తున్నారని నిలదీశారు. బీఆర్ఎస్‌తో బీజేపీ ఎప్పటికీ పొత్తు ఉండదని... పార్లమెంట్ ఎన్నికల్లో ఒంటరిగానే పోటీ చేస్తామని స్పష్టం చేశారు. గెలిచే గుర్రాలను 17 ఎంపీ స్థానాల్లో నిలపెట్టబోతున్నామని తెలిపారు.

# సెప్టెంబరు నాటికి రెండు యూనిట్లు సిద్ధం

(మొదటి పేజీ తరువాయి)

సన్నాహాలు చేస్తోంది. వైటీపీఎస్‌లో కీలకమైన ప్రజాభిప్రాయ సేకరణ కూడా పూర్తవడంతో పనులు వేగవంతం చేయాలని జెన్‌కో ఇంజనీర్లు, కాంట్రాక్టర్లను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశించారు. యాదాద్రి పవర్ ప్లాంట్ లో సెప్టెంబరు నాటికి రెండు యూనిట్లు సిద్ధం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం నల్లగొండ జిల్లా దామరచర్ల మండలం వీర్ల పాలెంలో చేపట్టిన యాదాద్రి అల్ట్రా మెగా సూపర్ క్రిటికల్ థర్మల్ విద్యుత్తు కేంద్రం' ఏర్పాటు చేసింది. ఈ నేపథ్యంలోనే వైటీపీఎస్ పనుల పురోగతిని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నేతృత్వంలో మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పర్యటించి పరిశీలించారు. వైటీపీఎస్‌లో ఉన్నతాధికారులతో ముగ్గురు మంత్రులు ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ మేరకు అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం ప్లాంటులో యూనిట్ల నిర్మాణం ఏ స్థాయిలో ఉంది? బొగ్గును తరలించడానికి రైల్వే ట్రాక్ నిర్మాణం పురోగతి, గతంలో చేసిన పనుల్లో బిల్లుల చెల్లింపులు, రానున్న కాలంలో జరగాల్సిన పనులు, నిర్వాసితులకు పరిహారం చెల్లింపుల్లో అక్రమాలు, ఇంకా ఎంత మందికి పరిహారం ఇవ్వాల్సి ఉంది.. తదితర అంశాలపై మంత్రులు జెన్‌కో అధికారులతో సమీక్షించారు.

ప్రపంచ వ్యాప్తంగా గ్రీన్ పవర్, రెనేవబుల్ ఎనర్జీ వైపు వెళుతుంటే గత పాలకులు థర్మల్ పవర్ వైపు దృష్టిసారించారనీ మంత్రులు చెప్పారు. పలు కారణాలతో ఇప్పటికే జాప్యం చేయడం మూలంగా రాష్ట్ర ఖజానాపై మోయలేని భారం పడిందని డిప్యూటీ సీఎం భట్టి అన్నారు. ప్లాంట్ లో ఉన్న స్కిల్ అండ్ స్కిల్డ్ కలిగిన వారికి ఉపాధి కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులు ఆదేశించారు. ప్లాంట్ కు అవసరమైన మెటీరియల్ సరఫరా, రైల్వే, రోడ్డు రవాణా వ్యవస్థలు శరవేగంగా అందుబాటులోకి తెచ్చేందుకు అవసరమైతే ప్రత్యేక పాలసీ తీసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. గ్రీన్ పవర్ ప్రాజెక్టు పూర్తయి అందుబాటులోకి వచ్చేటప్పటికీ యాదాద్రి థర్మల్ స్టేషన్‌లో విద్యుత్ ఉత్పత్తి జరగాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. ప్లాంట్ పనులు చేపట్టిన ప్రభుత్వరంగ సంస్థ బీహెచ్ఈఎల్ తొలి దశ పూర్తి చేయకపోతే సంస్థకు చెడ్డ పేరు వస్తుందని విషయాన్ని ఆ సంస్థ అధికారులు గుర్తించాలని అన్నారు. ప్రాజెక్టు పనులకు సంబంధించి నిర్లక్ష్యం, ప్రభుత్వ వ్యతిరేక కార్యకలాపాలు జరిగితే ఉపేక్షించేది లేదని భట్టి హెచ్చరించారు.

# ముగిసిన మహాజాతర

(మొదటి పేజీ తరువాయి)

టన్నుల బెల్లం అమ్మకాలు చేసినట్లు అంచనా. కిలో బెల్లానికి రూ.70 అనుకున్నా రూ.3.19కోట్ల బెల్లం వ్యాపారం జరిగినట్లు అంచనా. అయితే గ్రామాల నుంచి భారీ ఎత్తున బెల్లాన్ని కొనుగోలు చేసి తల్లులకు సమర్పించారు. అలా తెచ్చుకున్న మరో 500టన్నుల వరకు అంటే రూ.3.50కోట్ల విలువ ఉంటుందని అంచనా. జాతర లో 75లక్షలకు పైగా కొబ్బరి కాయలు అమ్మకాలు జ రిగాయి. ఒక్కో కొబ్బరి కాయకు రూ.50 వరకు విక్రయించారు. అంటే సుమారు రూ.37కోట్ల విలువైన కొ బ్బరి కాయల వ్యాపారం జరిగినట్లు అంచనా. చీరసారెలకు రూ.2కోట్ల వరకు విక్రయాలు జరిగాయి. మొత్తంగా ఈ నాలుగు రోజుల్లో అన్ని వ్యాపారాలు కలిపి సమారు రూ.1000కోట్లకు పైగా లావాదేవీ లు జరిగిఉంటాయని అంచనా వేస్తున్నారు. ఇక జాతర చివరి రోజైన శనివారం సాయంత్రం వనదేవతలు గద్దెలు దిగి తమ తమ నిజస్థానాలకు చేరుకున్నారు. చిలుకలగుట్టకు సమ్మక్కను, సారలమ్మను కన్నెపల్లికి, పగిడిద్దరాజును పోనుగొండ్లకు, గోవిందరాజును కొండాయికి చేర్చారు. ఫలితంగా నాలుగు రోజుల జాతర ముగిసినట్లయింది. ఈసారి గతంలో కన్నా మించి దాదాపు కోటిన్నర మంది భక్తులు వనదేవతలను సందర్శించుకున్నట్లు అంచనా.

### ఎంతో మహిమగల తల్లులు: స్పీకర్

సమ్మక్క, సారలమ్మ తల్లులు ఎంతో మహిమ కలిగిన దేవతలని అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ అన్నారు. శనివారం మేడారం వచ్చిన ఆయన సమ్మ క్క, సారలమ్మను దర్శించుకున్నారు. తొలుత గద్దెల ఎదుట ఏర్పాటు చేసిన తులాభారం వద్ద 72కిలోల ఎత్తు బంగారం సమర్పించారు. అనంతరం గద్దెలకు చేరుకొని చీర, గాజులు, పసుపు, కుంకుమను తల్లులకు సమర్పించారు. ఆ తర్వాత మీడియాతో మాట్లాడారు. తాను 25ఏళ్లుగా తల్లులను దర్శించుకుంటున్నానని, సంతానం కోసం స మ్మక్క తల్లికి మొక్కుకున్నానని, ఆ తల్లి ఆశీర్వాదంతోనే తనకు సంతానం కలిగిందని పేర్కొన్నారు. జాతరలో భక్తులు ఇబ్బందులు పడకుండా ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసిందని చెప్పారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి జాతరను అత్యంత వైభవంగా నిర్వహించారని అభినందించారు. ఇక జాతరను విజయవంతమైందని.. ఇందుకు అన్ని శాఖల అధికారులు, మీడియా ప్రతినిధులకు మంత్రి సీతక్క ధన్యవాదాలు చెప్పారు.

శనివారం మేడారంలో ఆమె మాట్లాడారు. ప్రపంచంలోనే మేడారం అతిపెద్ద జాతర అని, నాలుగు రోజుల్లో 1.45 కోట్ల మంది వనదేవతలను దర్శించుకున్నారని చెప్పా రు. సీఎం రేవంత్‌రెడ్డి అత్యధికంగా నిధులు కేటాయించారని, సుమారు 20 శాఖల అధికారులను సమన్వయం చేసి జాతరను విజయవంతం చేశామని పేర్కొన్నారు. ఆర్టీసీ ద్వారా మేడారం జాతరకు 10వేల ట్రిప్పుల బస్సులు నడిచాయని తెలిపారు. మిస్సింగ్ క్యాంపుల ద్వారా 5090 మంది భక్తులు తప్పిపోతే అందరినీ వారి కుటుంబ సభ్యుల వద్ద చేర్చామన్నారు. ఇక జాతర పూర్తయిన పది రోజుల వరకు పారిశుద్ధ్య పనులు కొనసాగుతాయన్నారు. కాగా అమ్మవారి కుంకుమ భరిణె అంత పవిత్రంగా తెలంగాణ రాష్ట్రాన్ని, రాష్ట్ర ప్రజల్ని పొత్తిళ్లలో పెట్టుకుని కాపాడుకుంటామని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. మేడారం జాతర విజయవంతం చేయడంలో భాగస్వామ్యం అయిన ప్రతి ఒక్కరికి మంత్రి కృతజ్ఞతలు తెలిపారు.

# 317, 46 జీవోలపై మంత్రివర్గ ఉప సంఘం

(మొదటి పేజీ తరువాయి)

ఈ క్యాబినెట్ సబ్ కమిటీ కన్వీనర్‌గా సాధారణ పరిపాలన శాఖ(జీఏడీ) కార్యదర్శి వ్యవహరించను న్నారు. కమిటీ నిర్వహించే సమావేశాలకు సంబంధిత శాఖల కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు హాజరు కావాలని ప్రభుత్వం ఆదేశించింది.

### వివాదం రేపిన 317 జీవో..

గత బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రపతి ఉత్తర్వుల సవరణతో రాష్ట్రంలో కొత్త జోన్లు, కొత్త జిల్లాలను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. కొత్త జిల్లాలు, జోన్లు, మల్టీ జోన్ల ఆధారంగా ఉద్యోగులు, ఉపాధ్యాయుల సర్దుబాటు చేపట్టేందుకు 317 జీవోను జారీ చేశారు. అయితే ఇది తీవ్ర వివాదాస్పదమైంది. కొత్త జిల్లాలకు సిబ్బందిని సర్దుబాటు చేసే క్రమంలో ప్రభుత్వం పెద్దఎత్తున ఉద్యోగ, ఉపాధ్యాయ బదిలీలు చేపట్టింది. సీనియారిటీ ప్రాతిపదికన ఉద్యోగులను వివిధ జిల్లాలకు కేటాయించారు. దాదాపు 30వేల మందిని బదిలీ చేశారు. ఈ సర్దుబాటు సక్రమంగా జరగలేదని, జూనియర్లను దూర ప్రాంతాలకు బదిలీ చేశారంటూ అప్పట్లో ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు ఆందోళన చేశాయి. స్థానికత ఆధారంగా సొంత జిల్లాలను కేటాయించాలని డిమాండ్ చేశాయి. ఈ బదిలీల సందర్భంగా కనీసం స్పౌజ్ కేసులను కూడా పట్టించుకోలేదని, బదిలీ అయినవారిలో సగం మందికి అన్యాయం జరిగిందంటూ సంఘాలు ఆరోపించాయి. దీంతో ప్రభుత్వం దిగొచ్చి భార్యాభర్తల కేసులను పరిష్కరించింది. అయితే 13జిల్లాల స్పౌజ్ కేసులను పరిష్కరించలేదు. ఇప్పటికీ భార్య ఒక చోట, భర్త మరో చోట పని చేయాల్సి వస్తోందని సంఘాలు అంటున్నాయి. ఉమ్మడి జిల్లాల్లో ఉన్న సర్వీసును కూడా పరిగణనలోకి తీసుకోలేదన్న ఆరోపణలున్నాయి. ఇది తమ పదోన్నతులపై తీవ్ర ప్రభావం చూపిందని ఉద్యోగులు అంటున్నారు. అయినా గత ప్రభుత్వం 317జీవో సమస్యను పరిష్కరించలేకపోయింది. ఇప్పటికీ ఈ సమస్య రగులుతూనే ఉంది. ఈ నేపథ్యంలో దీనిపై పూర్తి అధ్యయనం చేసి సిఫారసులు చేసేందుకు మంత్రివర్గ ఉప సంఘాన్ని ప్రభుత్వం ఆదేశించింది.

### ఉప సంఘం ఏర్పాటును స్వాగతిస్తున్నాం

ఉద్యోగులు, ఉపాధ్యాయులను తీవ్ర ఇబ్బందుల పాలుచేసిన 317 జీవోపై అధ్యయనం కోసం మంత్రివర్గ ఉప సంఘాన్ని ఏర్పాటు చేయడాన్ని స్వాగతిస్తున్నామని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.జంగయ్య, చావ రవి తెలిపారు. స్థానికత కోల్పోయిన ఉపాధ్యాయులు, వేర్వేరు జిల్లాలకు వెళ్లిన భార్యాభర్తలకు న్యాయం చేయాలని గత రెండేళ్లుగా తమ సంఘం పోరాడుతోందని తెలిపారు. మంత్రివర్గ ఉప సంఘం సత్వరమే సానుకూల పరిష్కారాలు చూపాలని కోరారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి మంత్రివర్గ ఉప సంఘాన్ని ఏర్పాటు చేయడం పట్ల కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ హర్షం వ్యక్తం చేశారు.

# ధరణి దరఖాస్తులకు మోక్షం

(మొదటి పేజీ తరువాయి)

ధరణి డేటా ఆధారంగానే రైతు బంధు నగదు జమ చేస్తుండడంతో ఇప్పటికే కోట్లాది రూపాయల ప్రభుత్వ ధనం దుర్వినియోగమైందని తెలిపింది. ఇప్పుడున్న ధరణి లోపాలను సవరించాలంటే చట్ట సవరణ చేయటం లేదా కొత్త ఆర్‌ఓఆర్ చట్టం చేయటం తప్ప గత్యంతరం లేదని కమిటీ సభ్యులు ముఖ్యమంత్రికి నివేదించారు.

### మరింత లోతుగా అధ్యయనం చేయండి

ధరణి కమిటీ ఇచ్చే తుది నివేదిక ఆధారంగా భూ రికార్డుల శాశ్వత పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు చేపడుతుందని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. అవసరమైతే చట్ట సవరణ చేయాలా? కొత్త చట్టం తీసుకురావాలా? అనే అంశాలను పరిశీలిద్దామని చెప్పారు. ధరణిలో లోపాలు, సమస్యలపై మరింత లోతుగా అధ్యయనం చేయాలని కమిటీకి సూచించారు. దరఖాస్తులు అప్రూవ్ చేసినా, లేదా రిజెక్ట్ చేసిన దానికి సంబంధించిన రిపోర్టు ఉండాలని పేర్కొన్నారు. ధరణి పోర్టల్ నిర్వహిస్తున్న ఏజెన్సీపై సమగ్ర విచారణ చేపట్టాలని రేవంత్‌రెడ్డి ఆదేశించారు. సీసీఎల్ఏ ఆధ్వర్యంలో బాధ్యతా యుతంగా నిర్వహించాల్సిన పోర్టల్‌ను ప్రైవేటు ఏజెన్సీలకు ఎందుకు అప్పగించారని అధికారులను ప్రశ్నించారు. లక్షలాది మంది రైతుల భూముల రికార్డులన్నీ విదేశీ కంపెనీ చేతుల్లో ఉండడం ఆందోళన కలిగిస్తోందన్నారు. అత్యంత గోప్యంగా ఉండాల్సిన భూముల డేటా, ఆధార్, బ్యాంకు ఖాతాల వివరాలను ఏజెన్సీ దగ్గర ఉంచడాన్ని సీఎం తప్పుబట్టారు.
భూ రికార్డుల డేటాకు భద్రత ఉందా? సురక్షితంగా ఉన్నట్టా.. లేనట్టా? అని అనుమానం వ్యక్తం చేశారు. 2018లో టెక్నికల్, ఫైనాన్షియల్ బిడ్డింగ్, అర్హతల ఆధారంగా ఐఎల్ఎఫ్ఎస్ అనే కంపెనీకి అప్పటి ప్రభుత్వం ధరణి పోర్టల్ డెవలప్‌మెంట్‌ను అప్పగించిందని అధికారులు బదులిచ్చారు. ఆ తర్వాత దివాలా తీసిన సదరు కంపెనీ.. చేతులు మారి టెర్రాసిస్ అని పేరు మార్చుకోవడం, డైరెక్టర్లు మారిపోవడం వంటి అంశాలపై సమావేశంలో సుదీర్ఘంగా చర్చ జరిగింది. బిడ్ దక్కించుకున్న కంపెనీయే మారిపోతే అప్పటి ప్రభుత్వం ఎలా అంగీకరించిందని సీఎం ఆరా తీశారు. 2018లో రూ.116 కోట్లకు ధరణి టెండర్ దక్కించుకున్న కంపెనీ తమ వాటాలను రూ.1200కోట్లకు అమ్ముకోవడం విస్మయం కలిగిస్తోందని పేర్కొన్నారు. భూ రికార్డులన్నీ వాళ్ల దగ్గరే ఉన్నందున.. విలువైన భూముల పేర్లు మార్చలేదని గ్యారంటీ ఏముందని ప్రశ్నించారు. కొన్ని సందర్భాల్లో అర్ధరాత్రి కూడా భూముల రిజిస్ట్రేషన్లు జరిగినట్లు ఫిర్యాదులు వచ్చాయని, ధరణి నిర్వహణపై నియంత్రణ, ఆజమాయిషీ లేదా? అని నిలదీసిన సీఎం.. మొత్తం వ్యవహారంపై విచారణ చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు.

### రేపటి నుంచి బయో ఏషియా సదస్సు

హెచ్ఐసీసీలో 21వ బయోఏషియా సదస్సును సోమవారం ఉదయం 10 గంటలకు సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నారు. మూడు రోజుల పాటు జరగనున్న సదస్సు కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. అమెరికాకు చెందిన శాస్త్రవేత్త, నోబెల్ అవార్డు గ్రహీత గ్రెగ్ సెమెన్జా సదస్సుకు హాజరుకానున్నారు. అంతర్జాతీయ ఫార్మా కంపెనీ ఎలిలిల్లి సీఈవో డేవిడ్ రిక్స్, బ్రిస్టల్ మేయర్స్ స్కిబ్ సీఈవో డాక్టర్ క్రిస్టోఫర్ బోర్నర్‌తోపాటు హెల్త్‌కేర్, లైఫ్ సైన్సెస్ రంగాలకు చెందిన జాతీయ, అంతర్జాతీయ కంపెనీల సీఈవోలు సదస్సులో పాల్గొంటున్నారు. 'డేటా అండ్ ఏఐ-రీడిఫైనింగ్ పాసిబిలిటీస'ను ఈ ఏడాది థీమ్‌గా నిర్ణయించారు.

# ఆటోలో ప్రయాణించిన కేంద్రమంత్రి రూపాల

## ప్రజలతో ముచ్చటించి సమస్యలపై ఆరా

హైదరాబాద్,ఫిబ్రవరి24 (వెలుతురు): పాతబస్తీలో బీజేపీ విజయ సంకల్ప సభలో పాల్గొనేందుకు కేంద్ర మంత్రి పురుషోత్తం రూపాలా నగరానికి చేరుకున్నారు. ఉప్పల్ ప్రాంతంలో ఆయన ఆటోలో ప్రయాణించారు. జనాలతో ముచ్చటిస్తూ వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఓ కేంద్రమంత్రి అయి ఉండి ఇలా సాధారణ ప్రయాణికుడిలా ఆటోలో ప్రయాణించడంపై పలువురు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఇందుకు సంబంధించిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. మరోవైపు.. బీజేపీ చేస్తున్నది విజయసంకల్ప యాత్ర కాదని అది విహారయాత్ర అని డీసీసీ అధ్యక్షుడు, దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండునెలల కాలంలో నే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాలనపరంగా సక్సెస్ అయ్యారని చెప్పారు. ప్రజలంతా రేవంత్‌ను హర్షిస్తుంటే బీజేపీ విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు.



## ప్రజాప్రతినిధుల రక్షణ

# ప్రభుత్వ బాధ్యత

(మొదటి పేజీ తరువాయి)

అప్పుడూ ఓ వాహనాన్ని తప్పించబోయి.. యాక్సిడెంట్ చేశాడు. అయితే ఈ ప్రమాదానికి ఓ వ్యక్తి మరణించినట్లు సమాచారం . అయితే వీటన్నింటినీ పరిగణలోకి తీసుకున్న మంత్రి పొన్నం ప్రభాకర్ కీలక ప్రకటన చేశారు. లాస్య నందిత మృతిపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు మంత్రి పొన్నం ప్రభాకర్, ఈ క్రమంలోనే వీఐపీల దగ్గర ఉన్న డ్రైవర్లకు ఫిట్ నెస్ పరీక్ష నిర్వహిస్తామని ప్రకటించారు. ప్రజాప్రతినిధుల రక్షణ ప్రభుత్వ బాధ్యత అని ఆయన చెప్పుకొచ్చారు. దీంతో ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలతో పాటు.. ప్రజాప్రతినిధుల దగ్గర ప్రస్తుతం ఉన్న డ్రైవర్లుగా పని చేస్తున్న వారికి ఫిట్ నెట్ పరీక్షలు నిర్వహించినున్నట్లు ఆయన వెల్లడించారు.ఇదిలా ఉండగా మహాలక్ష్మి పథకం కింద కండక్టర్లు అనవసరంగా టికెట్లు కొడితే.. కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. గతంలో రెగ్యులర్ గా 44లక్షల ప్రయాణాలు జరిగితే.. ఇప్పుడు 55లక్షల మందికి పైగా బస్సుల్లో ప్రయాణిస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఆటో డ్రైవర్లుగా పని చేస్తున్న వారికి రూ. 12వేల హామీ ఇచ్చామని మంత్రి పొన్నం గుర్తు చేశారు. దాన్ని ఖచ్చింగా నెరవేరుస్తామని హామీ ఇచ్చారు. మరో వైపు కులగణనపై అధికారులకు శిక్షణ ఇస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. బిహార్ లో 2.5 లక్షల మంది అధికారులను కేటాయించినట్లు ఆయన పేర్కొన్నారు. ఒక్కొక్కరికి 150 ఇండ్లు అప్పజెప్పాలరని పేర్కొన్నారు. ఇక్కడ కూడా ఇళ్లను బట్టి.. అధికారులను నియమిస్తామన్నారు. నోడల్ ఆఫీసర్ గా బీసీ వెల్ఫేర్ డిపార్టుమెంటు ఉంటుందన్నారు.

# బీజేపీ సొంతగా 370 సీట్లు సాధించలేదు

### వచ్చే నెలలో ఎన్నికల షెడ్యూల్

### ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ కీలక వ్యాఖ్యలు

న్యూఢిల్లీ,ఫిబ్రవరి24 (వెలుతురు): లోక్‌సభ ఎన్నికలు ముంచుకువస్తున్నాయి. వచ్చే నెలలో కేంద్ర ఎన్నికల సంఘం ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసే అవకాశం ఉంది. ఇదిలా ఉంటే బీజేపీ మరోసారి కేంద్రంలో అధికారంలోకి వస్తామని ధీమా వ్యక్తం చేస్తోంది. ఈసారి బీజేపీనే స్వతహాగా 370 సీట్లను సాధిస్తుందని, ఎన్డీయే కూటమి 400కి మించి సీట్లను గెలుస్తుందని ప్రధాని మోడీతో పాటు కేంద్ర నాయకత్వం చెబుతోంది.ఇదిలా ఉంటే ఓ జాతీయ ఛానెల్‌కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ప్రముఖ ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ కీలక వ్యాఖ్యలు చేశారు. 370 సీట్ల సంఖ్య కేవలం పార్టీ కార్యకర్తలకు బీజేపీ నిర్దేశించిన లక్ష్యం మాత్రమే అని అన్నారు.

అయితే, ఇది బీజేపీకి ప్రతిష్టాత్మక లక్ష్యమని చెప్పారు. బీజేపీ సొంతంగా 370 సీట్లు గెలువలేదని అన్నారు.కాగా.. బీజేపీ 370 సీట్ల గెలుపుపై అమిత్ షా ఇటీవల వారి వ్యూహాన్ని ప్రకటించారు. ఆర్టికల్ 370ని తొలగించామని అందుకే తాము 370 సీట్లను లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. జమ్మూ కాశ్మీర్ అభివృద్ధికి ప్రతిబంధకంగా మారిన ఆర్టికల్ 370ని 2019లో కేంద్రం తొలగించింది. భారత రాజ్యాంగం, చట్టాలు నేరుగా ఆ ప్రాంతానికి వర్తించేలా బీజేపీ మార్గం సుగమం చేసింది.




## బిజెపి ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శిగా భోగ విజయభాస్కర్..

**కరీంనగర్ వెలుతురు ఫిబ్రవరి 24:** భారతీయ జనతా పార్టీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శిగా భోగ విజయభాస్కర్ నియామకం జరిగింది. ఈ మేరకు ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు జి.ఆనంద్ గౌడ్ శనివారం నియామక ప్రకటన విడుదల చేశారు. ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన సందర్భంగా భోగ విజయభాస్కర్ మాట్లాడుతూ ఓబీసీ మోర్చా రాష్ట్ర కమిటీ నూతన కార్యవర్గంలో తనకు అవకాశం కల్పించిన బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు బండి సంజయ్ కుమార్ , జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి కి, బిజెపి నాయకత్వానికి, శ్రేణులందరికీ కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు చెప్పారు. తనపై నమ్మకంతో కార్యదర్శి పదవి అప్పగించినందుకు బిజెపి ఓబీసీ మోర్చా బలోపేతానికి, పార్టీ పటిష్టతకు శాయశక్తుల కృషి చేస్తానని భోగ విజయభాస్కర్ ఈ సందర్భంగా తెలిపారు.

## కూలే పరిస్థితిలో ప్రభుత్వ పాఠశాల

### హిమాయత్ నగర్ డివిజన్ కార్పొరేటర్ మహాలక్ష్మి రామానుగౌడ్

**హైదరాబాద్ వెలుతురు ఫిబ్రవరి 24:** శనివారం రోజున హిమాయత్ నగర్ డివిజన్ కార్పొరేటర్ మహాలక్ష్మి రామానుగౌడ్ స్ట్రీట్ నెంబర్ 15 లో ఉన్న ప్రభుత్వ పాఠశాలనీ సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడున్న సిబ్బంది పాఠశాల భవనం చాలా పాతదై మరియు ఒక చెట్టు ఎప్పుడైనా కూలే పరిస్థితి




ఉందని వారి దృష్టికి తేవడం జరిగింది. వారు దీనికి స కులంగా సంబంధించి సంబంధిత అధికారులతో మాట్లాడి వెంటనే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డ్యూపూటి డిఇఓ ఎం.విజయ లక్ష్మి డ్యూపూటి.ఐఓఎస్ . లక్ష్మణ్ సింగ్, ప్రిన్సిపాల్ ఎం సుజాత, హైస్కూల్ ప్రిన్సిపాల్ మురళి, ఇంచార్జి నవీన దేవి. మరియు బి ఆర్ ఎస్ సీనియర్ నాయకులు జి రామన్ గౌడ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



## "అక్షిత ఫౌండేషన్" ఆధ్వర్యంలో వృద్ధురాలికి సహాయం



**వికారాబాద్ జిల్లా వెలుతురు (ఫిబ్రవరి 24) :** పరిగి విలేజ్ లోనీ బీసీ కాలనీలో దీనస్థితిలో లేవలేని పరిస్థితుల్లో ఉన్న ఒక వృద్ధురాలి గురించి స్థానిక విలేకరి మకు తెలుపగా "అక్షిత ఫౌండేషన్" ఆధ్వర్యంలో మా సభ్యులతో కలిసి అక్కడికి వెళ్లి వారి నివాసం మొత్తం శుభ్రం చేసి మ సభ్యురాలితో వారికి స్నానం చేపించి కొత్త బట్టలు వేసి వారికి సేవ, సహాయ, సదుపాయాలను అందజేశాము. స్థానిక అధికారులకు తగిన సహాయాన్ని అందించాలని కోరము. ఫౌండర్ అండ్ చైర్మన్ అక్షిత ఫౌండేషన్...



### మర్యాద పూర్వకంగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రిని కలిసిన

# టిజివోస్ నాయకులు

**హైదరాబాద్ వెలుతురు ఫిబ్రవరి 24:** తెలంగాణ గెజిటెడ్ అధికారుల కేంద్ర సంఘం అధ్యక్షులు శ్రీ ఏలూరి శ్రీనివాస్ రావు గారి ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు గౌ॥శ్రీ ఎనుముల రేవంత్ రెడ్డి గారిని శనివారం రోజున సచివాలయంలో మర్యాద పూర్వ కంగా కలవడం జరిగింది. జి.ఎడి ఆదేశాలను అనుసరించి ప్రణాళిక బద్ధంగా, ప్రశాంతంగా ఎన్నికల ప్రక్రియ నిర్వహించ డానికి సహకరించిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు. అదే విధంగా తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం నూతనంగా ఏన్నుకోబడిన అధ్యక్షులు ఏలూరి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి ఎ. సత్యనారాయణ, అసోసియేట్ అధ్యక్షులు బి. శ్యామ్, ఉపాధ్యక్షులు ఎ. జగన్ మోహన్రావు, కోశాధికారి ఎమ్. ఉపేందర్ రెడ్డి, జాయింట్ సెక్రటరీ ఎ. పరమేశ్వర్రెడ్డి, మహిళా ప్రతినిధి జి. దీపారెడ్డి, అర్గనైజింగ్ సెక్రటరీ ఎమ్. రామకృష్ణగౌడ్, కార్యనిర్వాహక సభ్యుడు పి. యాదగిరి గౌడ్, సలహదారులు: టి. రవీందర్రావు, జి. పురుషోత్తమ్ రెడ్డి, వి. సురేష్ లకు శుభాకాంక్షలు తెలియజేశారు.

అదే విధంగా ముఖ్యమంత్రి గారికి పెండింగ్‌లో ఉన్న 3 డి.ఎ.లలో కనీసం (1) ఒక్కటైన సత్వరమే పార్లమెంట్ ఎన్నికలకు ముందు విడుదల చేయాలని కోరారు. ఈ–కుబేరులో ఉన్న బిల్లుల విడుదల, పెండింగ్లో ఉన్న డి.ఎ. ఎరియల్స్ బిల్లులను సత్వరమే విడుదల చేయాలనని కోరగా ఈ విషయాలపై ముఖ్యమంత్రి గారు సానుకులంగా స్పందించారని తెలియజేశారు. అదే విధంగా మెరుగైన పి.ఆర్.సి.ని ప్రకటించాలని, సి.పి.ఎస్ అంశం, జి.ఓ 317 సమస్య, జనరల్ బదిలీలు, ఉద్యోగులకు, పెన్షనర్లకు ఇ.హెచ్.ఎస్.ను ఉద్యోగుల కాంట్రీబ్యూషన్తో వెంటనే అమలులోకి తెవాలనే ఈ విషయాలపై త్వరిత గతిన పరిష్కరించాలని కోరనైనది. శనివారం రోజున జివో 317 ద్వారా నూతన జోన్స్ ఏర్పాటు చేసి అనాలోచితంగా ఉద్యోలను బదిలీ చేయడం వలన నష్టపోయిన వారికి న్యాయం చేయడానికై క్యాబినేట్ సబ్ కమిటీ వేసినందుకు ముఖ్యమంత్రిగారికి తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం కృతజ్ఞతలు తెలియజేసింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన 6 గ్యారెంటీలను ప్రజలకు అందించే విషయంలో ప్రతిష్టాత్మకంగా యావత్ రాష్ట్రంలో అమలు జరిగే విధంగా 33 జిల్లాలు, రెండు స్పషల్ బ్రాంచ్ హైదరాబాద్ సిటీ, సెక్రటిరేయేట్తో కలిపి దాదాపుగా 35000 వేల పైచిలుకు గెజిటెడ్ అధికారులు, 57 హెచ్.ఓ.డి యూనిట్స్ అందరం కలిసి కట్టుగా కృషి చేస్తామని ఈ సందర్భంగా చేప్పడం జరిగింది.

ఈ కార్యక్రమంలో టిజివో కేంద్ర సంఘనాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు పట్ల టీయూటీఎఫ్ హర్షం

**హైదరాబాద్ వెలుతురు ఫిబ్రవరి 24:** 317 జీవో అమలులో జరిగిన సందర్భంలో ఏర్పడిన సమస్యలను అధ్యయనం చేసి పరిష్కారాలను సిఫారసు చేయటం కోసం 292 జీవో ద్వారా వైద్య, ఆరోగ్య శాఖామాత్యులు దామో దర రాజనర్సింహ గారి అధ్యక్షతన, శ్రీధర్ బాబు, పొన్నం ప్రభా కర్ గార్ల సభ్యులుగా మంత్రివర్గ ఉప సంఘాన్ని ఏర్పాటు చేయ డాన్ని తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీయూటీఎఫ్) హర్షం వ్యక్తం చేస్తున్నది.

రాష్ట్రపతి ఉత్తర్వులు 2018 అమలులో భాగంగా ఉద్యోగ,ఉపాధ్యాయుల శాశ్వత కేటాయింపుల కోసం గత ప్రభుత్వం జరిపిన 317 జీవో అమలు కారణంగా పలువురు ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు తీవ్రంగా నష్టపో యారు. క్యాడర్‌లో జూనియర్ అయినందుకే స్వంత


తుమ్మ లచ్చిరాం, టీయూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు.


పాటిమీది రఘు నందన్ రెడ్డి, టీయూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి.

జిల్లాలను వదిలి స్థానికేతర జిల్లాలకు కేటాయించబడ్డారు. ప్రస్తుతం గత 2 సం.లుగా 317 జీవో అమలు ద్వారా నష్టపోయిన ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని టీయూటీఎఫ్ పక్షాన ప్రజాప్రతినిధులకు, అధికారులకు ప్రాతినిధ్యాలు చేయడం జరుగుతున్నది. 317 జీవో ద్వారా నష్టపోయిన ఉపాధ్యాయులకు న్యాయం చేయడానికి తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు చర్యలు ప్రారంభించినందుకు కృతజ్ఞతలు తెలియజేస్తు న్నాము. 317 జీవో అమలు కారణంగా ఉత్పన్నమైన పలు రకాల సమస్యలను ఉపసంఘం అధ్యయనం చేసి వేసవి సెలవులలోగా సానుకూల పరిష్కారాలను ప్రభుత్వానికి సిఫారసు చేసి 317 జీవో బాధిత ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ తరపున కోరుతున్నాము.



## పార్లమెంట్ సభ్యులు బి.బి పాటిల్‌కు కృతజ్ఞతలు తెలియజేసిన వడ్డెర సంఘం నాయకులు

**జహీరాబాద్, 24 ఫిబ్రవరి, వెలుతురు :** జహీరాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 13వ వార్డు బాగారెడ్డిపల్లి వడ్డెర కమ్యూనిటీ హాల్ వద్ద ఐమాక్స్ పోల్ ఏర్పాటు చేయాలని గతంలో వడ్డెర సంఘం నాయకులు పార్లమెంట్ సభ్యులు బీబీ పాటిల్ ను కోరడం జరిగింది. వారికి ఇచ్చిన మాట ప్రకారం బి.బి పాటిల్ తన నిధులనుండి లక్ష రూపాయల విలువైన ఐమాక్స్ విద్యుత్ దీపాలను మంజూరు చేసి ఈరోజు ఏర్పాటు చేయించడం జరిగింది. విద్యుత్ దీపాలను బి ఆర్ ఎస్ సీనియర్ నాయకులు నామ రవి కిరణ్, బండి మోహన్, సంఘం నాయకులతో కలిసి శనివారం ప్రారంభించడం జరిగింది. అనంతరం వడ్డెర సంఘం నాయకులు మాట్లాడుతూ విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయించినందుకు ఎంపీ బిబి పాటిల్ , స్థానిక ఎమ్మెల్యే మాణిక్ రావు, వార్డు మాజీ కౌన్సిలర్ బండి రంగమ్మ లకు ధన్యవాదాలు తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు అశోక్, వెంకట్, శేఖర్, లక్ష్మణ్, నాగేష్, దశరథ్ మరియు వార్డు ప్రజలు పాల్గొన్నారు.



## మంత్రి రాజనర్సింహను కలసిన మార్కెట్ కమిటీ చైర్మన్ సాయిచరణ్

**జహీరాబాద్, 24 ఫిబ్రవరి, వెలుతురు :** సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గా నూతనంగా నియమితులైన మాజీ మంత్రి, జహీరాబాద్ నియోజకవర్గం చీఫ్ కోఆర్డినేటర్ డాక్టర్ ఆగం చంద్రశేఖర్ కుమారుడు ఆగం సాయిచరణ్ తెలంగాణ రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహను మర్యాద పూర్వకంగా కలిసి వారి ఆశీస్సులు తీసుకున్నారు. దామోదర రాజనర్సింహ హైదరాబాద్‌లోని తన కార్యాలయంలో మంత్రి దామోదర రాజనర్సింహ ను జహీరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన చైర్మన్ గా నియమితులైన ఆగం సాయిచరణ్, మాజీ మంత్రి జహీరాబాద్ ఇన్చార్జి చీఫ్ కోఆర్డినేటర్ డాక్టర్ ఏ. చంద్రశేఖర్ లు శనివారం ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ లను కలిసి వారి ఆశీస్సులు తీసుకున్నారు. అనంతరం వారిని పుష్పగుచ్ఛం ఇచ్చి శాలువాతో సన్మానించారు.

### నేడే జహీరాబాద్‌లో యునైటెడ్ హాస్పిటల్, బీదర్ ఆధ్వర్యంలో

## ఉచిత మెగా హెల్త్ క్యాంపు


**జహీరాబాద్, 24 ఫిబ్రవరి, వెలుతురు :** సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణం తాండూర్ రోడ్డు మార్గంలోగల తవక్కల్ ఫంక్షన్ హాల్ నేడు యునైటెడ్ హాస్పిటల్, బీదర్ ఆధ్వర్యంలో ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు ప్రజల కోసం ఉచిత మెగా హెల్త్ క్యాంపు నిర్వహిస్తున్నామని జహీరాబాద్ జమాత్ ఉలేమా హింద్ కార్యాలయం శాంతి నగర్ కాలనీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ముఫ్తీ అబ్దుల్ సబూర్ ఖాస్మీ చైర్మన్ హీరా ఫౌండేషన్ మేనేజింగ్ డైరెక్టర్, డా. ముహమ్మద్ ఇమ్రాన్ అల్ హఖ్, డాక్టర్ సలావుద్దీన్, సయ్యద్ అహ్మద్ అడ్వకేట్, ముహమ్మద్ అక్బర్ లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనుభవజ్ఞులైన బిపి, షుగర్, నేత్ర వైద్య నిపుణులు పాల్గొని ఉచ్చితంగా పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచిత మందులు అందిస్తారని తెలిపారు. యునైటెడ్ హాస్పిటల్, బీదర్ ఆధ్వర్యంలో ఉచ్చిత వైద్య ఆరోగ్య శిభిరంలో అధిక సంఖ్యలో జహీరాబాద్ పరిసర ప్రాంత ప్రజలు హాజరై ఇట్టి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారి విజ్ఞప్తి చేశారు.




## అల్లా దయతో రాష్ట్ర ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలి

### మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు

### - జిల్లా ప్రజలకు షబ్బే - బరాత్ పర్వదిన శుభాకాంక్షలు.



**సిద్దిపేట టౌన్ వెలుతురు ఫిబ్రవరి24:** సిద్దిపేట జిల్లా ప్రజలకు మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు షబ్బే – బరాత్ పర్వదినం సందర్భంగా ముస్లిం సోదర సోదరిమణిలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ పండుగ సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా ముస్లిం సోదరి సోదరులంతా రెండు రోజుల ఉపవాస దీక్షలు చేయడంతోపాటు రాత్రంతా జాగారం చేసి ప్రత్యేకంగా నమాజులు ఖురాన్ చదువుతారని అన్నారు. రాష్ట్ర ప్రజలందరూ సంతోషాలతో ఉండాలని అల్లా తో ప్రార్థిస్తున్ననని అన్నారు.

# సంపాదకీయం..

## కాంగ్రెస్ ఢిల్లీ గులామిని వదులుకోవాలి!

తెలంగాణలో కాంగ్రెస్ విజయం అన్నది కేవలం కెసిఆర్ వ్యతిరేకతతోనే అని కాంగ్రెస్ నేతలు ఎంత త్వరగా గుర్తిస్తే అంతమంచిది. అలాగే ప్రజాసంక్షేమంతో పాటు అభివృద్ధి పనులను పరుగులు పెట్టించాలి. నిర్ణయాలు త్వరితంగా తీసుకుంటూనే.. వాటి అమలును కూడా వేగవంతం చేసుకోవాలి. ఈ క్రమంలో కాంగ్రెస్ పెద్దలను అతిగా ఇక్కడ జోక్యం చేసుకోకుండా చూసుకోవాలి. గత వాసనలు వదిలించుకుంటే తప్ప ఇక్కడి రేవంత్ ప్రభుత్వం నిలదిక్కుకోలేదు. ఇక్కడి నిరుద్యోగ యువత, కళాకారులు, మేధావులు, జర్నలిస్టులు, సబ్బండ వర్గాలు తెలంగాణ ఏర్పాటుకు పోరాడారు. ఎందరో ఆత్మార్పణం చేశారు.. వారి పోరాటంతో తెలంగాణ సాకారమయ్యింది. అయితే అది తన ప్రతిభ వల్లనే అని, తను మృత్యుముఖంలోకి వెళ్లి వచ్చానని ప్రకటించుకోవడంతో పాటు, పదేళ్ల పాటు కెసిఆర్ నిరంకుశంగా పాలించారు. విర్రవీగిన పాపానికి మూల్యం చెల్లించారు. దాని ఫలితమే కరిమింగిన వెలగపండులాగా ఇప్పుడు అప్పుల కుప్పలు బయటపడ్డాయి. నాయకుల అవినీతి బయటపడుతోంది. ఈ విషయాలను గుర్తించి ఇచ్చిన హామీల అమలు కోసం చేసే కార్యక్రమంలో కాంగ్రెస్ పెద్దలను పదేపదే పాల్గొనేలా చేయడం వల్ల ప్రజల్లో విమర్శలపాలు కాకతప్పదు. కేవలం ఇక్కడి ప్రజలే తమ హీరోలుగా కార్యక్రమాలతో ముందుకు సాగాల్సి ఉంది. అదే రేవంత్ ప్రభుత్వానికి శ్రీరామరక్ష కానుంది. మల్లికార్జున ఖర్గే మొదలు, రాహుల్, సోనియా, ప్రియాంకలను పార్టీపరంగా ఢిల్లీకి వెళ్లి కలవడం వేరు..అదే పనిగా వారే ఇక్కడి కార్యక్రమాలను నిర్దేశించేలా చేసుకోవడం వల్ల ముప్పు ఉంటుందని గుర్తించాలి. గతంలో ప్రతిపనికి ఢిల్లీకి వెళ్లిన కారణంగానే కాంగ్రెస్ భ్రష్టుపట్టి, ప్రాభవం కోల్పోయింది. గతానుభవాలను బట్టి నడుచుకోవాల్సి ఉంది. అందుకే తెలంగాణ పాలనలో వారికి దూరంగా నిర్ణయాలు జరగాలి. వారి ప్రమేయం పెరిగితే మొదటికే మోసం జరగగలదు. ఇప్పటికే కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఢిల్లీ నుంచి పాలన అన్న విమర్శలు వస్తున్నాయి. రేపటి సిలిండర్, గృహజ్యోతి పథకాలను కూడా ఇక్కడి సామాన్యులతో ప్రారంభించి ఉంటే మరింతగా రేవంత్ ప్రతిభ పెరిగేది. ఎందుకంటే ఇండియా కూటమిలో లుకలుకలు ఇక్కడ ప్రభావం పడకుండా చూసుకోవాలి. అవకాశం వస్తే మింగేద్దామన్న రీతిలో బిజెపి, బిఆర్ఎస్ కాచుకుని ఉన్నాయి. 2024 లోక్‌సభ ఎన్నికలలో తాము 400కి పైగా సీట్లు గెలుచుకుని తీరతామని బీజేపీ ప్రకటిస్తోంది. వారసత్వ రాజకీయాలను గట్టిగా వ్యతిరేకిస్తోంది. కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఖర్గే ఉన్నా పెత్తనం సోనియా, రాహుల్‌దేనని తెలిసిందే. ఇప్పటికే కూటమి నుంచి నితీశ్ వైదొలిగారు. నీరసపడిన కాంగ్రెస్ ఇబ్బందికరమైన పరిస్థితులను ఎదుర్కొంటున్నది. యూపిలోని అమేథీని ఇప్పటికే కోల్పోగా, రాయబరేలిలో కూడా విజయం కష్టమే. కాంగ్రెస్ ముక్త రాజకీయాలను మోడీ బలంగా తీసుకుని వెళుతున్నారు. కాంగ్రెస్ రాబోయే సార్వత్రిక ఎన్నికలలో కనీసం 50కి పైగా సీట్లనైనా కైవసం చేసుకోగలదా అన్న ప్రశ్నలు ఉదయిస్తున్నాయి. 2014 లోక్‌సభ ఎన్నికలను తీసుకుంటే.. కేవలం 44 సీట్లు మాత్రమే కాంగ్రెస్‌కు దక్కాయి. కాంగ్రెస్ స్వతంత్ర భారత సార్వత్రిక ఎన్నికల్లో ఇంత తక్కువ సీట్లను మాత్రమే గెలుచుకోవడం అదే మొదటిసారి. 2019 సార్వత్రిక ఎన్నికల్లో కూడాకాంగ్రెస్ పరిస్థితి మెరుగు పడలేదు. 2014లో కంటే కేవలం 8 సీట్లు మాత్రమే అదనంగా గెలుచుకోగలిగింది.. కేరళ, తమిళనాడులో అధికార పార్టీలతో పొత్తు పెట్టుకుని పోటీ చేయడం వల్లే 2019లో 52 సీట్లను కాంగ్రెస్ గెలుచుకోగలిగింది. 2024 సార్వత్రిక ఎన్నికలలో సైతం కేరళ, బహుశా తెలంగాణ మినహా మరే రాష్ట్రంలోనైనా కాంగ్రెస్ గెలుచుకోగల సీట్ల సంఖ్య రెండంకెలలో ఉండటమనేది కష్టమని ఒపీనియన్ పోల్స్ దాదాపుగా అన్నీ ఘోషిస్తున్నాయి. 2014లోనూ, 2019లోనూ కేంద్రంలో బీజేపీ అధికారానికి రావడానికి కాంగ్రెస్ స్వయంకృత రాజకీయాలే కారణం. ఈ నిజాన్ని రాష్ట్ర కాంగ్రెస్ నేతలు త్వరగా గుర్తించాలి. ఇక్కడ కాంగ్రెస్ ముసుగు ఉన్నా ప్రజలు మాత్రం కేవలం కెసిఆర్, బిజెపి వ్యతిరేకతతో గెలిపించారని తెలుసుకోవాలి. అలా తెలుసుకుని తమ రాజకీయాలన్నీ ఉద్యమ పోరాటాల చుట్టూ సాగించాలి. అప్పుడే తెలంగాణలో మెరుగైన ఫలితాలు వస్తాయి. ఎందుకంటే ఇప్పటికే బిజెపి బిఆర్ఎస్ వ్యతిరేక ప్రచారాన్ని ముమ్మరం చేసింది. బిఆర్ఎస్ ఒక్కసీటు గెల్చినా దేశానికి లాభం లేదని వాదిస్తోంది. బిఆర్ఎస్‌కు ఓటేస్తే మూసీలో వేసినట్లేనని వాదిస్తోంది. కవితకు సిబిఐ సమన్లు పంపడం ద్వారా బిఆర్ఎస్‌తో ఎలాంటి పొత్తు లేదని చెబుతోంది. కర్నాటక పరిస్థితులు వేరు. తెలంగాణ ప్రజలు వేరు. తెలంగాణలో ప్రజలు సెంటిమెంట్‌కు విలువనిస్తారు. అది చేజారకుండా చూసుకోవాల్సిన బాధ్యత సిఎం రేవంత్ రెడ్డికి, ఆయనతో పాటు అధికారం పంచుకున్న బృందానికి ఉంది. ఉద్యమకారులు, అమరుల కుటుంబాలు, పోరాటయోధులను ఆలంబనగా చేసుకుని వారి కార్యక్రమాలు సాగాలి. మేధావుల సూచనలు,సలహాలు తీసుకోవాలి. గృహజ్యోతి, సిలిండర్ పథకాలకు కూడా వీరినే హీరోలుగా తీసుకుని అమలు చేయాలి. అంతేగానీ ప్రియాంక రాకవల్ల మైలేజీ వస్తుందని అనుకుంటే పొరపాటే. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకుని వాటిని సత్వరంగా పరిష్కరించే క్రమంలో సొంతంగా నిర్ణయాలు ఉండాలి. అదేపనిగా ఢిల్లీ యాత్రలను మానుకోవాలి. అవసరమైతే లోపాయకారిగా హాట్‌లైన్‌లో మాట్లాడుకోవాలి. అప్పుడే రేవంత్‌పై ప్రజల్లో నమ్మకం పెరుగుతుంది. కెసిఆర్ చేసిన తప్పులను చేయకుండా ముందుకు సాగాలి. అన్ని వర్గాలకు తాము అండగా ఉన్నామని చెప్పడం వేరు..ఆచరించి చూపడం వేరు. రైతుబంధు, కాళేశ్వరం,గొర్రెల పథకంలో దుబారాను, అవినీతిని బయటపెట్టి నిలదీయగలిగితే ప్రజలు హర్షిస్తారు. అదేపనిగా విమర్శలతో కాలం గడిపితే కూడా ప్రజలు ఆదరించారు. ఈ జాగ్రత్తలు తీసుకుని ముందుకు సాగితేనే రేవంత్ రెడ్డి సమర్థమైన సిఎంగా రాణిస్తారు.



## రాజ్యసభకు తిరిగి ఎన్నిక అధికులకు క్రిమినల్ చరిత్ర

రాజ్యసభకు తిరిగి ఎన్నికైన వారికి క్రిమనల్ చరిత్ర ఉందని తేలింది. 2004 నుంచి 2019 మధ్య తిరిగి ఎన్నికైన 23 మంది ఎంపిల్లో 12 మందిపై క్రిమినల్ కేసులున్నాయని ఎన్నికల సంబంధిత డేటాను విశ్లేషించే సంస్థ 'అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్' (ఎడిఆర్) వెల్లడించింది. 12 మందిలో తొమ్మిది మంది ఎంపిలపై హత్య, హత్యాయత్నం, దోపిడీ సహా తీవ్రమైన క్రిమినల్ కేసులు ఉన్నాయని పేర్కొంది. 2004-2019 మధ్య అభ్యర్థుల ఎన్నికల అఫిడవిట్‌లను విశ్లేషించి ఈ నివేదికను రూపొందించినట్లు తెలిపింది. జాబితాలో చేర్చబడిన 23 మంది ఎంపిలలో 52 శాతం మంది తమపై క్రిమినల్ కేసులు ఉన్నాయని, 39 శాతం మంది ఎంపిలపై తీవ్రమైన క్రిమినల్ కేసులు నమోద య్యాయని పేర్కొంది. పార్టీల వారీగా గణాంకాలను కూడా ఈ నివేదికలో సమర్పించారు. బిజెపికి తిరిగి ఎన్నికైన 17 మంది ఎంపిలలో ఏడుగురు (41 శాతం), ముగ్గురు కాంగ్రెస్ (100 శాతం) ఎంపిలు క్రిమినల్ కేసులను ఎదుర్కొంటున్నారు. ఆల్ ఇండియా మజ్లిస్-ఇ-ఇత్తెహాదుల్ ముస్లిమీన్ (ఏఐఎంఐఎం) నుండి ఎన్నికైన ఒకరు, శివసేనకు చెందిన ఓ ఎంపిలు తమపై ఉన్న క్రిమినల్ కేసులను అఫిడవిట్‌లో ప్రకటించారు. తిరిగి ఎన్నికైన ఎంపిలలో నలుగురు తమ విద్యార్హతలను 10వ తరగతి, 12వ తరగతి మధ్య ఉన్నట్లు ప్రకటించగా, 18 మంది గ్రాడ్యుయేషన్, అంతకంటే ఎక్కువ విద్యార్హత ఉన్నట్లు తెలిపారు. వారిలో ఒకరు డిఎలోమా హోల్డర్ అని ప్రకటించారు. ఈ ఎంపిలలో 19 మంది వయస్సు 51 నుండి 80 సంవత్సరాల మధ్య ఉండగా, నలుగురి వయస్సు 40 నుండి 50 ఏళ్ల మధ్య ఉంది. తిరిగి ఎన్నికైన 23 మంది ఎంపిలలో కేవలం ముగ్గురు మాత్రమే మహిళలు ఉన్నారు. 2004లో ఈ ఎంపిల సగటు ఆస్తి విలువ రూ.1.52 కోట్లు ఉండగా, 2009 నాటికి రూ.3.46 కోట్లుకి చేరుకుంది. 2014లో రూ.9.85 కోట్లు, 2019లో రూ.17.51 కోట్లకు చేరుకున్నట్లు నివేదిక తెలిపింది. 2004 నుండి 2019 మధ్య వీరి సగటు ఆస్తి వృద్ధి రేటు రూ.15.98 కోట్లుగా ఉంది.

# చిగురిస్తున్న 'ఇండియా'

కేంద్రంలో బిజెపి ప్రభుత్వాన్ని గద్దె దింపడమనే ఏకైక లక్ష్యంతో కూటమిగా ఏర్పడిన ప్రతిపక్షాలు ఆ దిశగా పురోగతి సాధిస్తున్నట్లు కనిపిస్తోంది. గత ఏడాది జూన్‌లో 'ఇండియా' కూటమిగా ఏర్పడిన విపక్షాలు ఆ తర్వాత సీట్ల సర్దుబాటు విషయంతో కాంగ్రెస్ పెద్దన్న తీరుతో విసిగిపోయి ఒకటొకటిగా వేరు కుంపట్లు పెట్టుకోవడం మొదలుపెట్టాయి. దీంతో కూటమి మనుగడే ప్రశ్నార్థకమయింది. ముందుగా కూటమి ఏర్పాటులో కీలక పాత్ర పోషించిన బీహార్ సిఎం, జెడి(యు) అధ్యక్షుడు నితీశ్ కుమార్ 'మహా ఘట్‌బంధన్'కు గుడ్‌బై చెప్పి తిరిగి బిజెపితో జతకట్టడంతో ఆ కూటమికి ఎదురుదెబ్బ తగిలింది. అదే సమయంలో కూటమిలో భాగస్వాములయిన బెంగాల్‌లో మమత పార్టీ తృణమూల్ , యుపిలో అఖిలేశ్ నేతృత్వంలోని ఎస్‌పి, ఢిల్లీ సిఎం కేజ్రీవాల్ పార్టీ ఆప్ తమ తమ రాష్ట్రాల్లో ఒంటరిగానే బరిలోకి దిగుతామని ప్రకటించి కాంగ్రెస్‌ను డిఫెన్స్‌లో పడేశాయి. అయితే కేవలం వారాల వ్యవధిలోనే రాజకీయాలు పూర్తిగా మారిపోయాయి. ఇప్పుడు ఆ పార్టీలు ఒక్కటొక్కటిగా తిరిగి కాంగ్రెస్‌తో సీట్ల సర్దుబాటుకు సిద్ధమవుతున్నాయి.

ఈ విషయంలో అందరికన్నా అఖిలేశ్ ఓ అడుగు ముందుకేసి కాంగ్రెస్‌తో పొత్తు ఖరారు చేసుకున్నారు. కేంద్రంలో ఏ పార్టీ అధికారంలోకి రావాలన్నా యుపిలో ఎక్కువ స్థానాలను గెలుచుకు తీరాల్సిందే. 80 లోక్‌సభ స్థానాలున్న ఈ రాష్ట్రంలో గత రెండు లోక్‌సభ ఎన్నికల్లో బిజెపి అత్యధిక స్థానాలను దక్కించుకుని తిరుగులేని రాజకీయ శక్తిగా ఎదిగింది. ఇప్పుడు అయోధ్య రామాలయ నిర్మాణం, రాష్ట్రంలో వేల కోట్ల రూపాయల అభివృద్ధి పనులతో ఓటర్లకు మరింత చేరువవుతోందని విశ్లేషకుల అంచనా. మరో వైపు మాజీ సిఎం, బిఎస్‌పి అధినేత్రి మాయావతి తాము ఏ పార్టీతోను పొత్తు పెట్టుకునే ప్రసక్తే లేదని, ఒంటరిగానే పోటీ చేస్తామని ఇప్పటికే ప్రకటించేశారు. దీంతో మొన్నటిదాకా పొత్తుల విషయంలో బెట్టు చేస్తూ వచ్చిన కాంగ్రెస్, ఎస్‌పిలు రెండూ కూడా కలిసి పోటీ చేయడం వల్ల ఇరువురికీ లాభమనే వాస్తవాన్ని గ్రహించాయి. కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక స్వయంగా రంగంలోకి దిగి అఖిలేశ్‌తో చర్చలు జరపడంతో రెండు పార్టీల మధ్య పొత్తు ఖరారయిందన్న వార్తలు వచ్చాయి.

సీట్ల సర్దుబాటు తేలేదాకా యుపిలో జరుగుతున్న రాహుల్ గాంధీ న్యాయ్ యాత్ర లో పాల్గొనేది లేదని భీష్మించుకు కూర్చున్న అఖిలేశ్ ఇప్పుడు యాత్రలో పాల్గొంటానని ప్రకటించడం విశేషం. ఇది రెండు పార్టీల కార్యకర్తలకు నైతిక బలాన్ని ఇస్తుందనడంలో సందేహం లేదు. మరోవైపు కేజ్రీవాల్ 'ఆప్' పరిస్థితి కూడా ఇలాగే ఉంది. ఢిల్లీలోని ఏడు లోక్‌సభ స్థానాల్లో పోటీ చేస్తామని ఏకపక్షంగా ప్రకటించిన ఆ పార్టీ పంజాబ్‌లో కూడా ఒంటరిగానే బరిలోకి దిగుతామని చెప్పి కాంగ్రెస్‌ను ఆత్మరక్షణలో పడేసింది. అయితే గత కొద్ది రోజులుగా కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున



ఖర్గే, కేజ్రీవాల్‌ల మధ్య అనేక దఫాలు చర్చలు జరగడంతో ఇప్పుడు 'ఆప్' మెట్టు దిగి వచ్చింది. ముందుగా ఢిల్లీలో సీట్ల సర్దుబాటుకు సంబంధించి ఇరుపార్టీల మధ్య ఒప్పందం కుదిరింది. ఆప్ నాలుగు చోట్లు, కాంగ్రెస్ మూడు చోట్ల పోటీ చేయడానికి అంగీకరించిచాయి. అలాగే గోవా, హర్యానా, గుజరాత్ రాష్ట్రాలకు సంబంధించి కూడా ఈ రెండు పార్టీల మధ్య అంగీకారం కుదిరినట్లు తెలుస్తోంది. అధికారికంగా ప్రకటించనప్పటికీ మోడీ సొంత రాష్ట్రం గుజరాత్‌లో ఆప్ రెండు చోట్ల పోటీ చేయనుండగా,
మిగతా 24 స్థానాల్లో కాంగ్రెస్ పోటీ చేస్తుంది. అలాగే పది స్థానాలున్న హర్యానాలో ఆప్ ఒక చోట పోటీ చేయవచ్చని తెలుస్తోంది. చండీగఢ్ లోక్‌సభ స్థానంలోనూ కాంగ్రెస్ బరిలో ఉంటుంది. అయితే 'ఆప్' అధికారంలో ఉన్న పంజాబ్‌లో మాత్రం ఇంకా ఇరుపార్టీల మధ్య సీట్ల సర్దుబాటుపై ఇంకా చర్చలు జరగలేదు. అయితే ఇప్పుడు పంజాబ్ విషయంలో కూడా ఇరు పార్టీలు ఓ మెట్టు దిగి సీట్ల సర్దుబాటుకు అంగీకరించే అవకాశం లేకపోలేదని అంచనా. 'ఆప్'లో ఇంత మార్పు రావడానికి ఇటీవలి చండీగఢ్ మేయర్ ఎన్నిక పరిణామాల ప్రభావం కీలక పాత్ర పోషించిందని అంచనా. ఈ పరిణామం ఆ పార్టీపైనే కాకుండా ఇండియా కూటమిలోని అన్ని పక్షాలపై ప్రభావం చూపించింది. 'కలసి ఉంటే కలదు సుఖం'అన్న సత్యాన్ని అవి గ్రహించినట్లు కనిపిస్తోంది.

తృణమూల్ కాంగ్రెస్ కూడా బెంగాల్, అసోం, మేఘాలయలో కాంగ్రెస్‌తో సీట్ల సర్దుబాటుకు సిద్ధంగా వున్నట్టు వార్తలు వస్తున్నాయి. నెల రోజుల క్రితం ఉంటుందా లేదా అనే స్థితిలో ఉన్న'ఇండియా' కూటమిలో ఇప్పుడు అన్ని పార్టీలు తిరిగి ఏకతాటిపైకి వస్తుండడం చూస్తే రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో బిజెపిని కలిసికట్టుగా ఢీకొనాలన్న ప్రతిపక్షాల లక్ష్యం దాదాపుగా నెరవేరుతుందనిపిస్తుంది.

# డిజిటల్ సర్వేతోనే భూసమస్యలకు పరిష్కారం

తెలంగాణ రాష్ట్రం దేశంలో రోజురోజుకీ అభివృద్ధిలో ముందు ఉంటుందని చెప్పాలి, ఇక్కడ వనరులు అందుబాటులో ఉండటమే దీనికి కారణంగా చెప్పవచ్చు. అందులో ఇక్కడ ఉన్న భూములకు ఇక్కడ ఉన్న ధరలకు దేశంలో మరెక్కడా లేని విధంగా ఉంటుంది అని చెప్పాలి. రాష్ట్రంలో దూసుకుపోతున్న ప్రధాన రంగాల్లో రియల్ ఎస్టేట్ కూడా ఒకటి, ఒక విధంగా భూసంబంధిత సమస్యలు కూడా అధికంగానే ఉన్నాయి. గత పదేళ్ల క్రితం ఉన్న ధరలు ప్రస్తుతం ఉన్న ధరలు చూస్తే చాలా వ్యత్యాసం ఉంటుంది. ఇటీవల కాలంలో మనం హైదరాబాద్ శివారులో చూసాము, కొకాపేటాలో అత్యధికంగా భూమి ధర పెరగడం గురించి, సరే ఇలా భూమికి ఎనలేని ధర రావటం, మంచిదే. కానీ దానితో పాటే భూ సమస్యలు కూడా పెరుగుతున్నాయి.

ధరణీ ఏర్పాటు: గత ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకు వచ్చిన బృహత్తర కార్యక్రమం ధరణి. ఇప్పుడున్న పరిస్థితుల్లో ఏ దేశంలో ఉన్నా మన వివరాలు ధరణిలో చూసుకోవచ్చు.అది బాగానే ఉంది. కానీ అంతక ముందు ధరణీ ఏర్పాటు చేసే నాటికి, పూర్తి సర్వే లేకుండా, పహనిలలో టైటిల్ ఉందో వారిదే భూమి అనే విధంగా ధరణిలో పెట్టారు. కానీ దీని వల్ల చాలా కేసులు నమోదయ్యాయి. వాస్తవంగా భూమిని ఎవరు చేస్తున్నారు, కాస్తులో కబ్జాలో ఎవరు ఉన్నారు సదా బైనమాలు చేసుకొని కొన్న రైతులకు టైటిల్ గ్యారెంటీ లేకుండా పోయింది. పూర్తి స్థాయిలో డిజిటల్ సర్వే చేసి ఏళ్ల తరబడి కోర్టుల్లో ఉన్న పెండింగ్ కేసులు పరిష్కరించి ఆ తరువాత ధరణీనీ తీసుకోవస్తే ఎలాంటి సమస్యలు లేకుండా ఉంటుంది అని చెప్పవచ్చు. ఇప్పుడు దానిని నూతన ప్రభుత్వం భూమాతగా నామకరణ చేసి ఆర్ఓఆర్ చట్టాన్ని సవరణ చేయాలని చూస్తున్నది. ఏదిఏమైనా పూర్తి స్థాయిలో చేస్తేనే దానికి ఒక పరిష్కారం తేగలము.

క్షేత్ర స్థాయి సర్వే చేయాలి: ఇప్పుడు ఉన్న పరిస్థితిలో ఇనాం భూములు, దేవాదాయ, అసైన్డ్ భూములు, ప్రభుత్వ భూములు చాలా వరకు కబ్జాకు గురికావడం చాలా జరుగుతున్నాయి. ఆ భూములు పూర్తి స్థాయిలో లెక్కలు తీసి ప్రభుత్వ భూములు కాపాడాలి. ప్రస్తుతం ఉన్న భూములలో క్షేత్రస్థాయి సర్వే ప్రకారం ఎంత భూమి ఉంది, రాష్ట్రంలో ప్రస్తుతం ఎంత ఉంది అని బహిరంగ పరచాలి. అదే విధంగా క్షేత్ర స్థాయి సర్వే వల్ల ప్రధానంగా సమస్యలు ఉన్న భూములకు ఉపయోగపడుతుంది. అదే విధంగా రాష్ట్రం లోనున్న ఏళ్ల తరబడి కోర్టులో మగ్గుతున్న భూసమస్యలకు పరిష్కారం అందుతుంది.

కౌలుదారులు: అయితే ముఖ్యంగా రాష్ట్రంలో అత్యధికంగా వ్యవసాయ రైతులు కౌలు రైతులే ఉంటారు. భూములు పెద్ద



మొత్తంలో కొంత మంది దగ్గరే కేంద్రీకృతం అయి ఉంది. కౌలుదారు చట్టం ప్రకారం వాళ్లకు దక్కే అవకాశాలు హక్కులు దక్కడం లేదు. ఇటీవల కాలంలో నూతన కాంగ్రెస్ ప్రభుత్వం కౌలు రైతులకు కూడా పదిహేను వేలు రూపాయలు ఇస్తా అని చెప్పింది. కానీ వాటి లెక్కలు ఇప్పటికీ తెలియదు. అసలు రాష్ట్రంలో ఎంత మంది కౌలు రైతులు ఉన్నారో తెలియాలి. క్షేత్రస్థాయి సర్వే నిర్వహించడం ద్వారానే అదీ సాధ్యం అవుతుంది. కౌలుదారు చట్టం కూడా కఠినంగా అమలు పరిచే విధంగా విధివిధానాలు రూపొందించాలి. రైతు బంధు, రైతు బీమా అవన్నీ సేద్యం చేసేవారికే మాత్రమే దక్కే విధంగా చూడాలి.

కాబట్టి పూర్తి స్థాయిలో డిజిటల్ సర్వే నిర్వహించడం ద్వారానే భూ సమస్యలకి పరిష్కారం అందుతుంది అని చెప్పవచ్చు.

డిజిటల్ యుగం: ప్రస్తుతం అంతా అరచేతిలో ప్రపంచం చూసే రోజులు ఇవి. ఇంత సాంకేతిక యుగంలో మనం ఉన్నాము. ఇంకా మనం పాతపద్ధతులనే పాటిస్తున్నాము. గత ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా డిజిటల్ సర్వే చేద్దాం అని అనుకున్నా చేయలేక పోయింది. ఈ ప్రభుత్వం అయినా చేసి ఉన్న సమస్యలకు చెక్‌పెట్టే విధంగా చూడాలి. కాబట్టి వెంటనే ప్రభుత్వం అన్ని విధాలుగా ఆలోచన చేసి భూ సమస్యలకి పరిష్కారం తేవాలి అని కోరుకుందాం!

# అమరావతిపై ఇక దాగుడుమూతల తగవు

అమరాతి విషయంలో సిఎం జగన్ తప్పటడుగులు వేశారని కోర్టులు, కేంద్రం చెప్పినా జగన్ ప్రభుత్వం మాత్రం తప్పుదిద్దుకునే ప్రయత్నాల్లో లేదు. విశాఖ రాజధాని అని చెబుతున్నవారు మూడేళ్ల క్రితమే ఆ పని చేసివున్నా ఈ పాటికి ఎపికి ఓ రాజధాని అనేది ఉండేది. విశాఖను కూడా రాజధాని చేసుకుంటే అడ్డుకునే వారు ఉండేవారు కాదు. కానీ మూడు రాజధానుల పేరుతో ఆడిన నాటకాలు ఎపి పురోభివృద్ధిని దెబ్బతీసాయి. రాజధాని అన్నది లేకుండా చేశాయి. అందుకే దానిని సరిదిద్దు కోవాలని వివిధ పార్టీల నేతలు అభిప్రాయపడుతున్నారు. ఇంకా దీనిని కొనసాగించడం వల్ల లాభం లేదన్న విషయం గత నాలుగేళ్లుగా అయినా సిఎం జగన్‌కు అర్థం అయివుండాలని అన్నారు. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా మూడు రాజధానులతో ప్రజలను గందరగోళంలోకి నెట్టేశారని అన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కూడా రాజధాని అమరావతి నిర్మాణానికి దోహదపడి ఉంటే బాగుండేదని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ అన్నారు. ఎన్నికల వేళ దీనిపై ప్రజలు నిలదీయాలని అన్నారు. ఈ విషయాన్ని తేలికగా తీసుకోవద్దన్నారు. రాజధాని లేని రాజ్యం లాగా ఆంధ్రప్రద్రేవ్ కొనసాగడం ఎంతమాత్రం సరికాదన్నారు. గత ప్రభుత్వంపై కక్షతో ఇలాంటి కీలక విషయంలో తీసుకున్న నిర్ణయాలు ప్రజల భవిష్యత్‌ను అంధకారంలో పడేశాయని అన్నారు. అమరావతి కోసం కేంద్రంపై ఒత్తిడి పెంచాలన్నారు. అమరావతి రాజధాని కోసం కేంద్రంతో పోరాడాలని కాంగ్రెస్ నేతలు వైఎస్ షర్మిల, తులసిరెడ్డిలు కూడా డిమాండ్ చేశారు. తాము అమరావతికి కట్టుబడి ఉంటామని అన్నారు. అమరావతిని పక్కన పెట్టడంతో ఎపికి పెట్టుబడులు వెనక్కి పోయాయని టిడిపి నేతలు ధూళిపాళ్ల నరేంద్ర, ప్రత్తిపాటి పుల్లారావులు అన్నారు. రైతుల ఆందోళనతో జై అమరావతి నినాదం హోరెత్తింది.. అమరావతే తమ అంతిమ లక్ష్యం అంటూ అక్కడి రైతులు, మహిళలు, కూలీలు ఉద్యమ పిడికిలి బిగించారు. ఎన్ని అవమానాలు ఎదురైనా.. అడ్డంకులు



కల్పించినా.. కేసులు పెట్టినా అడుగులు వెనకకు పడవంటూ తెగేసి చెప్పారు. రైతులు, మహిళలు దీక్ష చేపట్టి రాష్ట్ర ప్రభుత్వానికి కనువిప్పు కలగాలని నినదించారు. ఏకైక రాజధానిగా అమరావతినే కొనసాగించాలన్న డిమాండ్‌తో ఉద్యమిస్తున్న రైతులు, మహిళలు అదే పట్టుదల కొనసాగిస్తున్నారు. ఈ ఉద్యమ లక్ష్యాన్ని గుర్తించి ప్రభుత్వం తక్షణం తన విధానాన్ని సమీక్షించుకోవాలని ఆయా పార్టీల నేతలు సూచించారు. అమరావతి రాజధాని గ్రామం వెలగపూడిలో దీక్ష కొనసాగిస్తున్నారు. అమరావతి ప్రజాదీక్ష పేరుతో జరిగిన ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో వైసీపీ మినహా అన్ని రాజకీయ పక్షాలు మద్దుతు తెలిపాయి. అలానే ప్రజా, కులసంఘాలు తమ మద్దతు తెలియజేశాయి. ప్రభుత్వం మూడురాజధానుల బిల్లుల్ని మళ్లీ తేస్తే.. తాడోపేడో తేల్చుకునేవరకూ విశ్రమించ బోమని రైతులు తేల్చిచెప్పారు. అమరావతి సాధన ప్రతిజ్ఞ..పాలనా రాజధానిగా అమరావతిని ప్రకటించే వరకు తమ పోరు ఆపేది లేదని దళిత జేఏసీ నేతలు చెప్పారు. రైతులు, మహిళలు తలపెట్టిన దీక్షలకు అన్ని పార్టీలకు చెందిన మహిళా నేతలు తమ మద్దతు తెలిపారు. ప్రభుత్వం ఇప్పటికైనా పంతాలకు పోకుండా చూడాల్సి ఉంది. ఇకపోతే ప్రభుత్వం కూడా ఖచ్చితంగా నిర్ణయం ప్రకటించాలి. రోజుకో మాట మాట్లారాదు. మంత్రులు ఒకమాట, సజ్జల ఒకమాట మాట్లాడుతూ ప్రజల్లో గందరగోళం సృష్టిస్తున్నారు. తాము విశ్వాఖకే కట్టుబడి ఉన్నామంటున్న వారు మిగతా విషయాలు మాట్లాడకుండా రాజధానిని తరలించే ప్రయత్నాలు చేయాలి.



### కామాక్షి బ్రాహ్మణ మహిళా సంఘం ఆధ్వర్యంలో

# మహిళా దినోత్సవ వేడుకలు..

**కూకట్‌పల్లి, వెలుతురు:**
నిజాంపేట కామాక్షి బ్రాహ్మణ సంఘ మహిళా కార్యవర్గ సమావేశం శనివారం నిజాంపేట రోడ్డులోని సంస్థ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం మహిళా ప్రతినిధులు మాట్లాడుతూ మార్చి 3 వ తేదీన సంఘం ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు, పెద్ద ఎత్తున మహిళలు హాజరై దిగ్విజయం చేయాలని కోరారు. సామాజిక సేవలను విస్తృతంగా నిర్వహిస్తున్న పీఎస్ఎస్వీ ప్రసాద్ మల్కాజ్‌గిరి పార్లమెంటు స్థానం నుంచి పోటీలో ఉంటున్నందున సంఘం తరపున సంపూర్ణ మద్దతును ప్రకటించారు. ఈ మేరకు ఏకగ్రీవ తీర్మానం చేసారు. ఈకార్యక్రమంలో సంఘం ప్రతినిధులు శంకర్‌శర్మ, నర్సింహారావు, ఆర్. సుధాకర్, మహిళా విభాగం కార్యదర్శి భువనేశ్వరి, కల్యాణి, జయశ్రీ, కుమారి తెన్నేటి రమణ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ భూముల పరిరక్షణే కాంగ్రెస్ ప్రభుత్వం ధ్యేయం...

### నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వి. జగదీశ్వర్ గౌడ్

**శేర్లింగంపల్లి వెలుతురు:** ప్రభుత్వ భూముల పరిరక్షణే కాంగ్రెస్ ప్రభుత్వం ధ్యేయం అని శేర్లింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వి. జగదీశ్వర్ గౌడ్ అన్నారు. శనివారం అల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని శంశి గూడ, సాయి చరణ్ కాలనీ ,శ్రీరాం



నగర్, కృష్ణ వేణి కాలనీ, సాయి ప్రశాంత్ నగర్ కాలనీ ఇంద్రహిల్స్ లో నెలకొన్న వాటర్, డ్రైనేజ్, రోడ్, వీధి స్తంభాల సమస్యలపై స్థానిక నాయకులు, ప్రజలతో కలిసి ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జగదీశ్వర్ గౌడ్ మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో ఉన్న ప్రభుత్వ భూములు, చెరువుల అన్యాక్రాంతం విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి చాలా స్పష్టమైన అవగాహన ఉందని, శేరిలింగంపల్లి నియోజకవర్గం ప్రతి డివిజన్ అభివృద్దే ద్యేయంగా ముందుకు సాగుతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వాటర్ వర్క్స్ మేనేజర్ ప్రశాంతి, డివిజన్ అధ్యక్షులు మరేళ్ల శ్రీనివాస్, నాయకులు మనెపల్లి సాంబశివరావు, ప్రభాకర్, రూబెన్ గోపాల్, లింగం, సంగారెడ్డి, సుధాకర్, సుధీర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వనంలోకి... వనదేవతలు...

**గన్నేరువరం, వెలుతురు, ఫిబ్రవరి 24:** కోరిన కోర్కెలు తీర్చే, భక్తుల పాలిట కొంగు బంగారంగా నిలిచిన సమ్మక్క-సారలమ్మ జాతర శనివారం తల్లుల వన ప్రవేశంతో ముగిసింది. ప్రతీ రెండేళ్లకొకసారి జరిగే ఈ జాతరలో, సంప్రదాయం ప్రకారం తల్లులను



చివరగా వన ప్రవేశం చేయించడం ఆనవాయితీ. గిరిజన సంప్రదాయం ప్రకారమే పూజారులు తల్లులను తీసుకెళ్లారు. మండల కేంద్రంతో పాటు మైలారంలో డప్పు చప్పుల్లు, నృత్యాల మధ్య సారలమ్మ రాకతో 21న ప్రారంభమైన జాతరలో ఎన్నో ఆసక్తికరమైన, అపురూపమైన ఘట్టాలను సంప్రదాయం ప్రకారం పూర్తి చేశారు.

# మేడారం సమ్మక్క సారక్క వన దేవతలను దర్శనం చేసుకున్న పీర్జాదిగూడ కాంగ్రెస్ పార్టీ నాయకులు

**మేడిపల్లి వెలుతురు:**
ఆసియాలోనే అతిపెద్ద ఆదివాసీల జాతర, తెలంగాణ కుంభ మేళా,సమస్త గిరిజనుల సమారాధ్య దేవతలు, కష్టాలు కడతేర్చే కలియుగ దైవాలుగా, ఆపదలో ఉన్నవారిని ఆదుకునే ఆపధ్భాందవులుగా, కేవలం తెలంగాణలోనే గాక అఖిల భారత దేశంలోనే వనదేవతలుగా పూజలందుకుంటున్న మేడారం సమ్మక్క-సారక్క ల దర్శనం చేసుకున్న పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుంగతుర్తి రవి గారు అలాగే వారితో పాటుగాభాస్కర్,పవన్ గౌడ్, మోహన్, కవిడె కుమార్, శ్రీను పాల్గొన్నారు.



## విజయ సంకల్ప యాత్రను

# విజయవంతం చేయాలి..

### బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు

### హర్షణపల్లి సూర్యరావు...




**కూకట్‌పల్లి వెలుతురు:** కూకట్ పల్లి నియోజకవర్గంలో ఆదివారం నిర్వహించే విజయ సంకల్ప యాత్రను విజయవంతం చేయాలని ఆ పార్టీ బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అర్చనపల్లి సూర్యారావు పిలుపునిచ్చారు. ఈ మెరకు శనివారం కూకట్ పల్లిలోని బిజెపి కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు పన్నాల హరీష్ రెడ్డి, అర్చనపల్లి సూర్యారావు, పలువురు బిజెపి నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్యారావు మాట్లాడుతూ నేడు సాయంత్రం 4 గంటలకు వివేకానంద నగర్ డివిజన్ హనుమాన్ ఆలయం వద్దకు బస్సు యాత్ర చేరుకుంటుందని అక్కడి నుండి యాత్ర ప్రారంభమై కూకట్ పల్లి డివిజన్ లోని రామాలయం మీదుగా బిజెపి కార్యాలయం, కెపిహెచ్బి కాలనీ టెంపుల్ బస్ స్టాప్, అక్కడి నుంచి రమ్య గ్రౌండ్స్ ఫోర్త్ ఫేస్ మీదుగా కైతులాపూర్ చేరి మూసాపేట్ డివిజన్ లోని శ్రీ చిత్తరమ్మ ఆలయం వద్ద బహిరంగ సభ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు నియోజకవర్గంలోని భారతీయ జనతా పార్టీ కుటుంబ సభ్యులతో పాటు అన్ని వర్గాల ప్రజలు పెద్ద ఎత్తున విజయ సంకల్ప యాత్రలో పాల్గొనవల సిందిగా నియోజకవర్గ ప్రజలకు ఆయన పిలుపునిచ్చారు. రానున్న పార్లమెంటు ఎన్నికల్లో మల్కాజ్గిరి పార్లమెంట్ నియోజకవర్గం నుండి భారతీయ జనతా పార్టీ బలపరిచిన అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించి ప్రధాని నరేంద్ర మోడీ విజయంలో మనము కూడ పాత్రులై దేశ అభివృద్ధికై వారికి సహకరించాలని నియోజకవర్గ ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రధాని నరేంద్ర మోడీ స్వార్థంగా దేశం కోసం పనిచేస్తూ ఏలాంటి అవినీతి మచ్చ లేకుండా పది సంవత్సరాల పాటు భారతదేశ ఖ్యాతిని ప్రపంచవ్యాప్తంగా విస్తరింపజేసి అభివృద్ధి చెందిన దేశంగా ప్రపంచంలోనే అగ్రగామిగా చేసే ప్రయత్నంలో భాగంగా మనందరం కూడా మరోసారి మోడీ సర్కార్ అని వారిని ప్రధాన మంత్రిగా పార్లమెంటుకు పంపించవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

దానికి మీరందరూ కూడ ఈసారి భారతీయ జనతా పార్టీకి మద్దతుగా నిలబడి నేడు నియోజకవర్గంలో నిర్వహిస్తున్న విజయ సంకల్పయాత్ర, బహిరంగ సభలో అన్ని వర్గాల ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

# టెలిఫోన్ కాలనీ ఫేజ్-2 నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక

**మేడిపల్లి వెలుతురు:**
బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని టెలిఫోన్ కాలనీ ఫేజ్-2 సంక్షేమ సంఘం నూతన అధ్యక్షులుగా గోకుల సత్య నారాయణ ఎన్నికైయ్యారు. శనివారం జరిగిన కాలనీ సర్వసభ్య సమావేశంలో కాలనీ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సంఘం ప్రధాన కార్యదర్శిగా పైల్ల మల్లారెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ తుమ్మ నాగరాజు, కోశాధికారిగా గోగులోతు సురేందర్, ముఖ్య సలహాదారులుగా బాలకృష్ణ, ప్రజాపతి, గుంటి నర్సయ్య, ఉపాధ్యక్షులుగా గిరి ముత్తయ్య, రుద్రారం యాదగిరి, దండ్ల కనకరాజు, బోయిన భరద్వాజ్, సహ కోశాధికారిగా యల్లం వీకే వరప్రసాద్, సహాయ కార్యదర్శులుగా ఎడిగ చంద్రశేఖర్, నోముల విశ్వేశ్వర్, పన్నాల పద్మారెడ్డి, ప్రచార కార్యదర్శులుగా కర్తాల కర్ణాకర్ రెడ్డి, పసుపుల సమ్మయ్య, గర్దాస్ యాదగిరి, కార్యవర్గ సభ్యులుగా నిమ్మల వెంకటేశ్, మంతని రాజా, జి.కుమార్, సాయికిరణ్, గంగాధరి యాదగిరి, వై సందీప్, పసువుల గణేశ్, టి శ్రీకర్, దయాకర్, ఓంప్రకాశ్ లను ఎన్నుకున్నారు. కొత్తగా ఎన్నికైన కాలనీ కార్యవర్గం ప్రతినిధులు స్థానిక కార్పొరేటర్ కొత్త దుర్గమ్మ గౌడ్ ను, మేడ్చల్ నియోజకవర్గ బీబ్లాక్ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి కొత్త కిశోర్ గౌడ్ లను మర్యాదపూర్వకంగా కలిశారు. కాలనీ నూతన కమిటీ ప్రతినిధులను వారు అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం కాలని ప్రతినిధులు కాలనీలో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను కార్పొరేటర్ దుర్గమ్మ గౌడ్, కాంగ్రెస్ నేత



కిశోర్ గౌడ్‌కు విన్నవించారు. కాలనీలో సీసీరోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, సైన్ బోర్డులు ఏర్పాటు, దోమల బెడద, చెత్తఆటోల కేటాయింపు తదితర సమస్యలను పరిష్కరించాలని కోరారు. సాధ్యమైనంత త్వరలో కాలనీ సమస్యలను పరిష్కరించేందుకు తమవంతు కృషి చేస్తామని కార్పొరేటర్ కొత్త దుర్గమ్మ గౌడ్ కు కాంగ్రెస్ సీనియర్ నేత కిశోర్ గౌడ్ లు హామీ ఇచ్చారు.




# పల్లె వనం ఎండుతోంది...!

### ప్రత్యేక అధికారుల పాలనలో మొక్కలపై పర్యవేక్షణ కరువు...??

### నీరు పెట్టక పోవడం... నిఘా పెట్టకపోవడమే కారణం...

### ఆర్కతల గ్రామంలో ఎండిపోతున్న మొక్కలతో పల్లె పకృతి వనం దర్శనం...!!

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి (వెలుతురు న్యూస్):**
పల్లె ప్రకృతిలో నాటిన మొక్కలు ఎండుతున్నాయి.నాలుగు సంవత్సరాల క్రితం పల్లె ప్రకృతి వనాల్లో నాటిన మొక్కల నిర్వహణ సరిగా లేకపోవడంతో మొక్కలు పెరగడం లేదు.వికారాబాద్



జిల్లా నవాబ్ పేట్ మండలం ఆర్కతల గ్రామంలో పల్లె ప్రకృతి వనం నిర్వహణ అధికారులు పట్టించుకోవడం లేదనేది పల్లెపకృతి వనం చూస్తేనే అర్థమవుతుంది.పల్లె ప్రకృతి వనాన్ని ఏర్పాటు చేసి మొక్కలు నాటినప్పటికీ నిర్వహణ లేక పూర్తిగా సుమారు 150 ఎండిపోఎందుకు సిద్ధంగా ఉన్నాయి.మరో 50 మొక్కలు ఎండిపోయాయి.ప్రకృతి వనాన్ని అందంగా తీర్చి దిద్దుతామని ప్రారంభంలో అధికారులు చెప్పినా నిర్వహణ లేకపోవడంతో ప్రకృతి వనం సగభాగం ఎండిపోయిన విధంగా మొక్కలు దర్శనమిస్తున్నాయి. నీళ్లు పట్టకపోవడంతోనే మొక్కలు రోజు రోజుకు పూర్తిగా ఎండిపోతున్నాయి. పల్లె ప్రకృతి వనాలకు ఏర్పాటు చేసి లక్షలాది రూపాయలు వెచ్చినా లక్ష్యం చేరడం లేదని విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

### ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటాం..

**- ఉమా, పంచాయతీ కార్యదర్శి ఆర్కతల...**

పల్లె ప్రకృతి వనం ఏర్పాటు చేసినప్పుడు గతంలో ఎన్ఆర్ఈజీఎస్ ఆధ్వర్యంలో నిర్వహణ ఉండేది. ప్రస్తుతం గ్రామ పంచాయతీ నిర్వహణలో ఉన్నది. ప్రత్యేక శ్రద్ద తీసుకుని మొక్కలకు నీరు పోసి పరిరక్షిస్తాం.








# సమ్మక సారక్కను దర్శించుకున్న భక్తులు

**రాజేంద్రనగర్ (వెలుతురు):** రాజేంద్రనగర్ సర్కిల్ మానస హిల్స్ మినీ మేడారం సమ్మక్క, సారలమ్మల గద్దెల వద్ద భక్తులు శనివారం అమ్మవార్లను దర్శించుకుని బంగారంను (బెల్లం) సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.సర్కిల్ మానస హిల్స్ ప్రాంగణం మార్మోగింది.
శనివారం సమ్మక్క-సారలమ్మల అమ్మవారికి కోళ్లతో ఎదుర్కోలు పలికారు.సమ్మక్క-సారలమ్మల పూజారి చంద్ర కుమార్ ముదిరాజ్ ఆధ్వర్యంలో కన్నుల పండుగగా జాతర కొనసాగుతుంది. సమక్క-సారలమ్మను దర్శించుకోవడానికి భక్తులకు పోటెత్తారు.సమ్మక్క ప్రతిరూపమైన కుంకుమభరిణెతో పూజారులు ఆదివారం వన ప్రవేశం చేయనున్నారు. అమ్మవారి ప్రాంగణంలో భక్తుల సౌకర్యార్థం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు.

**నియోజకవర్గ ప్రజలందరికీ సమ్మక్క తల్లి ఆశీస్సులు ఉండాలి..భీమఅర్జున్ రెడ్డి**

సమ్మక్క,సారలమ్మల జాతరలో రాజేంద్రనగర్ నియోజకవర్గం సీనియర్ బిజెపి నాయకుడు అన్నపురెడ్డి భీమఅర్జున్ రెడ్డి అమ్మవార్లను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆరాధ్య దేవత సమ్మక్క తల్లి అందరి కోరికలు తీరుస్తూ నీరాజనాలు అందుకుంటుందన్నారు.నియోజకవర్గం ప్రజలందరికీ సమ్మక్క తల్లి ఆశీస్సులు ఉండాలని అమ్మవార్లను వేడుకున్నట్లు భీమఅర్జున్ రెడ్డి తెలిపారు.

# సహకార సంస్థల ద్వారా రైతుల ఆర్థిక సాధికారికత...

**- ఎస్ఎల్ఎన్ టి డాక్టర్ శ్రీనివాస్..**

**కరీంనగర్, వెలుతురు ఫిబ్రవరి, 24:** ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సారథ్యంలో కోఆపరేటివ్ ఉద్యమం కోట్లాది మంది జీవితాలను మార్చేందుకు ముందుకు సాగుతోందని ఎస్ ఎల్ ఎన్ టి డాక్టర్ శ్రీనివాస్ తెలిపారు. రైతులను ఆర్థికంగా బలోపేతం చేయడంలో సహకార మంత్రిత్వ శాఖ కీలక పాత్ర పోషిస్తుందన్నారు. శనివారం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ దేశవ్యాప్తంగా 18వేలు పీఏసీఎస్‌ల కోసం కంప్యూటరైజేషన్ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారన్నారు.
11రాష్ట్రాల్లో ప్రపంచంలోనే అతిపెద్ద ఆహార నిల్వ పథకం కింద గోదాములను ప్రారంభిస్తారన్నారు. 5వందల పీఏసీ ఎస్‌లలో గోదాములకు ఆయన శంకుస్థాపన చేయనున్నారని పేర్కొన్నారు. ఆహార నిల్వ పథకం కింద ఈ గిడ్డంగుల ద్వారా రైతులు తమ ఉత్పత్తులను సరైన ధరకు, సరైన సమయంలో విక్రయించు కోవచ్చని, కంప్యూటరీకరణతో పీఏసీఎస్ పరిధి, ఆదాయం పెరుగుతుందని డాక్టర్ శ్రీనివాస్ వివరించారు.

# అమ్మవార్లను వనంలోకి తీసుకెలుతున్న మైలారం సమ్మక్క కమిటీ సభ్యులు...

**ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శిగా జక్కలి రాజు యాదవ్**

**వెలుతురు న్యూస్ నారాయణపూర్:**
ఓబిసి మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా జక్కలి రాజు యాదవ్‌ను ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్ గౌడ్ ఆధ్వర్యంలో నియమించారు....ఈ సందర్భంగా రాజు యాదవ్ మాట్లాడుతూ నాపై నమ్మకంతో పదవి బాధ్యతలకు కట్టుబడి ఉంటానని... రాష్ట్రంలో దేశంలో బిజెపి పాలన కోసం ప్రతినిత్యం పోరాడుతానని మోడీ చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను గడపగడపకు తీసుకెళ్లి



ప్రజల్లో చైతన్యం చేస్తానని పేర్కొన్నారు.
మరోసారి దేశ ప్రధానమంత్రి మోడీ కావడం ఖాయమన్నారు..నా ఎన్నికకు సహకరించిన బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు గంగిడి మనోహర్ రెడ్డి,రాష్ట్ర కార్యవర సభ్యులు దోనూరు వీరారెడ్డి,సాగర్ల లింగయ్య,జిల్లా అధ్యక్షుడు పాశం బాస్కర్,జిల్లా నాయకులు సురపల్లి శివాజీ, బచ్చనగోని దేవేందర్, మండల నాయకులకు ధన్యవాదాలు తెలిపారు

# ఆడపిల్ల

నేను ఓ ఆడపిల్లని
చదువులో సరస్వతి దేవిని
ఆకలైన వారికి అన్నపూర్ణ దేవిని
చెడ్డవారికి కాళికాదేవిని
మంచివారికి భూదేవిని
కష్టాలలో ఉన్న వారికి కనకదుర్గాదేవి
సంతోషాలలో ఉన్న వారికి పార్వతీదేవిని
పేదవారికి లక్ష్మీదేవిని
నేను ఒక ఆడపిల్లని
చలకనగా చూసే వారికి ఆదిపరాశక్తిని




**- బోయిని నిత్యలహరి
ఎనిమిదో తరగతి
ZPHS హవేలీ ఘనపూర్
మెదక్ జిల్లా
9963502369**







# లైంగిక వ్యాధుల పట్ల యువత అవగాహన కలిగి ఉండాలి

**వికారాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ చిగుళ్లపల్లి మంజుల రమేష్**

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి (వెలుతురు న్యూస్):**
ఎయిడ్స్, లైంగిక వ్యాధుల పట్ల యువత అవగాహన కలిగి ఉండాలని వికారాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ చిగుళ్లపల్లి మంజుల రమేష్ సూచించారు. శనివారం వికారాబాద్ మున్సిపల్ హాల్లో మినిస్ట్రీ ఆఫ్ యూత్ ఎఫైర్స్ అండ్ స్పోర్ట్స్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా వారి ఆధ్వర్యంలో.. నెహ్రూ యువ కేంద్ర రంగారెడ్డి జిల్లా, ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ వారిచే ఎయిడ్స్, లైంగిక వ్యాధులపై టీ.ఓ.టీ యువతకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చైర్ పర్సన్ చిగుళ్లపల్లి మంజుల రమేష్ పాల్గొని లైంగిక వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని యువతకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అమ్మాయిలకు ఏర్పాటు చేసిన డ్రాయింగ్, ఎస్సే రైటింగ్ కాంపిటేషన్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారిని చైర్ పర్సన్ ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో మినిస్ట్రీ ఆఫ్ యూత్ అఫైర్స్ ఆఫీసర్ ఐజయ్య, ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ అధికారి మాధవ్, డిస్టిక్ యూత్ అండ్ స్పోర్ట్స్ ఆఫీసర్ హనుమంతరావు, కమిషనర్ జాకీర్ అహ్మద్, డైట్ కళాశాల ఉపాధ్యాయులు, విద్యార్థినిలు పాల్గొన్నారు.

# లోక్ అదాలత్‌పై న్యాయవాదులతో, పోలీసు ఉన్నతాధికారులతో సమావేశం

**రాజీమార్గం ద్వారా కేసులు పరిష్కారం అయ్యేలా చూడాలి**

**మళ్ళీ అవే కేసులు పునరావృతం కాకుండా చూడాలి**

**సీనియర్ సివిల్ జడ్జి, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ కె.సూరికృష్ణ, జూనియర్ సివిల్ జడ్జి జి.అనూష**




**జహీరాబాద్, 24 ఫిబ్రవరి, వెలుతురు :**
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండల లీగల్ సర్వీసెస్ కమిటీ జహీరాబాద్ ఆధ్వర్యంలో మార్చి 9వ తేదీన జహీరాబాద్ కోర్ట్ కాంప్లెక్స్ లో నిర్వహించే జాతీయ లోక్ అదాలత్ లో రాజీమార్గం ద్వారా కేసులు పరిష్కారం అయ్యేలా చూడాలని సీనియర్ సివిల్ జడ్జి, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ కె.సూరికృష్ణ, జూనియర్ సివిల్ జడ్జి జి.అనూష లు న్యాయవాదులకు, పోలీసు అధికారులకు సూచించారు. స్థానిక కోర్టు కాంప్లెక్స్ లో నిర్వహించిన సమావేశంలో న్యాయ మూర్తులు మాట్లాడుతూ రాజీ పడదగ్గ కేసులన్నింటిని లోక్ అదాలత్ ద్వారా పరిష్కారం చేసుకునేలా బాధితులకు, కక్షిదారులకు తెలియజెప్పి రాజీమార్గం ద్వారా కేసులు సత్వర పరిష్కారం చేసుకొని విలువైన సమయాన్ని, డబ్బుని ఆదా చేసుకునేలా చూడాలని తెలిపారు. అలాగే మళ్ళీ అవే కేసులు పునరావృతం కాకుండా చూడాలని పోలీసు అధికారులకు సూచించారు. అపరిష్కృతంగా ఉన్న కేసుతో ఎవరైనా సతమతమౌతుంటే గనక వారు స్థానిక పోలీసు అధికారులకు గాని, సంబంధిత అడ్వకేట్ ను గాని, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ కార్యాలయంను సంప్రదించవచ్చని బాధితులకు, కక్షిదారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో బార్ ప్రెసిడెంట్ సాలోమాన్, బార్ వైస్ ప్రెసిడెంట్ మానెన్న, సెక్రటరీ సంతోష్ కుమార్, సాగర్, డిఎస్పి రామ్మోహన్ రెడ్డి, న్యాయవాదులు, పోలీసు అధికారులు, లీగల్ సర్వీసు సిబ్బంది, పారాలీగల్ వాలంటీర్లు పాల్గొన్నారు.

# సిద్దిపేట మున్సిపాలిటీ దేశానికే ఆదర్శం

**అబద్దపు ప్రచారాలు నమ్మొద్దు**

**సిద్దిపేట మాజీ మున్సిపల్ చైర్మన్ రాజనర్సు కౌన్సిలర్స్**

**సిద్దిపేట పట్టణంలో మాజి చైర్మన్ రాజనర్స్ మీడియా సమావేశం**

**మాపై నింద మోపడానికి కొందరు ప్రయత్నం చేస్తున్నారు**

**కౌన్సిలర్‌గా చైర్మన్‌గా 20ఏండ్ల నుండి సిద్దిపేట పట్టణంలోని ప్రభుత్వ ఆస్తిని కాపాడుతునే ఉన్నాం**

**కొంతమంది మున్సిపల్ స్థలాన్ని కులాల పేరిట ఆక్రమించు కోవాలని చూస్తున్నారు.**

**వారి పబ్బం గడుపుకోవలనే ఆలోచన చేస్తున్నారు**

**కొన్ని పత్రికలలో మాపై వచ్చిన వార్తలు అవాస్తవం బాధాకరం**


**మాపై ఆరోపణలు చేసిన వారిపై పోలసులకు పిర్యాదు చేస్తాం**



**సిద్దిపేట టౌన్, వెలుతురు ఫిబ్రవరి24:**
సిద్దిపేట పట్టణం లోని పాత ఫిషరీస్ కార్యాలయ స్థలం విషయంలో తమపై వచ్చిన ఆరోపణలలో ఏ మాత్రం నిజం లేదని సిద్దిపేట మాజీ మున్సిపల్ చైర్మన్ రాజనర్సు కౌన్సిలర్ లక్ష్మణ్ అన్నారు సిద్దిపేట జిల్లా కేంద్రంలోని మాజీ మంత్రి హరీష్ రావు నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కౌన్సిల్ సభ్యులతో కలిసి వారు మాట్లాడారు. 2022 సంవత్సరంలో పాత ఫిషరీస్ కార్యాలయం మార్చిన తర్వాత కార్యాలయ స్థలాన్ని మున్సిపాలిటీకి అప్పగిస్తూ అప్పటి అడిషనల్ కలెక్టర్ ముజామిల్ ఖాన్ తమకు లీగల్‌గా



లెటర్ ఇచ్చారని తెలిపారు.అలాగే పాత ఫిషరీస్ కార్యాలయం అనుకొని వెనకాల ప్రభుత్వానికి సంబంధించిన భూమి ఉందన్నారు. సిద్దిపేట మున్సిపాలిటీకి కలెక్టర్ కార్యాలయం ద్వారా ఫిషరీస్ డిపార్ట్మెంట్ వారు అప్పగించిన స్థలానికి ఫెన్సింగ్ కూడా మున్సిపాలిటీ ఆధ్వర్యంలో చేయించామని తెలిపారు.అయితే ఈ స్థలం వెనకాల ఉన్న ప్రభుత్వ స్థలాన్ని కొంతమంది కుల సంఘాల పేరుతో కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్నారన్నారు. ఈ విషయంపై ఇప్పటికే ఎమ్మార్వో ఆర్డీవో కార్యాలయాలలో ఫిర్యాదు చేశామని స్థలంపై సమగ్ర విచారణ జరిపించాలని కోరారు అయితే నిన్న తనతో పాటు ఓ కౌన్సిలర్ స్థలాన్ని కబ్జా చేస్తున్నట్టుగా కొన్ని వార్తాపత్రికలు వార్త ప్రచురించాయని అవి పూర్తిగా అవాస్తవాలని తెలిపారు తమపై తప్పుడు ప్రచారం చేస్తున్న వారిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు గత 20 సంవత్సరాలు సిద్దిపేట మున్సిపాలిటీలో కౌన్సిలర్‌గా చైర్మన్‌గా పని చేశానని ఇప్పటివరకు అలాంటి ఆరోపణలు తనపై లేవని గుర్తు చేశారు.ఇప్పటికైనా తమపై అసత్య ఆరోపణలు చేస్తున్న వారు మానుకోవాలని లేకపోతే చట్ట ప్రకారం వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.





# శ్రీ అన్నపూర్ణేశ్వరి ఆశ్రమంలో చతుర్ద వార్షికోత్సవాలు..

**శివ స్వాములచే మహా జ్యోతిర్లింగాల మహాపడిపూజ**

**వివిధ గ్రామాల నుండి తరలివచ్చిన భక్తజనం**

**వెలుతురు న్యూస్ నారాయణపూర్**
యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో శ్రీ అన్నపూర్ణేశ్వరి ఆశ్రమం నిత్య అన్నదాన ట్రస్ట్ చతుర్ద వార్షికోత్సవం సందర్భంగా 23 నుండి 24 వరకు శ్రీ దయానంద సేవా సమితి,నాంపల్లి వారి ఆధ్వర్యంలో 57వ శ్రీలక్ష్మి రామకోటి- శ్రీమద్ భగవద్గీత జ్ఞాన యజ్ఞం , హెూమములు నిర్వహించారు...శివ స్వాములచే మహా జ్యోతిర్లింగాల మహా పడిపూజ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా శ్రీశ్రీశ్రీ దయానందగిరి స్వామీజీ, శ్రీ శ్రీ శంకరనంద స్వామీజీ, శ్రీశ్రీశ్రీ నిత్యానంద భారతి స్వామీజీ, శ్రీశ్రీశ్రీ నిర్మాలనంద మాతాజీ, శ్రీశ్రీశ్రీ జయదేవునంద స్వామీజీ, శ్రీశ్రీశ్రీ రాధానంద మాతాజీ, శ్రీశ్రీశ్రీ స్వామి సిద్ధియోగ హిమాలయ స్వామి, పూజ శ్రీ శంకర్ స్వామీజీ లు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రాంతాల శివ స్వాములు, వివిధ ప్రాంతాల గ్రామ ప్రజలు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు.

# మేడారంలో ప్రబలిన డయేరియా

## అప్రమత్తం అయిన వైద్యసిబ్బంది
## స్థానికంగానే వైద్యసేవలు అందచేత

**ములుగు,ఫిబ్రవరి24(వెలుతురు):** మేడారం జనజాతరను తలపిస్తోంది. లక్షలాదిగా తరలివచ్చిన భక్తులతో కోలాహలంగా మారింది. ఈ క్రమంలో ఎండవేడిమికి కొందరు నీరసించారు. కొందరికి వాంతులు విరేచనాలు కావడంతో వైద్యసిబ్బంది అప్రమత్తం అయ్యింది. కుంభమేళాను తలపించే రీతిలో లక్షలాది జనం పోటెత్తారు. చివరి రోజు కావడంతో మేడారం వెళ్లేదారులన్నీ కిటకిటలాడుతున్నాయి. ఇంతపెద్దఎత్తున జనం ఒకచోట గుమిగూడటంతో పాటు జంపన్న వాగులో సామూహిక స్నానాలు ఆచరిస్తుండంతో అంటు వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది.అలాగే జనం ఒత్తిడికి భక్తులు సొమ్మసిల్లిపడిపోతున్నారు. అలాంటి వారి కోసం మేడారంలో ప్రత్యేక వైద్య శిబిరాలు ఎక్కడికక్కడ ఏర్పాటు చేశారు. కుంభమేళాను తలపించే మేడారంలో భక్తులు సదుపాయాలు అందించడం ఎంతో కీలకం. అత్యవసర ప్రాథమిక చికిత్స సత్వరం అందించకపోతే ప్రాణాలు కోల్పోయే ప్రమాదం కూడా ఉంది. అందుకే తెలంగాణ ప్రభుత్వం పెద్దఎత్తున వైద్య శిబిరాలు ఏర్పాటు చేసింది. మేడారంలోని టీటీడీ కల్యాణమండంపలో 50 పడకల ఆస్పత్రిని సిద్ధం చేసింది. అయితే జాతరకు వచ్చే భక్తుల్లో ఎక్కువ మంది అశుభ్రమైన తినుబండారాలు, నీరు తాగి డయేరియాకు గురయ్యారని వైద్య బృందాలు వెల్లడించాయి. ఎక్కువ మంది విరోచనాలతో బాధపడ్డారని తెలిపారు. లక్షలాదిగా తరలివచ్చే భక్తులను దృష్టిలో ఉంచుకుని వైద్యశాఖ పకడ్బందీగా ఏర్పాట్లు చేసింది. జాతరలో వివిధ ప్రాంతాల్లో 40 ఉచిత వైద్య శిబిరాలతో పాటు ఎమ్జ్గ్+న్సీ సమయంలో భక్తుల వద్దకు వెళ్లేందుకు 40 మొబైల్ అంబులెన్సులు, ఇరవై 108 వాహనాలను జాతరలో నిరంతరం భక్తులకు అందుబాటులో ఉంచారు. వీటితో పాటు గ్దదె ల సమీపంలో అన్ని విభాగాలకు చెందిన వైద్య సిబ్బందితో నాలుగు రోజుల పాటు జరిగిన జాతరలో భక్తులకు నిరంతర సేవలందిచారు. భక్తులు సైతం నిరంతర ఉచిత వైద్య శిబిరాల వద్దకు వచ్చి సమస్యలను చెప్పుకొని మందులు తీసుకువెళ్ళారు. ఎండ వేడికి తోడు ఉక్కపోతతో మేడారంభక్తుల




తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పెద్దసంఖ్యలో వచ్చిన భక్తులు తోసుకోవడంతో పాటు...గంటల కొద్దీ క్యూలైన్ లో నిల్చుని నీరసించిపోయారు. అలాగే సమయానికి తినకపోవడం, అపరిశుభ్రవాతావరణంలో తినడం వల్ల భక్తులు విరోచనాలతో బాధపడ్డారు. కొందరు భక్తులకు ఫిడ్స్ రాగా...మరికొందరు గుండెపోటుకు గురయ్యారు. దీర్ఘకాలిక వ్యాధులతో ఉన్న భక్తులు మరింత ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. బీపీ, షుగర్ ఉన్న భక్తుల కోసం వైద్య సిబ్బంది ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. జాతర జరిగినన్ని రోజులు నిరంతర వైద్య సేవలు అందించినట్లు వైద్యాధికారులు తెలిపారు, ఒక్కో షిఫ్ట్ లో 50మంది చొప్పున విధులు అందించారు. ఎమర్జెన్సీ వైద్యం అవసరమైన వారిని ములుగు ఏరియా ఆస్పత్రితోపాటు, వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. చిన్నపాటి వైద్య సేవలను వైద్య శిబిరంలోనే అందించినట్లు వైద్యధికారులు తెలిపారు. ముఖ్యంగా చిన్నపిల్లలతో వచ్చిన తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నట్లు తెలిపారు. ఎలాంటి అత్యవసర పరిస్థితులు ఎదురైనా అందించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. దేవుడి దయతో ఎలాంటి విపత్తులు సంభవించలేదని వారు వెల్లడించారు.



# పాక్‌పై ఇరాన్ సైనిక దాడి

## రెండు దేశాల మధ్య ఉద్రిక్త వాతావరణం

**బలూచిస్తాన్,ఫిబ్రవరి24(వెలుతురు):** ఇరాన్ పాకిస్థాన్‌ల మధ్య ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పాకిస్థాన్ భూభాగంలో ఇరాన్ మరోసారి సైనిక దాడిని నిర్వహించింది. ఇరాన్ సైనిక బలగాలు ప్రముఖ 'జైష్ అల్ అదిల్' మిలిటెంట్ గ్రూప్ కమాండర్ ఇస్మాయిల్ షాబక్ష్ పాకిస్తాన్ భూభాగంలో హత్య చేశారు. 2012లో ఏర్పాటైన 'జైష్ అల్ అదిల్'ని ఉగ్రవాద సంస్థగా ఇరాన్ గుర్తించింది. గత కొన్ని సంవత్సరాలుగా 'జైష్ అల్ అదిల్' ఇరాన్ భద్రతా దళాలపై అనేక దాడులు జరిపింది. డిసెంబరులో సిస్తాన్-బలూచిస్తాన్‌లోని ఒక పోలీసు స్టేషన్‌పై దాడి చేయగా. దాదాపు 11 మంది పోలీసు సిబ్బంది ప్రాణాలు కోల్పోయినందుకు జైష్ అల్-అద్ల్ బాధ్యత వహించాడు. ఉగ్రవాద సంస్థకు చెందిన రెండు ప్రధాన కార్యాలయాలపై డ్రోన్లు, క్షిపణులతో ఇరాన్ పాకిస్థాన్‌లు పరస్పరం దాడులు జరిపాయి. పాకిస్తాన్, ఇరాన్‌ల భద్రతా సహకారాన్ని విస్తరించడానికి పరస్పరం అంగీకరించాయని ఓ మీడియా సంస్థ నివేదించింది. ఈ ఒప్పందాన్ని పాక్ విదేశాంగ మంత్రి జలీల్ అబ్బాస్ జిలాండ్ అతని ఇరాన్ కౌంటర్ హొస్సేన్ అమీర్-అబ్దొల్లాహియాన్ పాక్ విదేశాంగ కార్యాలయంలో ప్రకటించారు. ఇరు దేశాలు తమ తమ ప్రాంతాల్లో ఉగ్రవాదంపై పోరుకు, పరస్పరం ఆందోళనలు తగ్గించుకునేందుకు అంగీకరించాయని ఆయన తెలిపారు. హమాస్-ఇజ్రాయెల్ ఘర్షణలతో ఇప్పటికే ఉద్రిక్త సమయంలో ఇరాన్-పాక్ ఘర్షణపై ఆందోళన వ్యక్తమవుతోంది.

# అభ్యర్థుల ఎంపికపై బీజేపీ ఫోకస్

## 100 మంది అభ్యర్థులతో తొలి జాబితా సిద్ధం!
## ఫిబ్రవరి 29 విడుదల చేసేందుకు సన్నాహాలు

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి24(వెలుతురు):** కేంద్రంలో ముచ్చటగా మూడోసారి అధికార పగ్గాలు చేపట్టాలన్న లక్ష్యంతో సార్వత్రిక ఎన్నికలకు కమలనాథులు సన్నద్ధమవుతున్నారు. ఎన్డీయే కూటమి 400 సీట్లు, సొంతంగా బీజేపీ 370 సీట్లలో విజయం సాధిస్తుందని ఆ నేతలు ధీమా వ్యక్తంచేస్తున్నారు. ఆ దిశగా సార్వత్రిక ఎన్నికలకు తమ వ్యూహాలకు పదునుపెడుతున్నారు. రానున్న లోక్‌సభ ఎన్నికలకు సంబంధించిన షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం మార్చి నెలలో విడుదల చేయనుంది. ఈ నేపథ్యంలో ఇప్పటికే అభ్యర్థుల ఎంపికపై బీజేపీ అగ్రనాయకత్వం ఫుల్ ఫోకస్ చేసింది. 100 మంది అభ్యర్థులతో తొలి జాబితాను విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తోంది. తొలి జాబితా విడుదలకు సంబంధించి ముహూర్తం కూడా ఫిక్స్ అయినట్లు తెలుస్తోంది. వచ్చే వారం గురువారం (ఫిబ్రవరి 29)నాడు బీజేపీ కేంద్ర నాయకత్వం సార్వత్రిక ఎన్నికల బరిలో నిలిచే తమ పార్టీకి చెందిన 100 మంది అభ్యర్థుల జాబితాను విడుదల చేయాలని సూత్రప్రాయంగా నిర్ణయించిందట. ఈ జాబితాలో ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా పేర్లు కూడా ఉండే అవకాశమున్నట్లు సమాచారం. బీజేపీ సెంట్రల్ ఎలక్షన్ కమిటీ ఫిబ్రవరి 29న సమావేశమై..అభ్యర్థుల తొలి జాబితాపై చర్చించి నిర్ణయం తీసుకోనుంది. అదే రోజు తొలి జాబితా విడుదల కానున్నట్లు తెలుస్తోంది. 543 లోక్‌సభ నియోజకవర్గాల్లో 370 స్థానాల్లో విజయం సాధించాలని, ఎన్డీయే కూటమి 400 స్థానాల్లో విజయం సాధించాలని బీజేపీ లక్ష్యంగా పెట్టుకుంది. ఈ నేపథ్యంలో బీజేపీ కేంద్ర నాయకత్వం వచ్చే గురువారం విడుదల చేయనున్న తొలి జాబితా రాజకీయ వర్గాల్లో ఆసక్తిరేపుతోంది. ప్రధాని నరేంద్ర మోదీ ప్రస్తుతం యూపీలోని వారణాసి నియోజకవర్గానికి ప్రాతినిధ్యంవహిస్తున్నారు. 2014, 2019 సార్వత్రిక ఎన్నికల్లో ప్రధాని ఇక్కడి నుంచి విజయం సాధించారు. 2014లో ప్రధాని మోదీకి 3.37 లక్షల మెజార్టీ దక్కగా.. 2019 ఎన్నికల్లో అంతకు మించి 4.8 లక్షల మెజార్టీతో మోదీ విజయం సాధించారు.



బీజేపీ వృద్ధనేత ఎల్కే అద్వానీ గతంలో ప్రాతినిధ్యంవహిస్తూ వచ్చిన గుజరాత్‌లోని గాంధీనగర్ నియోజకవర్గం నుంచి 2019 ఎన్నిక్లలో అమిత్ షా పోటీ చేసి గెలిచారు. సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ 370 స్థానాల్లో గెలిచే లక్ష్యంతో పనిచేయాలని గత వారం పార్టీ శ్రేణులకు ప్రధాని నరేంద్ర మోదీ దిశానిర్ధేశం చేశారు. రాబోయే 100 రోజులు చాలా కీలకమని స్పష్టంచేశారు. ఈ 100 రోజుల్లో ప్రతి ఓటరు, ప్రభుత్వ పథకాల లబ్ధిదారుడు, ప్రతి సామాజికవర్గానికి చెందిన వ్యక్తి దగ్గరకు వెళ్లాలని సూచించారు. ప్రతి ఒక్కరి నమ్మకాన్ని చూరగొనాలని.. ఎన్డీయే సీట్లు 400, ఒక్క బీజేపీ సీట్లు 370ని అధిగమించాలని పార్టీ జాతీయ సమ్మేళనంలో ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. అధికార భోగాలు అనుభవించేందుకు కాదు.. దేశానికి సేవ చేసేందుకే మూడోసారి ప్రధాని పీఠంపై కూర్చోవాలని ఉవ్విళ్లూరుతున్నట్లు మోదీ పేర్కొన్నారు.

# భారతదేశాన్ని ప్రపంచ అగ్రగామిగా నిలపాలన్నదే మోడీ దార్శనికత

## బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ

**హైదరాబాద్,ఫిబ్రవరి24(వెలుతురు):** వివిధ రంగాల్లో భారతదేశాన్ని ప్రపంచ అగ్రగామిగా నిలపాలన్న ప్రధాని నరేంద్ర మోడీ దార్శనికతను బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ వ్యక్తం చేశారు. కులం, మతం లేదా వర్గాలకు అతీతంగా అన్ని వర్గాల అభివృద్ధి , సంక్షేమాన్ని పెంపొందించడానికి మోడీ నిబద్ధతను మీడియాకు ఒక ప్రకటనలో అరుణ వెల్లడించారు. కోవిడ్-19 మహమ్మారి సమయంలో పారిశ్రామిక వృద్ధి , వ్యాక్సిన్ ఉత్పత్తిలో భారతదేశం యొక్క పురోగతిని హైలైట్ చేస్తూ, ఆర్థిక సమతుల్యత , వృద్ధిని నడిపించడంలో మోడీ నాయకత్వాన్ని అరుణ



ప్రశంసించారు. ఇటీవలి బడ్జెట్‌లో పాలమూరు యూనివర్శిటీకి 20 కోట్లు మంజూరు చేయడంతో పాటు తెలంగాణ అభివృద్ధికి 10 లక్షల కోట్లతో సహా కేంద్ర ప్రభుత్వం గణనీయమైన పెట్టుబడులను ఆమె నొక్కిచెప్పారు.
పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు విషయంలో బీఆర్ఎస్ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు, ప్రాజెక్టు డిజైన్లలో మార్పులు చేసి నిధుల దుర్వినియోగానికి పాల్పడుతోందని అరుణ విమర్శించారు. సమర్థవంతమైన అభివృద్ధి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య పారదర్శకత, సహకారం ఉండాలని ఆమె కోరారు. షాద్ నగర్‌లోని లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ ప్రాజెక్టుకు సంబంధించి కాంగ్రెస్ ప్రభుత్వం జవాబుదారీతనం వహించాలని, దాని పురోగతి , సాగునీటి ప్రణాళికలపై స్పష్టత ఇవ్వాలని అరుణ డిమాండ్ చేశారు. పాలమూరు అభివృద్ధికి ప్రాధాన్యమివ్వాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి సవాల్ విసిరిన ఆమె, ప్రాజెక్టు కాంట్రాక్టుల్లో జరిగిన అవినీతిపై విచారణ జరపకపోవడాన్ని ప్రశ్నించారు.

# మేడారం మహా జాతర విజయవంతం

## నేటివరకు భక్తులు వస్తనే ఉంటారు
## అధికారులు కూడా ఇక్కడే ఉంటారు
## తక్కువ సమయంలో విజయవంతం చేశాం
## మీడియా సమావేశంలో మంత్రి సీతక్క

**ములుగు,ఫిబ్రవరి24(వెలుతురు):** మేడారం మహా జాతర విజయవంతమైంది. నాలుగు రోజుల్లో కోటి నలభై లక్షల మంది భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నారు. శనివారం సాయంత్రం వరకు మరింత పెరిగే అవకాశం ఉందని మంత్రి సీతక్క తెలిపారు. మేడారం జాతర ముగియ నుండడంతో ఆమె మీడియా సమావేశంలో మాట్లాడారు. తక్కువ సమయంలోనే జాతరకు ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు. శుక్రవారం వరకు 10వేల బస్ ట్రిప్పులు నడిచాయి. గుండె సమస్యతో వృద్ధురాలు, మరో యువతి జాతరలో మృత్యువాత పడ్డారని, మద్యం సేవించి జంపన్న వాగులో పడి ఓ వ్యక్తి మృతి చెందినట్లు వివరాలను వెల్లడించారు. చిన్నచిన్న ఘటనలు మినహా జాతర విజయవంతమైందన్నారు. అమ్మవార్ల వన ప్రవేశం కాసేపట్లో జరుగనుంది. వనప్రవేశం పూర్తయినా భక్తుల రద్దీ కొనసాగుతుందని చెప్పారు. ఆదివారం వరకు అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉంటారని వివరించారు. 4వేల మంది పారిశుధ్య సిబ్బంది విధుల్లో ఉన్నారని పేర్కొన్నారు. జాతరకు నిధులిచ్చిన సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి, క్యాబినెట్ మంత్రులకు, సహకరించిన భక్తులకు ధన్యవాదాలు తెలిపారు. మూడు రోజుల్లో దాదాపు కోటి మందికి పైగా భక్తులు సమ్మక్క, సారలమ్మను దర్శించుకున్నారని అంచనా. తెలంగాణ గవర్నర్ తమిళిసై, సీఎం రేవంత్ రెడ్డి సమ్మక్క సారలమ్మను దర్శించుకుని నిలువెత్తు బంగారంతో మొక్కులు చెల్లించుకున్నారు. చివరి రోజు దాదాపు 20 లక్షల మంది భక్తులు అమ్మవార్లకు మొక్కులు చెల్లించుకోనున్నారని భావిస్తున్నారు. అడవి బిడ్డల జాతరలో అన్నీ తానై నిర్వహించిన మంత్రి సీతక్క జాతర సక్సెస్ కు సహకరించిన ప్రతి ఒక్కరికీ పేరు పేరునా కృతజ్ఞతలు తెలిపారు. చివరిరోజు సమ్మక్క, సారలమ్మలు వన ప్రవేశానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. సమ్మక్క, సారలమ్మ గద్దెలపై కొలువుదీరడంతో శుక్రవారం భక్తులు పోటెత్తారు. ఉదయం నుంచే వెల్లువలా తరలివచ్చి, భక్తిపారవశ్యంలో మునిగిపోయారు. గంటల తరబడి క్యూలో నిలబడి మరీ అమ్మవార్లను దర్శనం చేసుకున్నారు. పసుపు, కుంకుమ, ఒడిబియ్యం, నిలువెత్తు బంగారం సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. కన్నెపల్లి నుంచి సారలమ్మను తీసుకురావడంతో మేడారంలో మహాజాతర ప్రధాన ఘట్టం ఆవిష్కృతమవుతుంది. ములుగు జిల్లా మేడారానికి సుమారు మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న గ్రామంలోని చిన్న ఆలయంలో ప్రతిష్టించిన సారలమ్మను జాతరలో మొదటి రోజు సాయంత్రం మేడారంలోని గ్దదె వద్దకు చేరుస్తారు. మధ్యాహ్నామే కన్నెపల్లికి చేరుకున్న వడ్డెలు రెండు గంటల పాటు పూజలు చేస్తారు. కన్నెపల్లి గ్రామ ఆడపడుచులు హారతులు ఇచ్చి అమ్మవారిని మేడారానికి సాగనంపుతారు. సారలమ్మ గద్దె పైకి రాకముందే ఏటూర్‌నాగారం మండలంలోని కొండాయి నుండి గాల్లోకి కాల్పులు జరిపి వనదేవతకు ఆహ్వానం పలుకుతారు. సమ్మక్క రాకతో మేడారం మొత్తం శివసత్తుల పూనకాలతో హోరెత్తి ఊగిపోతుంది. దారి పొడవునా భక్తుల జన ప్రవాహం సాగుతుంది..అమ్మవారికి మొక్కులు చెల్లించుకోవడంలో భాగంగా జంతు బలులు ప్రారంభమవుతాయి. కుంకుమ భరణిని గ్దదెలపైకి చేర్చిన తర్వాత మహా జాతర లాంఛనంగా ప్రారంభమవుతుంది. గ్దదెలపైకి సమ్మక్క-సారమ్మ వనదేవతలు ఆసీనులైన మూడో రోజు






గోవిందరాజులను, పూనుగోండ్ల నుంచి పగిడిద్ద రాజును అటవీ మార్గం మీదుగా కాలినడకన మేడారానికి తీసుకువచ్చి గ్దదెలపై ప్రతిష్టిస్తారు. సారలమ్మ సహా వీరిని తీసుకువచ్చే ముగ్గురు వ్డడెలు అత్యంత భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహిస్తారు. అనంతరం వారి వారి గ్దదెలపై ప్రతిష్టింపజేస్తారు. రెండోరోజు సమ్మక్క తల్లి సాయంత్రం గ్దదెపైకి వస్తుంది. మొదటగా గిరిజన పూజారులు మేడారం సమీపంలోని చిలుకల గుట్టకు వెళ్ళి వెదురు కర్రలు తీసుకొచ్చి గ్దదెలపై పెట్టి పూజిస్తారు. ఆ తర్వాత సమ్మక్క పూజా మందిరం నుంచి పసిడి కుండలను తెచ్చి గ్దదెలపై నెలకొల్పుతారు. తర్వాత మళ్ళీ చిలుకల గుట్టకు వెళ్తారు. మధ్యాహ్నం మూడు గంటల సమయంలో సమ్మక్కను గ్దదెపైకి తీసుకువచ్చే మహాఘట్టం మొదలవుతుంది. తల్లి రూపాన్ని చేతపట్టుకున్న మరుక్షణమే ప్రధాన వ్డడె తన్మయత్వంతో పరుగు పరుగున గుట్ట దిగుతాడు. జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ తుపాకీతో భక్తులు పోటెత్తుతారు. ముందుగా జంపన్న వాగులో పుణ్యస్నానాలు ఆచరించిన అమ్మవార్లను దర్శించుకుంటారు. కానుకలు చెల్లిస్తారు. వన దేవతలను ఆడపడుచులుగా భావిస్తూ పసుపు, కుంకుమలు, చీరె, సారె, పెడతారు. ఒడిబియ్యం పోస్తారు. తలనీలాలు సమర్పించుకుంటారు. ఎత్తు బంగారం నైవేద్యాలుగా పెడతారు. మేడారం మహాజాతరలో నాలుగోరోజు సమ్మక్కను చిలుకల గుట్టకు, సారలమ్మను కన్నెపల్లికి, గోవిందరాజును కొండాయికి, పగిడిద్ద రాజును పూనుగొండ్లకు కాలనడకన తీసుకెళ్తారు. ఇలా దేవతలు వన ప్రవేశం చేయడంతో మహాజాతర ముగుస్తుంది. సాయంత్రం నాలుగు నుంచి ఆరు గంటల సమయంలో ఈ క్రతువు ముగుస్తుంది. సమ్మక్క చిలుకల గుట్టపైకి, సారలమ్మ కన్నెపెల్లికి తరలివెళ్ళిన తర్వాత భక్తులు తిరుగు పయనమవుతారు. మళ్ళీ రెండేళ్ళపాటు భక్తులు తల్లుల రాక కోసం వేచి చూస్తుంటారు.

## హల్ద్వానీ అల్లర్ల సూత్రధారి

# అబ్దుల్ మాలిక్ అరెస్ట్

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి24(వెలుతురు):** ఉత్తరాఖండ్ హల్ద్వానీ ప్రాంతంలో ఫిబ్రవరి 8న తీవ్రమైన ఘర్షణలు చోటు చేసుకున్నాయి. నగరంలోని బన్‌భూల్‌పురాలో అక్రమంగా నిర్మించిన మదర్సాను అధికారులు కోర్టు ఆదేశాల మేరకు కూల్చువేస్తున్న తరుణంలో హింస చోటు చేసుకుంది. పోలీసులు, ఇతర అధికారులే

టార్గెట్‌గా స్థానికులు విరుచుకుపడ్డారు. పోలీసులను నిర్బంధించి నిప్పు పెట్టే ప్రయత్నం చేయడంతో పాటు వారిపై దాడి చేశారు. పలు వాహనాలకు నిప్పు పెట్టారు.అయితే, ఈ ఘర్షణల్లో వందకు పైగా పోలీసులు గాయపడగా.. ఐదుగురు మరణించారు. ఈ అల్లర్లలో విద్రోహ కోణం ఉందని ఉత్తరాఖండ్ పోలీసులు, అధికారులు చెప్పారు. అప్పటి నుంచి ఈ ఘటనకు పాల్పడిన ప్రధాన సూత్రధారుల కోసం వేట సాగుతోంది. తాజాగా ఈ అల్లర్లకు ప్రధాన సూత్రధారిగా ఉన్న అబ్దుల్ మాలిక్‌కి ఢిల్లీలో అరెస్ట్ చేశారు. సీఎం పుష్కర్ సింగ్ ధామి సర్కార్ ఈ కేసును అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. అల్లర్లకు పాల్పడిన వారిని వేటాడి పట్టుకుంటోంది. హల్ద్వానీ నగరంలోని బన్‌భుల్‌పురా ప్రాంతంలో అల్లర్ల నేపథ్యంలో వారం రోజుల పాటు కర్ఫ్యూని విధించారు. నేరస్తులు ఈ ప్రాంతాన్ని విడిచిపెట్టి పోకుండా కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేసి, నిందితులను పట్టుకున్నారు. అయితే, ప్రధాన సూత్రధారిగా ఉన్న అబ్దుల్ మాలిక్ కోసం గత కొన్ని రోజులుగా పోలీసులు గాలిస్తున్న క్రమంలో తాజాగా ఢిల్లీలో పట్టుబడ్డాడు. అబ్దుల్ మాలిక్ తరుపు న్యాయవాది అతని కోసం ముందస్తు బెయిల్ అప్లై చేశాడు. గురువారం రోజు నైనిటాల్ ఎస్ఎస్‌పీ ప్రహ్లాద్ నారాయణ్ మీనా మాట్లాడుతూ.. అబ్దుల్ మాలిక్, అతని భార్య సఫియాతో సహా ఆరుగురిపై నేరపూరిత కుట్రతో పాటు, చనిపోయిన వ్యక్తికి చెందిన అక్రమ ప్లాట్లు, నిర్మాణం, భూమి బదిలీని మోసపూరితంగా ఉపయోగించారని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

# మంగళగిరి ఎయిమ్స్‌ను జాతికి అంకితం చేయనున్న ప్రధాని

- రాష్ట్రానికి నాలుగు మొబైల్ ఫుడ్ టెస్టింగ్ ల్యాబులు
- నేడు వర్చువల్‌గా ప్రారంభించనున్న ప్రధాని మోడీ
- రూ.233 కోట్లతో 9 సిసిబిలకు శంకుస్థాపన చేయనున్న ప్రధాని
- మంగళగిరి ఎయిమ్స్‌లో ఏర్పాట్లను సమీక్షించిన వైద్య ఆరోగ్య శాఖ స్పెషల్ సియస్ ఎం.టి.కృష్ణ బాబు

**అమరావతి,ఫిబ్రవరి24(వెలుతురు):** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజనానంతరం విభజిత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి మంజూరైన నాలుగు సంచార ఆహార భద్రతా పరీక్షా ప్రయోగశాలలను ఆదివారం నాడు రాజ్ కోట్ నుండి వర్చువల్ గా జరిగే కార్యక్రమంలో ప్రధాని శ్రీ నరేంద్రమోడీ ప్రారంభించి జాతికి అంకితం చేయనున్నారు. రాష్ట్ర విభజన వరాలలో భాగంగా 2014లో ఈ ప్రయోగశాలలు రాష్ట్రానికి మంజూరయినప్పటికీ అవి 2023 నవంబర్ నాటికి కానీ పూర్తి స్థాయిని సంతరించుకోలేదు.

ఈ సంచార ప్రయోగశాలల ఏర్పాటుకు సంబంధించిన నిర్వహణా వ్యయాన్ని 60:40 నిష్పత్తిలో భరించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం, భారత ఆహార భద్రతా ప్రమాణాల పరిరక్షణా సంస్థ (ఎఫ్ఎస్ఎస్ఎఐ)తో అవగాహహనా ఒప్పందాన్ని కుదుర్చుకుంది. ఈ మేరకు 60:40 నిష్పత్తిలో తన వంతు రాష్ట్ర ప్రభుత్వం నాలుగు వాహనాలను కొనుగోలు చేసింది. ఈ సంచార ప్రయోగశాలలో ఆహార భద్రతా ప్రమాణాలకు సంబంధించి ఆహార కాలుష్యాన్ని గుర్తించేందుకు దాదాపు 80 రకాల పరీక్షలు చేస్తారు.

డయేరియా ప్రబలటం, ఆహార కాలుష్యం వంటి ఘటనలు జరిగినపుడు ఈ సంచార ప్రయోగశాలల ఆవశ్యకత ఎంతగానో ఉంటుంది. ఆరు చక్రాల



వాహనంలో ఏర్పాటు చేసిన ఈ ప్రయోగశాల ద్వారా సేవల్ని మారుమూల గిరిజన ప్రాంతాలకు సైతం అందించే వీలు కలుగుతుంది. వంట నూనెల్లో వుండే ఫ్రీ రాడికల్స్ ను గుర్తించేందుకు ఈ వాహనాలలో టిపిసి(టోటల్ పోలార్ కాంపౌండ్) మీటర్ ను ఏర్పాటు చేశారు. వివిధ రకాలైన ఆహార పదార్థాలలో కల్తీని గుర్తించేందుకు వీలుగా ఒక మ్యాజిక్ బాక్స్ పరికరాన్ని కూడా ఇందులో పొందుపర్చారు.

దేశవ్యాప్తంగా ఆహార భ్రదత విషయంలో ప్రజలను చైతన్య పరిచేందుకు ఈ సంచరా ప్రయోగశాలలను విస్తృతంగా వినియోగించనున్నారు. అందువల్ల నేటి నుండి అందుబాటులోకి వస్తున్న రాష్ట్ర ఆహార భ్రదతా విభాగానికి సంబంధించిన నాలుగు సంచార ప్రయోగశాలలు ఆహార భద్రతపై ప్రజలలో చైతన్యం కలిగించటంతో పాటు ఆహార భద్రతా ప్రమాణాలకు సంబంధించి సంబంధిత వ్యాపారులకు అవగాహన కలిగించేందుకు సహకరిస్తాయని ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ మరియు స్టేట్ ఫుడ్ సేఫ్టీ కమీషనర్ జె.నివాస్ ఒక ప్రకటనలో తెలిపారు.

### విశాఖలో మైక్రోబయాలజీ ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్

విశాఖపట్నంలో వున్న ప్రాంతీయ ఆహార భద్రతా ప్రయోగశాలను బలోపేతం చేసే చర్యల్లో భాగంగా 100 శాతం కేంద్ర నిధులతో ఏర్పాటు చేసిన కీలక మైక్రో బయాలజీ ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్ ను ఆదివారం నాడు ప్రధాని నరేంద్రమోడీ జాతికి అంకితం చేయనున్నారు. అత్యాధునిక యంత్రపరికరాలతో కూడిన ఈ ల్యాబ్ ఏర్పాటు కోసం ఎఫ్ఎస్ఎస్ఎఐ రు.4.77 కోట్లను మంజూరు చేసింది. ఏడాదికి 15వేలకు పైగా ఆహార పరీక్షలు నిర్వహించే సామర్థ్యం ఈ ల్యాబ్ సొంతం.

### 9 క్రిటికల్ కేర్ బ్లాకులకు శంకుస్థాపన చేయనున్న ప్రధాని మోడీ

క్రిటికల్ కేర్ సర్వీసెస్‌లో అత్యవసర శస్త్రచికిత్స మరియు ఇంటెన్సివ్ కేర్ ఉంటాయి. నేషనల్ శాంపిల్ సర్వే ఆఫీస్ (ఎన్ఎస్ఎస్ఓ) / నేషనల్ హెల్త్ అథారిటీ (ఎన్ హెచ్ఎ) ప్రకారం, సెకండరీ కేర్ మరియు రిఫరల్ ట్రాన్స్‌పోర్ట్ సిస్టమ్‌లకు పరిమిత యాక్సెస్‌తో చాలా క్లిష్టమైన సంరక్షణ సేవలు ఇప్పటి వరకూ మూడవ శ్రేణి సంరక్షణ స్థాయికి పరిమితం చేయబడ్డాయి. ద

కోవిడ్ మహమ్మారి తరువాత ఆరోగ్య వ్యవస్థల ప్రతిస్పందనను బలోపేతం చేయవలసిన అవసరాన్ని మరియు తగిన మౌలిక సదుపాయాల లభ్యతను ప్రభుత్వం మరింత గుర్తించింది.



### రూ.233 కోట్లతో 9 సిసిబిల నిర్మాణం

కడప జిల్లా, కడప ప్రభుత్వ వైద్య కళాశాల (రు.23.75 కోట్లు), నెల్లూరు జిల్లా నెల్లూరు ఎసిఎస్ఆర్ ప్రభుత్వ వైద్య కళాశాల (రు.23.75 కోట్లు), శ్రీకాకుళం జిల్లా శ్రీకాకుళం ప్రభుత్వ వైద్య కళాశాల (రు.23.75 కోట్లు), తిరుపతి జిల్లా, తిరుపతి శ్రీ వేంకటేశ్వర మెడికల్ కళాశాల(రు.23.75 కోట్లు), తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం ప్రభుత్వ వైద్య కళాశాల (రు.23.75 కోట్లు), కర్నూలు జిల్లా కర్నూలు ప్రభుత్వ వైద్య కళాశాల(రు.23.75 కోట్లు), విజయనగరం జిల్లా, విజయనగరం ప్రభుత్వ వైద్య కళాశాల (రు.23.75 కోట్లు), గుంటూరు జిల్లా,

తెనాలి జిల్లా ఆసుపత్రి (రు.44.50 కోట్లు), శ్రీ సత్యసాయి జిల్లా, హిందూపూర్ జిల్లా ఆసుపత్రి (రు.22.45 కోట్లు) మొత్తం 233 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో నిర్మితమయ్యే 9 సిసిబిల నిర్మాణ పనులకు ప్రధాని నరేంద్రమోడీ నేడు శంకుస్థాపన చేయనున్నారు.

# కాంగ్రెస్ గూటికి డిప్యూటీ మేయర్ శ్రీలత

### బీఆర్ఎస్ రాష్ట్ర కార్మిక విభాగం అధ్యక్ష పదవికి రాజీనామా

**హైదరాబాద్,ఫిబ్రవరి24(వెలుతురు):** జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి ఆ పార్టీకి.. పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి, బీఆర్ఎస్ రాష్ట్ర కార్మిక విభాగం అధ్యక్ష పదవికి రాజీనామా చేశారు. బీఆర్ఎస్ నాయకులు వరుసగా పార్టీని వీడటం గమనార్హం. ఫిబ్రవరి 13న తార్నాక డివిజన్ కార్పొరేటర్, డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి దంపతులు సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన విషయం తెలిసిందే. గత కొంత కాలంగా బీఆర్ఎస్‌తో అసంతృప్తిగా ఉన్న డిప్యూటీ మేయర్ శ్రీలత రాష్ట్ర కాంగ్రెస్ ఇంచార్జీ దీపాదాస్ మున్షీ సమక్షంలో ఆ పార్టీలోకి చేరనున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ అధినేతలకు రాజీనామ సమర్పించినట్లు తెలుసుంది. శ్రీలతతో పాటు బీఆర్ఎస్ నాయకులు మరో ఆరు మంది కాంగ్రెస్‌లోకి చేరనునట్లు సమాచారం. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ తరపునుంచి బరిలో నిలిచేందుకు శ్రీలత సిద్ధమైనట్లు సమాచారం. అందులో భాగంగానే సికింద్రాబాద్ టికెట్ ఆశిస్తున్నట్లు తెలుస్తున్నపట్టికీ.. దీనిపై ఎలాంటి స్పష్టత రాలేదు. భవిష్యత్తులో దీనిపై క్లారిటీ వచ్చే అవకాశం ఉంది. మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణా రెడ్డి, ఆయన కోడలు రంగారెడ్డి జడ్పీ చైర్ పర్సన్ తీగల అనితా రెడ్డి ముఖ్యమంత్రిని కలిశారు. త్వరలో వీరిద్దరూ బీఆర్ఎస్ పార్టీ వీడి కాంగ్రెస్ చేరనున్నట్లు సమాచారం. ఇక ఇప్పటికే పట్నం మహేందర్ రెడ్డి సతీమణి వికారాబాద్ జెడ్పీ ఛైర్మన్ పట్నం సునీతారెడ్డి కాంగ్రెస్ గూటికి చేరారు. ఈ క్రమంలోనే త్వరలో మరింత మంది కాంగ్రెస్‌లోకి వెళ్లేందుకు క్యూ కట్టనున్నారు.

# ఏపీలో కాంగ్రెస్‌తో లెఫ్ట్ పార్టీల సమావేశం

### ఉమ్మడి మేనిఫెస్టోపై చర్చ!!

**అమరావతి, ఫిబ్రవరి24(వెలుతురు):** ఆంధ్రప్రదేశ్ లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిలతో లెఫ్ట్ పార్టీల నేతలు సమావేశం అయ్యారు. రాష్ట్రంలో సీట్ల పంపకంతో పాటు ఉమ్మడి మేనిఫెస్టోపై చర్చించారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ.. నరేంద్ర మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పని చేస్తామన్నారు. పెద్ద ఎత్తున బ్లాక్ మెయిలింగ్ రాజకీయాలు చేస్తున్నారు.. ప్రజాతంత్ర, కమ్యూనిష్టు, లౌకిక పార్టీలు ఒక వేదిక మీదకు వస్తాం అని ఆయన తెలిపారు. ప్రధాన ప్రాంతీయ పార్టీలు ఏపీలో భయపడుతున్నాయి.. మోడీ అంటే పవన్, చంద్రబాబు, జగన్ లకు భక్తి ఏమీ లేదు.. జీ హుజూర్ అంటూ లొంగిపోతున్నాయి స్థానిక పార్టీలు.. బీజేపీ అధికారంలోకి రావాలనే వారి ఓట్లు మాకు అక్కర లేదు.. రాష్ట్రాన్ని అప్పులపాలు చేశారు.. పీసీసీ అధ్యక్షురాలు, మహిళకు తన అభిప్రాయం వెలిబుచ్చే హక్కు లేదు అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ అన్నారు. ఇక, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. బీజేపీ, బీజేపీకి కొమ్ము కాసే వారికి వ్యతిరేకంగా పోరాడాలన్నది మా మొదటి ఏకాభిప్రాయం అని ఆయన తెలిపారు. చెత్త బుట్టలో వేసిన బీజేపీతో ఎందుకు కలుస్తున్నారు అనేది చంద్రబాబు సంజాయిషి ఇవ్వాలి.. ఆత్మాభిమానాన్ని ఢిల్లీ పాలకులకు తాకట్టు పెట్టడాన్ని ప్రజలు సహించరు.. ఢిల్లీ చుట్టూ సీఎం ఎందుకు తిరుగుతున్నారు అని ఆయన ప్రశ్నించారు. ఎన్నికల్లో కాంగ్రెస్- సీపీఐ- సీపీఎం పార్టీలు పరస్పరం సహకరించుకోవాలని నిర్ణయించాం.. పరస్పర పోటీలను నివారించి దుష్ట కూటమిలను ఓడించాలని నిర్ణయించామని శ్రీనివాసరావు పేర్కొన్నారు. కాగా కమ్యూనిస్టులు ఫుల్ క్లారిటీతో ఉన్నారా.. ఈ డౌట్ ఎందుకొచ్చిందంటే.. కాంగ్రెస్ తో కలిసి ముందుకు వెళ్లాలని కమ్యూనిస్టులకు ఇప్పుడే అనిపించింది. అలా ఎందుకు అనిపించిందా అని అందరిలో ఇదే సందేహం నెలకొంది. దీనికి కారణం బీజేపీతో టీడీపీ-జనసేన పొత్తుకు వెళ్తుండటమేనా.. అందుకే ఇప్పుడు కమ్యూనిస్టులు కాంగ్రెస్‌తో చేతులు కలిపారా.. కాంగ్రెస్‌తో కలవడానికి ఇదే కారణం అయితే గనక.. వినడానికి చాలా బాగోదు. 2019లో ఓడిపోయినప్పటి నుంచి బీజేపీతో స్నేహం కోసమే ప్రయత్నించింది టీడీపీ. ఏనాడు, ఏ విషయంలోనూ కేంద్ర ప్రభుత్వాన్ని విమర్శించింది లేదు. బీజేపీతో పొత్తుకు ప్రయత్నిస్తున్న విషయం చాలా క్లియర్‌గా



కనిపిస్తూనే ఉంది. అయినా సరే టీడీపీతోనే వెళ్లారు. ఇక జనసేన.. ఏకంగా ఎన్డీయేలో భాగస్వామి. పవన్ కల్యాణ్ మూడు ఆప్షన్లు ఇచ్చారు. అందులో బీజేపీని కలుపుతూనే వెళ్లారు. ఎన్డీయే భాగస్వామ్య పక్షాలతో మీటింగ్‌కు పవన్ కల్యాణ్ అటెండ్ అయి.. ఫొటో కూడా దిగారు. అయినా సరే.. నిన్నటి వరకు ఈ రెండు పార్టీలతో కలిసే ప్రయాణించారు కమ్యూనిస్టులు. ఏదో సడెన్‌గా బీజేపీ లైన్‌లోకి వచ్చిందని, తమ జట్టును విడదీసింది అనుకుంటే పొరపాటే. బీజేపీ కూడా తమతో కలిసి రావాలని బహిరంగంగా చెబుతున్నా సరే.. టీడీపీ-జనసేనతో కలిసి పోరాటం చేసిన కమ్యూనిస్టులకు ఇప్పుడే ఎందుకని కాంగ్రెస్ గుర్తొచ్చింది. ఓటు బ్యాంక్ లేదేమో గానీ ఏపీలో కాంగ్రెస్ పార్టీ ఉంది. ఎప్పటి నుంచో జనంలోనే ఉంది. ఓవైపు దేశవ్యాప్తంగా బీజేపీకి వ్యతిరేకంగా ఇండియా కూటమి పెట్టి కాంగ్రెస్‌తో కమ్యూనిస్టులు కలిసి వెళ్తుంటే.. ఏపీలో మాత్రం అలా వెళ్లిన దాఖలాలు కనిపించలేదు. ఏపీ పీసీసీ చీఫ్‌తో ఏనాడు భేటీ అవలేదు. మరి సడెన్‌గా కమ్యూనిస్టులకు కాంగ్రెస్ ఎందుకు గుర్తొచ్చినట్టు.? వైఎస్ షర్మిల కాంగ్రెస్ పీసీసీ చీఫ్ అయినందుకా? షర్మిల కాంగ్రెస్‌లోకి వచ్చిన తరువాత ఏపీలో పార్టీకి ఊపు వచ్చినందుకా? ఒకవేళ ఇదే కారణం అయితే గనక.. వినడానికి ఇది కూడా చాలా బాగోలేదు. ఇక్కడ టీడీపీ-జనసేనను కూడా తప్పుపడుతున్నారు రాజకీయ విశ్లేషకులు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ గెలిచిందంటే కారణం కచ్చితంగా కమ్యూనిస్టుల మద్దతేనని పొలిటికల్ అనలిస్టులు చెబుతుంటారు. 151 మంది ఎమ్మెల్యేలతో ఫుల్ సాలిడ్‌గా కనిపిస్తున్న వైసీపీని ఎలా ఫేస్ చేయాలా అనుకుంటున్న సమయంలో.. టీడీపీకి ఊపిరినిచ్చింది అమరావతి ఉద్యమం. ఆ ఉద్యమంలో టీడీపీతో పాటు కలిసి నడిచింది ఎర్రజెండాలే. అదొక్కటే కాదు.. జగన్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై టీడీపీతో కలిసి పోరాడింది లెఫ్ట్ పార్టీలే. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడుతున్న టీడీపీ-జనసేనతో కలిసి నడిచిందీ కమ్యూనిస్టులే. ఏపీలో ఉపాధ్యాయులు పిలుపునిచ్చిన ఛలో విజయవాడ అనూహ్యంగా సక్సెస్ అయిందంటే కారణం కూడా లెఫ్ట్ అనుబంధ సంఘాల వల్లే. కమ్యూనిస్టులు లేకుండా టీడీపీ పోరాడలేదని కాదు గానీ.. 23 మంది మాత్రమే గెలిచి కొంత నైరాశ్యంలో ఉన్న పార్టీకి ఏ ఒక్కరు కలిసొచ్చినా అది ఏనుగంత బలంతో సమానం. అలాంటి బలాన్నే ఇచ్చారు కమ్యూనిస్టులు. అంతెందుకు.. చంద్రబాబును అరెస్ట్ చేసి, రాజమండ్రి జైల్లో పెట్టినప్పుడు, అది అక్రమ అరెస్ట్ అంటూ టీడీపీతో కలిసి పోరాటం కూడా చేశారు. ఆనాడు జనసేన అధినేత పవన్ కల్యాణ్ టీడీపీకి ఎంత సపోర్ట్ ఇచ్చారో.. కమ్యూనిస్టులు కూడా అంతే సపోర్ట్ ఇచ్చారు. 2019 ఎన్నికల్లో పవన్ కల్యాణ్ ఒంటరిగా పోటీ చేసేందుకు సిద్ధమైనప్పుడు.. ఆయనకు అండగా నిలిచింది కమ్యూనిస్టు పార్టీలే. పొత్తులో భాగంగా కలిసి వెళ్లారు కూడా. ఆ తరువాత కమ్యూనిస్టులు, జనసేన విడిపోయినప్పటికీ.. ఇప్పటంలో ఇళ్ల కూల్చివేత ఘటనలో పవన్ కల్యాణ్‌ను సీపీఎం నేత మధు కలిశారు. పార్టీ పరంగా మద్దతు ప్రకటించారు. అలాంటిది, బీజేపీతో పొత్తుకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తూ నిన్నటి వరకు అండగా ఉన్న కమ్యూనిస్టులను వదులుకున్నారు. ఏపీలో కాంగ్రెస్, బీజేపీకి బలమే లేదు. టీడీపీ-జనసే.. బీజేపీ వెంట పడడానికి కమలదళానికున్న ఓటు బ్యాంక్ కారణమే కాదు. ఎట్ ద సేమ్ టైమ్.. కమ్యూనిస్టులకు తక్కువ ఓటు బ్యాంక్ ఉంది కదా అని వదిలేయలేదు. గత ఎన్నికల్లో బీజేపీకి 0.84 శాతం ఓట్లు వస్తే.. సీపీఐకి 0.11 శాతం, సీపీఎంకు 0.32 శాతం మాత్రమే ఓట్లు వచ్చాయి. అందులోనూ, జనసేనతో పొత్తు ఉన్నా సరే.. కమ్యూనిస్ట్ పార్టీలు సాధించిన ఓటు షేర్ అరశాతం కూడా లేదు. ఇక కాంగ్రెస్ పార్టీకి కేవలం 1.17 శాతం మాత్రమే ఓట్లు వచ్చాయి. మొత్తానికి ఎవరి అవసరాలరీత్యా వాళ్లు పొత్తులకు వెళ్తున్నారనేది సుస్పష్టం. ఇక్కడ రాజకీయ విలువల గురించి మాట్లాడుకోవడం అనవసరం. కాకపోతే, కాంగ్రెస్‌తో కలిసి నడిచినంత మాత్రాన కమ్యూనిస్ట్ పార్టీలకు టికెట్లు ఇస్తారా? కచ్చితంగా డౌటే. ఎందుకంటే, వచ్చే ఎన్నికల్లో 175 అసెంబ్లీ సీట్లు, 25 ఎంపీ సీట్లలో పోటీ చేస్తామని ఇప్పటికే ప్రకటించారు పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల. బహుశా మున్ముందు జరిగే చర్చల్లో సీట్ల పంపకాలు ఉంటాయేమో చూడాలి. విడిగా పోటీ చేస్తే కాంగ్రెస్‌కు గానీ, కమ్యూనిస్ట్ పార్టీలకు గానీ సొంతంగా సీట్లు వచ్చే అవకాశాలు కనిపించడం లేదు. అందుకే, కలిసి పోటీ చేస్తేనైనా.. కాంగ్రెస్, కమ్యూనిస్ట్ ఓటు బ్యాంకుల్ని ఐక్యం చేసి పరస్పర ఓట్లు బదిలీ చేసుకోవచ్చని నమ్ముతున్నారు వైఎస్ షర్మిల. ఈ నేపథ్యంలోనే సీపీఐ, సీపీఎంతో చర్చలు జరిపారు. ఈ భేటీలో కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం పార్టీలతో పొత్తు ఖరారైంది. కూటమిగా ఎన్నికల్లో పోటీ చేయాలని నిర్ణయించారు. సీట్ల పంకాలపై ఈ నెల 26న అనంతపురం సభ తరువాత సమావేశాలు నిర్వహించనున్నాయి కూడా. ఈ కూటమిలో సీబీఐ మాజీ జేడీ పార్టీ కలుస్తుందనే ప్రచారం కూడా జరుగుతోంది.

# జగన్ రెడ్డి ఎన్నికల తర్వాత జైలుకెళ్లడం ఖాయం..

- టీడీపీ-జనసేన అభ్యర్థుల ప్రకటనతో తాడేపల్లి ప్యాలెస్ కింద భూకంపం
- వైసీపీనేతల ప్యాంట్లు తడుస్తున్నాయి
- టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు, మాజీమంత్రి నక్కాఆనంద్ బాబు



**విజయవాడ, ఫిబ్రవరి24(వెలుతురు):** టీడీపీ-జనసేన పార్టీల అధినేతల ఉమ్మడి అభ్యర్థుల జాబితా ప్రకటనతో ఏకంగా తాడేపల్లి ప్యాలెస్ కిందే భూకంపం వచ్చిందని, రాష్ట్రంలో ఎండలు పెరిగినప్పటికీ తాడేపల్లి కొంపలో మాత్రం ఎన్ని ఎయిర్ కూలర్లు వేసినా, అక్కడున్న నాయకుల కు చెమటలు ఆగడంలేదని, తెలుగుదేశం-జనసేన పొత్తు ప్రకటించింది మొదలు, నేటి అభ్యర్థుల ప్రకటన వరకు జగన్మోహన్ రెడ్డి, వైసీపీనేతలు ఎందుకంతగా మితిమీరి స్పందిస్తున్నారో తెలియడంలేదని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు, మాజీమంత్రి నక్కా ఆనంద్ బాబు అభిప్రాయపడ్డారు.

మంగళగిరిలోని పార్టీ జాతీయ కార్యాలయంలో శనివారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే ...“ టీడీపీ-జనసేన కలిసే పోటీచేస్తాయని తొలినుంచీ చెబుతూనే ఉన్నాం. ఇరుపార్టీ లు పొత్తుకు సిద్ధమైనప్పటినుంచీ వైసీపీ ఏదోరకంగా తమమధ్య విబేధాలు సృష్టించడానికి చేయాల్సిన కుట్రలన్నీ చేశారు. తాజాగా టీడీపీ-జనసేన అభ్యర్థుల ప్రకటన తర్వాత కూడా సజ్జల రామకృష్ణారెడ్డి పాతపాటే మాట్లాడితే వై.వీ. సుబ్బారెడ్డి, మంత్రులు అంబటి, రోజా సహా వైసీపీనేతలంతా ఒకరితర్వాత ఒకరు తమకొచ్చిన వణుకుడు రోగంతో మాట్లాడారు. 175స్థానాలు గెలుస్తామని గొప్ప లు చెబుతున్న వైసీపీనేతలు టీడీపీ-జనసేన పొత్తుని చూసి ఎందుకు భయపడుతున్నారు?

టీడీపీ-జనసేన ఒకేసారి 99మంది అభ్యర్థుల్ని ప్రకటించేసరికి వైసీపీనేతల ప్యాంట్లు తడుస్తున్నాయి. ప్రతిపక్షపార్టీల పొత్తుపై ఏడ్చే బదులు..ఐదేళ్లలో తాను చేసింది జగన్ రెడ్డి ఎందుకు చెప్పుకోలేకపోతున్నాడు?

ప్రతిపక్షపార్టీల పొత్తుపై పడి ఏడ్చే బదులు జగన్ రెడ్డి ఐదేళ్లలో తానేం చేసింది చెప్పుకొని ఎందుకు ముందుకు వెళ్లలేకపోతున్నాడు? టీడీపీ-జనసేన నుంచి పోటీచేసే 99మంది అభ్యర్థుల్ని ఒకేసారి ప్రకటించడంతో వైసీపీనేతల ప్యాంట్లు తడుస్తున్నాయి. టీడీపీ అధినేత సుదీర్ఘ కసరత్తు చేసి తొలిజాబితా ప్రకటించిన వెంటనే వైసీపీలో కొత్త ముసలం మొదలైంది. గతంలో జగన్ రెడ్డి ప్రకటించిన వైసీపీ ఇన్ ఛార్జులకు భయం పట్టుకుంది. 50 రోజుల్లో మొత్తం తతంగం ముగిసి పోతున్నాకూడా జగన్ రెడ్డి ఇప్పటికీ పూర్తిగా ఒక్క స్థానానికి కూడా అభ్యర్థిని ప్రకటించలేదు.

చంద్రబాబునాయుడు గతంలో కాపులకు ఇచ్చిన 5 శాతంరిజర్వేషన్లు, వారి కోసం వేలకోట్లతో ఏర్పాటుచేసిన కాపు కార్పొరేషన్ ను జగన్ రెడ్డి రద్దు చేసినప్పుడు ఆయన చుట్టూ ఉన్న ఆ వర్గం నేతలు ఎందుకు నోరెత్తలేదు? జగన్ రెడ్డి ప్రతి బహిరంగసభలో పవన్ కల్యాణ్ ను తిడుతున్నా ఏనాడూ వైసీపీ కాపునేతలు మాటమాత్రంగా కూడా స్పందించింది లేదు. టీడీపీ-జనసేన పొత్తు ప్రజలు అంగీకరించిన, మనస్ఫూర్తిగా ఆహ్వానించిన పొత్తు. ప్రజలే స్వయంగా ఏర్పాటుచేసిన పొత్తు. అలాంటి పొత్తుతో వైసీపీ చిత్తు అవుతోం దనే జగన్ రెడ్డి సహా ఆ పార్టీ నేతలు బెంబేలెత్తిపోతున్నారు. ఎన్నికలయ్యాక జగన్ రెడ్డి బతుకు ఎలా ఉంటుందో చూడాలి. ముఖ్యమంత్రి పదవిని అడ్డుపెట్టుకొని తనపై ఉన్న కేసుల నుంచి తప్పించుకొని తిరుగుతున్నా డు. ఆ పదవి కాస్త పోతే ఆయనకు ఎలా ఉండాలో అలా ఉంటుంది. టీడీపీ ఒక్కరోజే 94 మంది అభ్యర్థుల్ని ప్రకటించింది. జగన్ రెడ్డి 7జాబితాల విడుదల చేసినా నేటికీ ఒక్కవైసీపీ అభ్యర్థిని కూడా ప్రకటించలేదు. మా పార్టీ ఇన్ ఛార్జ్ లు ఎవరూ ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులు కారని స్వయంగా వై.వీ.సుబ్బా రెడ్డే అంటున్నాడు. దాన్నిబట్టే ఒక్క అభ్యర్థిని కూడా వైసీపీ ప్రకటించలేదని అర్థ మైంది. కూలి..నీలి మీడియాను అడ్డుపెట్టుకొని జగన్ రెడ్డి కావాలనే టీడీపీ-జనసే నల్ని తిట్టిస్తున్నాడు. ఎన్నికల్ని ఎదుర్కోవడం చేతగాక.. గెలిచే చేవలేకనే జగన్ రెడ్డి ఇలా బరితెగించాడు. ఒక దుర్మార్గుడు.. దుష్టుడు.. పనికిమాలిన ప్రభుత్వాన్ని నడుపుతున్న వ్యక్తిని సాగనంపడానికి, ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలకుండా చేయడానికి పొత్తులు అవసరం. మోదీ ఆధ్వర్యంలోని ఎన్డీఏ కూటమిలో, ఇండియా కూటమి లో ఎన్ని పార్టీలున్నాయి? 50 రోజుల్లో వైసీపీ కథ ముగుస్తుంది.” అని ఆనంద్ బాబు తెలిపారు.

# మళ్లీ వైసీపీనే ప్రజలు గెలిపిస్తారు

### మంత్రి గుడివాడ అమర్నాథ్ ఆశాభావం

**అమరావతి, ఫిబ్రవరి24(వెలుతురు):** వైసీపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధి సంక్షేమాన్ని చూసి తమకు ఓటు వేయాలన్నారు మంత్రి గుడివాడ అమర్నాథ్. ఈ సందర్భంగా టీడీపీ-జనసేన పొత్తు లపై ఆయన తీవ్ర విమర్శలు గుప్పించారు. టీడీపీ, జనసేన తమ పొత్తు చూసి ఓటు వేయాలని చెబు తున్నారని విమర్శించారు. కాగా.. రాష్ట్రంలో ప్రజలు వైసీపీని రెండోసారి అధికారంలోకి తీసుకొస్తారని ధీమా వ్యక్తం చేశారు. ఉమ్మడి అభ్యర్థుల తొలి జాబితాతో జనసేన, టీడీపీ బలహీనతలు బయటపడ్డాయని మంత్రి గుడివాడ అమర్నాథ్ ఆరోపించారు. తుప్పు పట్టిన సైకిల్, పగిలిపోయిన గ్లాస్ కు గోల్డ్ కోటింగ్ వేసుకుని జనం ముందుకు వచ్చారని దుయ్యబట్టారు. టీడీపీ-జనసేనది సోషల్ ఇంజనీరింగ్ కాదు, ప్యాకేజీ ఇంజనీరింగ్ అని విమర్శించారు. వారి ప్రకటనలో సామాజిక న్యాయం ఎక్కడా కనిపించలేదని మంత్రి తెలిపారు. ఎంత మంది బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు ఇచ్చారో జస్టిఫై చేసుకోవాలని మంత్రి గుడివాడ అమర్నాథ్ సూచించారు. పొత్తు మాత్రమే మా బలం అని చెప్పుకునే పరిస్థితుల్లో జనసేన, టీడీపీ ఉన్నాయని అన్నారు. 24 సీట్లకే పరిమితం అయినందుకు జన సైనికులకు పవన్ కళ్యాణ్ సమాధానం చెప్పాలని పేర్కొన్నారు. అభ్యర్థుల ప్రకటన తర్వాత కాపులను కమ్మవాళ్లు.. కమ్మవాళ్లను కాపులను నమ్మడం లేదని అర్థం అయిందని చెప్పారు. పొత్తుల వల్ల ఓట్ ట్రాన్ఫర్ అనేది జరగదని తెలిపారు. కాపుల ఓట్ల కోసం చంద్రబాబు పెట్టుకున్న పొత్తు చిత్తవ్వ డం ఖాయమని మంత్రి ఆరోపించారు.

# పొత్తుపై అధినాయకత్వం నిర్ణయం తీసుకుంటుంది...

### ఏపీ బీజేపీ చీఫ్ పురంధేశ్వరి వెల్లడి

**విజయవాడ, ఫిబ్రవరి24(వెలుతురు):** విజయవాడలోని బీజేపీ కార్యాలయంలో కాసేపట్లో బీజేపీ రాష్ట్ర ఎన్నికల మేనేజ్‌మెంట్ కమిటీ సమావేశం జరగనుంది. ఏపీ బీజేపీ చీఫ్ పురంధేశ్వరి అధ్యక్షతన ఈ కీలక భేటీ జరగనుంది. ఈ సమావేశంలో 26 జిల్లాల ఇంఛార్జులు పాల్గొననున్నారు. ఎలక్షన్లలో ఎవరికి ఏ బాధ్యత ఇవ్వాలి అనే అంశంపై సమావేశంలో నిర్ణయించనున్నారు. ఓటరును బూత్ వరకూ తీసుకురావడానికి చేయాల్సిన పనులపై ఇవాళ చర్చిస్తామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురంధేశ్వరి వెల్లడించారు. దొంగ ఓట్ల అంశంలో ఎలక్షన్ కమిషన్ నిబంధనలను కొందరు ఉల్లంఘిస్తారని.. వాలంటీర్లు బూత్ ఏజెంట్లుగా ఉండాలని ధర్మాన చెప్పడం ఈసీ ఆదేశాలకు విరుద్ధంగా ప్రవర్తించడమేనని ఆమె విమర్శించారు. వాలంటీర్లు ఫ్యాన్ గుర్తుపై ఓటేసేలా చేయాలని జగన్ సభలో చెప్పడం ఈసీ నిబంధనలు ఉల్లంఘనేనని ఆమె అన్నారు. ఇవన్నీ పొందుపరుస్తూ సీఈసీకి తాను లెటర్ రాశానన్నారు. అయోధ్య కలను సాకారం చేసిన పాలన నరేంద్ర మోడీ వెల్లడించారు. ప్రజాపోరు యాత్రలో బీజేపీ



మన రాష్ట్రానికి ఏం చేసిందో చెబుతున్నామన్నారు. బీజేపీని రాష్ట్రంలో ఆశీర్వదించడానికి ప్రజలు ముందుకొస్తున్నారన్నారు. పొత్తుపై మా అధినాయకత్వం నిర్ణయం తీసుకుంటుందని.. టీడీపీ-జనసేనలో పొత్తులో ఉండి సీట్లు సర్దుబాటు చేసుకుంటున్నారని ఏపీ బీజేపీ చీఫ్ పురంధేశ్వరి స్పష్టం చేశారు.





## అధికారులూ...పాత ప్రభుత్వ పద్ధతులు, ఆలోచనలు

# మానుకోండి...!

- యాదాద్రి థర్మల్ పవర్ ప్రాజెక్టు పనులను త్వరితగతిన పూర్తి చేయండి
- యాదాద్రి థర్మల్ పవర్ ప్రాజెక్టు అధికారుల సమీక్ష సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు

**నల్గొండ, (వెలుతురు):** యాదాద్రి థర్మల్ పవర్ ప్రాజెక్టు పనులను త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అధికారులను ఆదేశించారు. శనివారం ఉదయం మంత్రులు ఉత్తంకుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి లతో కలిసి ఆయన హైదరాబాద్ నుంచి హెలికాప్టర్లో నల్గొండ జిల్లా దామరచర్ల మండలంలో నిర్మాణంలో ఉన్న థర్మల్ పవర్ ప్రాజెక్టును సందర్శించి, అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

అంతకు ముందుగా థర్మల్ పవర్ స్టేషన్లో స్థానికుల నుంచి వినతి పత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు శంకర్ నాయక్, అధికారులు, కాంగ్రెస్ నేతలు మంత్రుల బృందానికి ఘనంగా స్వాగతం పలికారు.

ప్రాజెక్టు పురోగతిపై చక్కటి ప్రజెంటేషన్ ఇచ్చినందుకు డిప్యూటీ సీఎం అధికారులను అభినందించారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి ప్రస్తుతం మంత్రులుగా ఉన్న ఉత్తంకుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి లకు ఈ ప్రాజెక్టుపై పూర్తి అవగాహన ఉందని గతంలో వీరిద్దరూ ఎంపీలుగా ఉన్న క్రమంలో ప్రాజెక్టు పురోగతికి కృషి చేశారని వివరించారు.

ప్రాజెక్టు పూర్తికి ఇద్దరు మంత్రుల సంపూర్ణ సహకారం తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటికే రెండుసార్లు ప్రాజెక్టు అంచనా వ్యయాలు పెంచడంతో బడ్జెట్ భారీగా పెరిగిందని ఫలితంగా రాష్ట్ర ఖజానాకు భారంగా మారిందని, ప్రజలకు ఆందోళన కలుగుతుందని వివరించారు. ఈ ప్రాజెక్టును తొందరగా పూర్తి చేయకపోతే మోయలేని భారంగా మారుతుంది అన్నారు. ఈ సందర్భంగా అధికారులు సమాధానం ఇస్తూ ప్రాజెక్టు పూర్తయిన తర్వాత స్థానికులకే అవకాశాలు కల్పిస్తామన్నారు. త్వరితగతన ప్రాజెక్టు పూర్తి చేసేందుకు ఒక వ్యవస్థను, ఓ సమర్థమైన అధికారిని నియమించుకోవాలని సూచించారు. సోలార్, హైడ్రో, విండ్ ఎనర్జీ వంటి గ్రీన్ ఎనర్జీ రంగాలు విస్తృతంగా పెరుగుతున్నాయి, అవి పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చేలోపు యాదాద్రి థర్మల్ పవర్ పనులు పూర్తి కావాలన్నారు. గత ప్రభుత్వం యాదాద్రి, భద్రాద్రిలో థర్మల్ వైపు మొగ్గు చూపిందని అన్నారు. పునరుత్పాదక విద్యుత్తు తక్కువ ధరకు, కాలుష్యరహితంగా అందుబాటులోకి వస్తుందన్నారు. బీహెచ్ఈఎల్ పేరున్న ప్రభుత్వ రంగ సంస్థ యాదాద్రి పనులు త్వరగా పూర్తి చేయకపోతే ఆ సంస్థకు చెడ్డ పేరు వస్తుందన్న విషయాన్ని సంస్థ అధికారులు, ఇంజనీర్లు దృష్టిలో పెట్టుకోవాలని తెలిపారు. పాత ప్రభుత్వం ఆలోచనలు, అలవాట్లు పద్ధతులు మార్చుకోకపోతే ప్రాజెక్టు వ్యయం పెరిగి ప్రతి రూపాయి రాష్ట్ర ప్రభుత్వానికి భారంగా మారుతుంది అన్నారు. ప్రాజెక్టుకు అవసరమైన ముడి పదార్థాలు అందించేందుకు మైనింగ్ కార్పొరేషన్ సిబ్బంది సిద్ధంగా ఉందన్నారు.

స్థానికంగా ప్రాజెక్టు నిర్మాణానికి తీసుకున్న రుణాలు వాటి వడ్డీ రేట్ల గురించి నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి ప్రశ్నించారు. కమర్షియల్ బ్యాంకుల కన్నా ఎక్కువ వడ్డీ రేటు ఉంటే దానిని తగ్గించాలని కోరే అవకాశం ఉందని ఎంపీగా పనిచేసిన సమయంలో తనకు ఆ అనుభవం ఉన్న విషయాన్ని గుర్తు చేశారు. ప్రాజెక్టు పనుల్లో జాప్యానికి కారణాలను మంత్రి ఉత్తమ్ అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం ఉద్యోగులకు ఎన్ని క్వార్టర్స్ అందుబాటులో ఉన్నాయి, ప్రాజెక్టు వినియోగంలోకి వచ్చేసరికి ఎన్ని క్వార్టర్స్ నిర్మిస్తారు అని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ప్రశ్నించారు. స్థానికులకే ఉపాధి అవకాశాలు కల్పించడమే కాకుండా, సబ్ కాంట్రాక్టులు, ఇతర చిన్న చిన్న పనుల్లో స్థానికులకే అవకాశం కల్పించడం ద్వారా చేయూతనివ్వాలని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అధికారులను కోరారు. ప్రాజెక్టు చేపట్టిన నాటి వ్యయం, ఆ తర్వాత రెండు సార్లు పెంచిన అంచనాలను అధికారులు వివరించారు. ప్రస్తుతం పవర్ ప్లాంట్ లో జరుగుతున్న అన్ని రకాల అభివృద్ధి పనులను వీడియో ప్రజెంటేషన్ రూపంలో మంత్రుల బృందానికి వివరించారు. ఈ సమావేశంలో విద్యుత్ శాఖ సీఎం డి. సయ్యద్ అలీ రిజ్వీ, ట్రాన్స్కో డైరెక్టర్ అజయ్, పవర్ ప్లాంట్ సి. ఈ. సమ్మయ్య, నల్గొండ జిల్లా కలెక్టర్ హరి చందన, జిల్లా ఎస్పీ చందనా దీప్తి, అడిషనల్ కలెక్టర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# పవన్ పార్టీని విలీనం చేసుకుంటే మంచిది

- 24 సీట్లతో ఎవరితో యుద్ధం చేస్తారన్న సజ్జల



**విజయవాడ, (వెలుతురు):** జనసేన అధ్యక్షుడు అనే దాని కంటే ఆ పార్టీని టీడీపీలో విలీనం చేసి టీడీపీ ఉపాధ్యక్ష పదవి తీసుకుంటే బాగుంటుందని పవన్ కల్యాణ్‌కు ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి సూచించారు. చంద్రబాబు ఇచ్చిన 24 సీట్లు తీసుకొని ఎవరి పై ఏం యుద్ధం చేస్తారని ప్రశ్నించారు. విజయవాడలో మీడియాతో మాట్లాడిన సజ్జల చంద్రబాబు, పవన్‌పై విమర్శలు చేశారు. టీడీపీ, జనసేన మొదటి జాబితాపై మాట్లాడిన సజ్జల... వారి వద్ద చెప్పుకోవడానికి ఏమీ లేదని ఏదోలా బీజేపీతో పొత్తు పెట్టుకోవాలన్న ఆరాటమే కనిపిస్తోందన్నారు. ఈ ఎపిసోడ్‌లో పవన్ చూస్తే జాలేస్తోందని ఎద్దేవా చేశారు. చంద్రబాబు ఎన్ని సీట్లు ఇస్తే అవే తీసుకొని పార్టీ కేడర్‌కు, నమ్మకున్న లీడర్‌లకు అన్యాయం చేశారని ఆరోపించారు. పార్టీని నడిపే సత్తా పవన్‌కు లేదన్న సజ్జల... ఆయన చంద్రబాబుకు ఎందుకు సపోర్ట్ చేస్తున్నారో తెలియదని ఎద్దేవా చేశారు. చివరకు ఆయన ఎక్కడ నుంచి పోటీ చేస్తారో కూడా చెప్పుకోలేని దుస్థితిలో ఉన్నారని విమర్శించారు. ఓవైపు చంద్రబాబు మాత్రం పవన్‌ను ఆ పార్టీని మింగేసే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు సజ్జల. ఎవరు ఎన్ని సీట్లలో పోటీ చేసినా తమకు మాత్రం 175 సీట్లు ఖాయమన్నారు. వైసీపీ విజయం గ్యారంటీ అన్నారు. అసెంబ్లీ ఎన్నికల పొత్తుల్లో భాగంగా జనసేన 24 స్థానాల్లో పోటీ చేయాలని నిర్ణయించడంపై అధికార పక్షం నుంచి గట్టిగానే కౌంటర్‌లు వస్తున్నాయి. కనీసం పావలాకి కూడా పనికి రాడని తేల్చిన టీడీపీ 24 సీట్లు మాత్రమే ఇచ్చిందని సెటైర్లు పేల్చారు అంబటి రాంబాబు. ఛీ... పవన్ అంటూ ట్వీ చేస్తూ పల్లకి మోయడమే తప్ప పావలాకి కూడా పనికి రావాలని చంద్రబాబు తేల్చారంటూ విమర్శలు చేశారు.

# భావితరాల అభివృద్ధి కోసమే పొత్తు..



**టీడీపీ- జనసేన కలయిక రాజకీయ లబ్ధి కోసం కాదు**

**. జనసేన పీఏసీ ఛైర్మన్ నాదేండ్ల మనోహర్**

**అమరావతి, ఫిబ్రవరి24 (వెలుతురు):** పశ్చిమ గోదావరి జిల్లాలో జనసేన పీఏసీ ఛైర్మెన్ నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ.. టీడీపీ- జనసేన కలయిక రాజకీయ లబ్ది కోసం కాదు.. భావి తరాల అభివృద్ధి కోసం అని పేర్కొన్నారు. జగన్ పరిపాలనపై విసిగిపోయిన ప్రజల గళాన్ని చంద్రబాబు, పవన్ కళ్యాణ్ వినిపిస్తారు.. పేదలకు పెత్తందార్లకు యుద్ధం అంటున్న సీఎం ఎందుకు ప్రజల సొమ్ముతో రెండు హెలికాప్టర్ లు పెట్టుకుంటున్నారు అని చెప్పుకొచ్చారు. ఏ కారణంతో డబ్బులు వృదా చేస్తున్నారు.. ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రతి పక్షాలను విమర్శించడానికి ఉపయోగించుకున్నారు అని నాదేండ్ల మనోహర్ ఆరోపించారు. ఇక, 45 రోజుల్లో దిగిపోయే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రజాధనం వృదా చేస్తున్నారు అని జనసేన పీఏసీ ఛైర్మన్ నాదేండ్ల మనోహర్ అని ఎద్దేవా చేశారు. రెండు పార్టీలు కలిసి నిర్వహించుకుంటున్న సభా వేదికపై అన్ని నియోజక వర్గాలకు చెందిన 500 మంది అతిథులు పాల్గొంటున్నారు.. తాడేపల్లిగూడెంలో జరగనున్న టీడీపీ- జనసేన బహిరంగ సభకు అన్ని ఏర్పాట్లు జరుగుతున్నాయి అని చెప్పుకొచ్చారు. తొలిసారి జరగబోతున్న సభకు లక్షల సంఖ్యలో కార్యకర్తలు హాజరు అవుతారు అని నాదేండ్ల మనోహర్ చెప్పారు.కేవలం ప్రధాని రక్షణ కోసం మాత్రమే రెండు హెలికాప్టర్లను ఉపయోగించాలని చట్టం ఉంది.. దీనిపై చట్టపరంగా పోరాడుతామని నాదేండ్ల మనోహర్ తెలిపారు. జనసేన NDAలో భాగం.. అభివృద్ధి కావాలంటే కేంద్రం సహకారం అవసరం.. బీజేపీతో కలిసి వెళ్ళే విధంగా ఇంకా చర్చలు నడుస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. అభ్యర్థుల ఎంపికలో ఇప్పటికే రెండు పార్టీలకు చెందిన అధ్యక్షుల మధ్య చర్చలు కొనసాగుతున్నాయని నాదేండ్ల మనోహర్ వెల్లడించారు.

## ఇక రైళ్లలో స్విగ్గీ ఫుడ్ డెలివరీ ఐఆర్‌సీటీసీ కీలక ఒప్పందం

**న్యూఢిల్లీ(వెలుతురు):** దేశంలో అతిపెద్ద రవాణా వ్యవస్థ అంటే అతి భారతీయ రైల్వే అని చెప్పక తప్పదు. ప్రతి రోజు లక్షలాది మంది ప్రయాణికులు రైళ్లలో ప్రయాణిస్తున్నారు. దీని కోసం రైల్వే శాఖ కూడా అన్ని రకాల సదుపాయాలను అందిస్తోంది. ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఎప్పటికప్పుడు సదుపాయాలను మెరుగు పరుస్తోంది. అయితే రైళ్లలో ప్రయాణించే ప్రయాణికులకు నాణ్యమైన ఫుడ్ అందించేందుకు రైల్వే శాఖ చర్యలు చేపడుతోంది. ఐఆర్‌సిటిసి పోర్టల్ ద్వారా రైలు ప్రయాణికులకు ముందస్తుగా బుక్ చేసుకున్న ఆహారాన్ని డెలివరీ చేసేందుకు స్విగ్గితో ఐఆర్‌సిటిసి ఒప్పందం చేసుకుంది. ప్రస్తుతానికి, బెంగళూరుతో సహా కొన్ని ఎంపిక చేసిన రైల్వే స్టేషన్లలో ఇది అమలు చేయబడుతుంది. ఈ సర్వీసు ఎప్పుడు ప్రారంభమవుతుందో తెలియదు. ప్రీ-ఆర్డర్ చేసిన ఆహారాన్ని (ముందస్తు-ఆర్డర్ చేసిన భోజనం) డెలివరీ కోసం Swiggyతో చేతులు కలిపినట్లు IRCTC స్టాక్ ఎక్స్ఛేంజ్‌కి తన ఫైలింగ్‌లో సమాచారం ఇచ్చింది.

# చైనాలోని భవనంలో అగ్నిప్రమాదం

**15 మంది మృతి, 44 మందికి గాయాలు**

**నాన్జింగ్, ఫిబ్రవరి24 (వెలుతురు):** చైనాలోని నాన్జింగ్ నగరంలో ఓ బహుళ అంతస్తుల భవనంలో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఈ దుర్ఘటనలో 15 మంది చనిపోగా.. 44 మందికి కాలిన గాయాలయ్యాయి. నివాస సముదాయంలోని మొదటి అంతస్తులో మంటలు చెలరేగినట్టు ప్రాథమిక సమాచారం. ఆ అంతస్తులో ఎలక్ట్రిక్ బైక్‌లు ఉన్నట్టు తెలుస్తోంది. 80 లక్షల మంది జనాభా కలిగిన నాన్జింగ్ షాంఘైకి 260 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. చైనాలో స్కైస్క్రాపర్ అగ్నికీలల్లో చిక్కుకోవడం, దట్టమైన నల్లటి పొగ కమ్మేయడం వంటి దృశ్యాలతో కూడిన వీడియోలు సోషల్ మీడియాలో వైరలయ్యాయి. మంటలు పై అంతస్తులకు కూడా వ్యాపించాయి.



ఎట్టకేలకు అగ్నిమాపక సిబ్బందిని ఆ మంటలను అదుపు చేయగలిగారు. చైనాలో తరచూ అగ్నిప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. భద్రతా ప్రమాణాలు లోపించడం, అధికారుల అజమాయిషీ లేకపోవడమే ఇందుకు కారణాలుగా చెబుతున్నారు. సెంట్రల్ సిటీ జిన్యులోగత నెలలో ఓ స్టోర్ తగలబడి పదుల సంఖ్యలో చనిపోయారు. బేస్‌మెంట్‌లో కార్మికులు నిబంధనలకు విరుద్ధంగా మంట రాజేయడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. అంతకు కొన్నిరోజుల ముందే హెనన్ ప్రావిన్స్‌లో ఓ స్కూల్‌లో మంటలు రేగి 13 మంది విద్యార్థులు ప్రాణాలు గాల్లో కలిసిపోయాయి. ఎలక్ట్రిక్ హీటింగ్ పరికరం వల్ల ఆ మంటలు వ్యాపించినట్టు అప్పట్లో వార్తలొచ్చాయి. నవంబర్ 26న షాంక్జి ప్రావిన్స్‌లో ఓ బొగ్గు కంపెనీ ఆఫీసులో అగ్నిప్రమాదంలో డజన్ల సంఖ్యలో కాలిబూడిదయ్యారు. అక్టోబర్ నెలలో బార్బిక్యూ రెస్టారెంట్‌లో సంభవించిన పేలుడు 31 మందిని బలి తీసుకుంది. నిరుడు ఏప్రిల్‌లో బీజింగ్‌లో అగ్నిప్రమాదానికి 29 మంది బలయ్యారు.

# ప్రమాదం ఎలా జరిగిందో అర్థం అవ్వట్లేదు

**ఆ టైంలో నా మైండ్ బ్లాంక్‌అయ్యింది**

**ఎమ్మెల్యే లాస్య నందిత పీఏ, డ్రైవర్ ఆకాష్**



**హైదరాబాద్,ఫిబ్రవరి24 (వెలుతురు):** కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత యాక్సిడెంట్ కేసులో ఆమె పీఏ- డ్రైవర్ ఆకాష్‌పై కేసు నమోదయ్యింది. ఆకాష్ నిర్లక్ష్యపూరితంగా కారు నడపడం వల్లే లాస్య చనిపోయిందని ఆమె కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న ఆకాష్ నుంచి పటాన్ చెరు పోలీసులు స్టేట్ మెంట్ తీసుకున్నారు. మెజిస్ట్రేట్ ముందు స్పృహలో ఉన్న ఆకాశ్ వాగ్మూలం ఇచ్చాడు. దానిలో ఏముందుంటే.. " దర్గా నుంచి హైదరాబాద్ చేరుకుని.. లాస్య కారులో ఉన్న అక్క కూతుర్ని వేరే కారులోకి ఎక్కించాం. లాస్య తినడం కోసం వెళ్తామని చెప్ప డంతో హెూటల్స్ వెతుక్కుంటూ వెళ్లాం. ప్రమాదం ఎలా జరిగిందో అర్థం అవ్వట్లేదు. ఆ టైంలో నా మైండ్ బ్లాంక్‌అయ్యింది." అని ఆకాష్ పేర్కొన్నారు. ఇక ప్రమాదం జరిగిన తీరును స్థానిక డీఎస్పీ మీడియాతో మాట్లాడుతూ ముందు వెళ్తున్న వాహనం ఢీకొట్టిన తర్వాత ఎమ్మెల్యే కారు కంట్రోల్ కాక ఓఆర్ఆర్ పై లెఫ్ట్ సైడ్ రెయిలింగ్ కు ఢీ కొట్టిందన్నారు. ప్రమాదం కంటే ముందే కారు ముందు భాగం పగిలి కింద పడిపోయి ఉందన్నారు. నిర్లక్ష్యంగా అతివేగంగా నడపడం వల్లే ప్రమాదం జరిగిందని వెల్లడించారు. లాస్య నందిత సోదరి నివేదిక ఫిర్యాదుతో ఆకాష్ మీద ఐపీసీ సెక్షన్ 304 ఏ కింద పటాన్ చెరు పీఎస్ లో కేసు నమోదు అయ్యింది. శుక్రవారం ఉదయం 5గంటల 15 గంటలకు ఆకాష్ తమకు ఫోన్ చేశాడని తెలిపారు. ప్రమాదం జరిగిందని.. ఇద్దరికీ దెబ్బలు తగిలాయని లోకేషన్ షేర్ చేశాడని నివేదిత ఫిర్యాదులో పేర్కొన్నారు. తీరా స్పాట్ కు వెళ్లి చూస్తే కారు నజ్జు నుజ్జు అయి కారు మాత్రమే ఉందని ఆమె తెలిపారు. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. సదాశివపేటలో ఓ దర్గాలో మొక్కులు చెల్లించడానికి ఎమ్మెల్యే లాస్య నందిత తన కుటుంబ సభ్యులతో వెళ్లారు. అక్కడి నుంచి తిరిగొచ్చి కుటుంబ సభ్యులను ఇంటి దగ్గర దింపిన తర్వాత టిఫిన్ కోసం సంగారెడ్డి వైపు వెళ్లారని ప్రాథమిక దర్యాప్తులో తేలిందని పేర్కొన్నారు. ప్రమాదంలో లాస్య చనిపోగా.. ఆకాష్ కాళ్లు విరిగాయి. షామీర్ పేట వద్ద ఔటర్ రింగ్ రోడ్డు పైకి లాస్య కారు ఎంట్రీ అయినట్లు పోలీసులు గుర్తించారు. నిద్ర మత్తులోకి జారిపోవడం వల్లనే ప్రమాదం జరిగినట్లు ఆకాష్ చెప్తున్నప్పటికీ అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

# బీజేపీ సొంతంగా 370 సీట్లు సాధించలేదు

**వచ్చే నెలలో ఎన్నికల షెడ్యూల్**

**ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ కీలక వ్యాఖ్యలు**



**న్యూఢిల్లీ,ఫిబ్రవరి24 (వెలుతురు):** లోక్‌సభ ఎన్నికలు ముంచుకు వస్తున్నాయి. వచ్చే నెలలో కేంద్ర ఎన్నికల సంఘం ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసే అవకాశం ఉంది. ఇదిలా ఉంటే బీజేపీ మరోసారి కేంద్రంలో అధికారంలోకి వస్తామని ధీమా వ్యక్తం చేస్తోంది. ఈసారి బీజేపీనే స్వతహాగా 370 సీట్లను సాధిస్తుందని, ఎన్డీయే కూటమి 400కి మించి సీట్లను గెలుస్తుందని ప్రధాని మోడీతో పాటు కేంద్ర నాయకత్వం చెబుతోంది.ఇదిలా ఉంటే ఓ జాతీయ ఛానెల్‌కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ప్రముఖ ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ కీలక వ్యాఖ్యలు చేశారు. 370 సీట్ల సంఖ్య కేవలం పార్టీ కార్యకర్తలకు బీజేపీ నిర్దేశించిన లక్ష్యం మాత్రమే అని అన్నారు. అయితే, ఇది బీజేపీకి ప్రతిష్టాత్మక లక్ష్యమని చెప్పారు. బీజేపీ సొంతంగా 370 సీట్లు గెలువలేదని అన్నారు.కాగా.. బీజేపీ 370 సీట్ల గెలుపుపై అమిత్ షా ఇటీవల వారి వ్యూహాన్ని ప్రకటించారు. ఆర్టికల్ 370ని తొలగించామని అందుకే తాము 370 సీట్లను లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. జమ్మూ కాశ్మీర్ అభివృద్ధికి ప్రతిబంధకంగా మారిన ఆర్టికల్ 370ని 2019లో కేంద్రం తొలగించింది. భారత రాజ్యాంగం, చట్టాలు నేరుగా ఆ ప్రాంతానికి వర్తించేలా బీజేపీ మార్గం సుగమం చేసింది.



## తొలి జాబితాలోనే ఎస్సీలకు

# టీడీపీ అగ్ర తాంబూలం

**-తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య**

**విజయవాడ, ఫిబ్రవరి24 (వెలుతురు):** గతంలో ఎన్నడూ లేని విధంగా తెలుగుదేశం పార్టీ అభ్యర్థుల జాబితా సంచలనం రేపుతోంది. తెలుగుదేశం జాతీయ పార్టీ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు తొలి జాబితాలో ఎస్సీ వర్గానికి సముచిత ప్రాతినిధ్యం కల్పించారు. మొదటి జాబితాలోనే 20 సీట్లు ఎస్సీలైన మాల, మాదిగలకు కేటాయించడం చరిత్రాత్మకం. ఇది ప్రతీ దళితుడు గర్వంగా చెప్పుకోవాల్సిన విషయం. తెలుగుదేశం పార్టీ బడుగు బలహీన వర్గాలకు చెందిన పార్టీ అని మరోసారి రుజువయ్యింది.

జగన్ రెడ్డి గత ఐదేళ్లుగా ఎస్సీలను అణిచివేశారు. జగన్ రెడ్డి ఎస్సీలను కేవలం ఓటు బ్యాంక్‌గా ఉపయోగించుకుంటూ వారికి రావాల్సిన రాజ్యాంగబద్ధ హక్కులను కాలరాస్తున్నారు. తన స్వార్థపూరిత ప్రయోజనాల కోసం దళితులను బలిపెడుతున్నాడు. జగన్ చేసే దళిత వ్యతిరేక చర్యలపై, అక్రమాలపై పోరాడేందుకు రాబోయే ఎన్నికల్లో దళితులంతా సిద్ధంగా ఉండాలి. సామాజిక న్యాయాన్ని పాటిస్తూ.. మొదటి జాబితాలో ఎస్సీలకు అగ్ర తాంబూలం వేసిన టీడీపీకి దళితులంతా మద్దతు తెలిపి, రాబోయే ఎన్నికలల్లో అఖండ మెజారిటీ గెలిపించాలని కోరుతున్నా.

# ఘనంగా మాణిక్యాంబభీమేశ్వర స్వామి కళ్యాణం

**అమరావతి,ఫిబ్రవరి24(వెలుతురు):** ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అనేక ఆధ్యాత్మిక క్షేత్రాలకు పుట్టినిల్లు.. పంచారామ క్షేత్రమైన ద్రాక్షారామంలో కొలువైన శ్రీ మాణిక్యాంబ సమేత భీమేశ్వర స్వామి అమ్మవారిని భారీ సంఖ్యలో భక్తులు దర్శించుకుంటారు. మాణిక్యాంబ భీమేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా.. భీమేశ్వరుని రథోత్సవం కన్నుల పండువగా సాగింది. భీమేశ్వరస్వామి, మాణిక్యాంబ వార్ల ఉత్సవ విగ్రహాలను పూలతో అలంకరించిన రథంపై ఉంచి పలు గ్రామాల్లో ఊరేగించారు. ద్రాక్షారామంతో పాటు, వెలం పాలెం, అన్నాయిపేట గ్రామాల మీదుగా.. వేగాయమ్మ పేట గ్రామంలోని ఆస్థాన మండపం వరకు రథోత్సవం సాగింది.స్వామివారి ఊరేగింపులో పాల్గొనేందుకు భక్తులు పోటీ పడ్డారు. స్వామివారి రథాన్ని లాగేందుకు.. భక్తులు భారీగా వచ్చారు. రథోత్సవంలో భీమేశ్వరస్వామిని దర్శించుకునేందుకు పెద్ద ఎత్తున తరలివచ్చారు. దారి పొడవునా.. పూల వర్షం కురిపించారు. పూజారులు భక్తులకు స్వామివారి ప్రసాదం అందించారు. రథోత్సవంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా.. ఆలయ అధికారులు, పోలీసులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు.

# లాస్య నందిత మరణ వార్త విని షాక్ అయ్యా

## చంద్రబాబు ఎమోషనల్ ట్వీట్

**అమరావతి,ఫిబ్రవరి24(వెలుతురు):** రోడ్డు ప్రమాదంలో సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత మరణ వార్త విని షాక్ కు గురి చేసింది అని టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తండ్రి సాయన్న చనిపోయిన ఏడాదిలోపే ఆమె మృతి చెందడం దురదృష్టకరం అని పేర్కొన్నారు. ఆమె ముందు ఉజ్వల భవిష్యత్తు ఉండగా.. విధి మరొకటి తలచింది అన్నారు. లాస్య నందిత కుటుంబ సభ్యులకు నా సానుభూతి తెలియజేస్తున్నాను అని ఆయన తెలిపారు. అయితే, సికింద్రాబాద్ కంటోన్మెంట్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే లాస్య నందిత ఇవాళ తెల్లవారుజామున పటాన్ చెరు దగ్గరలోని ఔటర్ రింగ్ రోడ్డుపై జరిగిన రోడ్డు ప్రమాదంలో సంఘటన ప్రదేశంలోనే మృతి చెందారు. లాస్య నందిత మృతిపై ఇప్పటికే తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో పాటు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, ఉత్తమ్ కుమార్ రెడ్డి.. అలాగే, మాజీ మంత్రులు హరీశ్ రావు, తలసాని శ్రీనివాస్ యాదవ్, మాల్లారెడ్డి లు సంతాపం వ్యక్తం చేశారు.

# యూపీలో కానిస్టేబుల్ నియామక పరీక్ష రద్దు

**ఉత్తరప్రదేశ్,ఫిబ్రవరి24(వెలుతురు):** ఉత్తరప్రదేశ్ పోలీస్ కానిస్టేబుల్ నియామక పరీక్షను ప్రభుత్వం రద్దు చేసింది. ఈ నెల 17, 18 తేదీల్లో ఈ పోటీ పరీక్ష జరగగా.. పేపర్ లీక్ కావడంతో శనివారం ఆ పరీక్షను అధికారులు రద్దు చేశారు. వచ్చే ఆరునెలల కాలంలో తిరిగి ఈ పరీక్ష నిర్వహించే అవకాశం ఉంది. రీఎగ్జామ్, అది నిర్వహించే తేదీని ప్రభుత్వం వెల్లడించాల్సి ఉంది. పరీక్ష రద్దు విషయాన్ని ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ 'ఎక్స్' పోస్టు ద్వారా ధ్రువీకరించారు.

## ఆ ఆరోపణలు రుజువు చేస్తే...

# నా ఆస్తి మొత్తం రాసిస్తా

## మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి

**అమరావతి,ఫిబ్రవరి24(వెలుతురు):** ప్రకాశం జిల్లా ఒంగోలులో ఇళ్ళ పట్టాల పంపిణీ కార్యక్రమానికి సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ విగ్రహానికి సీఎం జగన్, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమానికి మంత్రులు ధర్మాన ప్రసాదరావు, ఆదిమూలపు సురేష్, మేరుగ నాగార్జున హాజరైయ్యారు. ఇక, వైసీపీ రీజనల్ కో ఆర్డినేటర్ చెవిరెడ్డి భాస్కరరెడ్డి, ఎమ్మెల్యేలు కరణం బలరాం, అన్నా రాంబాబు, బుర్రా మధుసూదన్ యాదవ్, కేపీ నాగార్జున రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఒంగోలు సీఎం జగన్ సభలో బాలినేని శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. ఒంగోలులో పేదలకు సొంత ఇంటి కల సాకారం చేసిన సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి ధన్యవాదాలు అని చెప్పారు. నిరుపేదలకు ఇళ్ళ పట్టాలు ఇవ్వలేకుంటే పోటీ కూడా చేయనని చెప్పా.. సీఎం జగన్ ఇచ్చిన భరోసా వల్లే ధైర్యంగా ఆ మాట చెప్పగలిగాను అని ఆయన పేర్కొన్నారు. సీఎం వల్లే పేదలకు ఇళ్ల స్థలాల పంపిణీ కార్యక్రమం సాకారమైంది.. గతంలో పేదలకు ఇళ్ళ స్థలాల కోసం యర్రజర్లలో చూసిన ప్రభుత్వ భూమికి టీడీపీ అడ్డంకులు సృష్టించింది.. అందుకే అగ్రహారం, వెంగముక్కలపాలెంలలో భూములు చూశాం.. ఇక్కడ కూడా టీడీపీ కోర్టు కేసులు వేయించి ఇబ్బందులు పెట్టాలని చూసింది అని ఆరోపించారు. భూములకు నాకు ఎకరాకు 8 లక్షల రూపాయలు ఇచ్చారని ఆరోపిస్తున్నారు.. ఆ ఆరోపణలు రుజువు చేస్తే నా ఆస్తి మొత్తం రాసిస్తాను అని మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి తెలిపారు.

## కొల్లు రవీంద్ర ఓటమి భయంతో

# మాట్లాడుతున్నారు

## సిగ్గు ఎగ్గు లేకుండా అబద్ధాలు ఆడుతున్నారు

## మాజీ మంత్రి కొల్లు రవీంద్రపై పేర్ని నాని ఫైర్

**అమరావతి,ఫిబ్రవరి24(వెలుతురు):** మాజీ మంత్రి కొల్లు రవీంద్రపై పేర్ని నాని ఫైర్ అయ్యారు. కొల్లు రవీంద్ర ఓటమి భయంతో సిగ్గు ఎగ్గు లేకుండా అబద్ధాలు ఆడుతున్నారని పేర్ని నాని తీవ్రంగా విమర్శించారు. పాపపు సొమ్ముతో చండి యాగాలు, పూజలు చేయడం కాదని.. 3 స్తంభాల సెంటర్ నుంచి బైపాస్ రోడ్లో పేదలకు స్థలాలు ఇచ్చింది నా తండ్రి పేర్ని కృష్ణమూర్తి అని ఆయన పేర్కొన్నారు.అనుమతి లేకుండా శంకుస్థాపన చేసిన మీరు పోర్ట్ ఎలా నిర్మిస్తారని ప్రశ్నించారు. నవయుగ సంస్థను అడ్డం పెట్టుకొని కోర్టులో పోర్ట్ నిర్మాణానికి అడ్డంకులు సృష్టించారని మండిపడ్డారు. అక్కడ అది కడతాం యిక్కడ యిది కడతాం అంటూ మోటార్ సైకిల్పై వెళ్లి గోడలకు రేకులు కొట్టడం కాదన్నారు. మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణకు సీటు రాకుండా చేసింది నువ్వు కాదా అంటూ ప్రశ్నించారు. బహిరంగ చర్చకు రమ్మంటున్నావు నీలాంటి స్థాయి లేని వాడితో, గతి లేని వాడితో నాకు చర్చ ఏంటని తీవ్రంగా వ్యాఖ్యానించారు. గతి లేక నీ మీద పోటీ చేయక తప్పట్లేదన్నారు. ఉడత ఊపులకు చింతకాయలు రాలవు అధికారులు చింతచెట్టు లా మీ ఊపులకు కదలరంటూ ఎద్దేవా చేశారు పేర్ని నాని.

# ఇందిరమ్మ రాజ్యం అంటే దాడులా...

## మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ఆరోపణలు

**హైదరాబాద్,ఫిబ్రవరి24(వెలుతురు):** తెలంగాణలో ఇందిరమ్మ రాజ్యం కొనసాగుతుంది అని కాంగ్రెస్ చెప్తోందని, నిజంగానే ఇందిరమ్మ రాజ్యం వచ్చింది.. ప్రశ్నిస్తే దాడులు, నిర్బంధాలు, ఎదురిస్తే కేసులు పెడుతున్నారని బీఆర్ఎస్ నేత బాల్క సుమన్ మండిపడ్డారు. ఆయన శనివారం తెలంగాణ భవన్లో మీడియాతో మాట్లాడారు. 'జర్నలిస్ట్ శంకర్పైన దాడి చేసి హత్య చేసే ప్రయత్నం చేశారు. సాయి రామ్ రెడ్డి హస్తినాపురం కాంగ్రెస్ ప్రెసిడెంట్కి చెందిన అనుచరుడు. పథకం ప్రకారం శంకర్ను చంపాలని చూశారు. గొడవపడినట్టు ఇద్దరు మహిళలను పెట్టి పథకం ప్రకారం చేశారు. పాశవికంగా శంకర్పై దాడి జరిగింది. ఈ దాడిని అందరూ ఖండించాలి. ఇచ్చిన హామీలపై ప్రశ్నిస్తే దాడులు చేస్తారా?. అక్షరంతో ప్రశ్నిస్తే అయుధంతో దాడులు చేస్తారా?. హత్యలు చేయటమే ఇందిరమ్మ రాజ్యమా?'అని బాల్క సుమన్ ప్రశ్నించారు.



ఇది ప్రజా పాలన లాగా లేదు, ప్రతీకారంతో జరుగుతున్న పాలన లాగా కనిపిస్తుంది. సీఎం రేవంత్రెడ్డి తన ప్రమేయం లేకుండా తెలంగాణ వచ్చిందనే ప్రతీకారం ఉన్నట్టు ఉంది. అనేక మందిపై కేసులు నమోదు చేస్తున్నారు. ప్రజలు ఇలాంటి దాడులు గమనించాలి. ప్రజలకు సుపరిపాలన అందించే ఉద్దేశ్యం లేదు. ఇలాంటి దాడులను ఖండిస్తున్నాం'అని క్రాంతి మండిపడ్డారు.

# ఢిల్లీ, గుజరాత్‌లలో ఆప్ కాంగ్రెస్ ఒప్పందం

## ఢిల్లీలో 3 సీట్లకు కాంగ్రెస్ పోటీ

## గుజరాత్‌లో ఆప్‌కు రెండు సీటు కేటయింపు

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి24(వెలుతురు):** ఇండియా కూటమిలో భాగంగా కాంగ్రెస్, ఆమ్ఆద్మీపార్టీ(ఆప్)ల మధ్య సీట్ల పంపిణీ ఖాయమైంది. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ఢిల్లీలో రెండు పార్టీలు కలిసి పోటీ చేయనున్నాయి. ఈ మేరకు రెండు పార్టీల మధ్య సీట్ల పంపకం కూడా పూర్తయిందని ఆ పార్టీ నేతలు శనివారం మీడియా సమావేశంలో వెల్లడించారు. పొత్తులో భాగంగా ఢిల్లీలోని 7 సీట్లలో నాలుగింటిలో ఆప్, మూడింటిలో కాంగ్రెస్ పోటీ చేయనుంది.న్యూఢిల్లీ, దక్షిణ ఢిల్లీ, పశ్చిమ ఢిల్లీ, తూర్పు ఢిల్లీల్లో ఆప్ పోటీ చేయనుండగా చాందినీ చౌక్, నార్త్ ఈస్ట్ ఢిల్లీ, నార్త్ వెస్ట్ ఢిల్లీ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు పోటీ చేయనున్నారు. 2014,2019 లోక్‌సభ ఎన్నికల్లో వరుసగా బీజేపీ ఢిల్లీలోని మొత్తం ఏడు సీట్లను కైవసం చేసుకోవడం విశేషం. కేవలం ఢిల్లీలోనే కాకుండా దేశవ్యాప్తంగా కూడా కొన్ని సీట్లను ఆప్‌కు ఇచ్చేందుకు కాంగ్రెస్ ఓకే చెప్పింది.ఇందులో భాగంగా హర్యానాలో ఒకటి, గుజరాత్‌లో రెండు సీట్ల నుంచి కూడా పొత్తులో భాగంగా ఆప్‌కు కాంగ్రెస్ ఆఫర్ చేసింది. ఈ వారంలోనే ఇండియా కూటమిలోని మరో ప్రధాన పార్టీ సమాజ్‌వాదీ పార్టీ(ఎస్పీ)తో కాంగ్రెస్ సీట్ల పంపకం ఖరారైన విషయం తెలిసిందే. పొత్తులో భాగంగా యూపీలో ఎస్పీ 63, కాంగ్రెస్ 17 చోట్ల పోటీ చేయనున్నట్లు ప్రకటించారు. అయితే కూటమిలోని మరో పార్టీ అయిన తృణమూల్ కాంగ్రెస్ మాత్రం పశ్చిమబెంగాల్‌లోని మొత్తం 42 సీట్లలో తామే పోటీ చేస్తామని చెబుతుండడం ఇండియా కూటమి నేతలను కలవరానికి గురిచేస్తోంది. కాంగ్రెస్ పార్టీ.. ప్రతిపక్షాల ఇండియా కూటమిలో భాగంగా పలు రాష్ట్రాల్లో సీట్ల పంపకంపై కసరత్తు చేస్తోంది. ఇప్పటికే.. ఉత్తరప్రదేశ్‌లో సమాజ్‌వాదీ పార్టీ, ఢిల్లీలో ఆమ్ ఆద్మీ పార్టీతో సీట్ల సర్దుబాలు కొలిక్కి వచ్చిన విషయం తెలిసిందే. అదే విధంగా గురుజరాత్‌లో సైతం కాంగ్రెస్ పార్టీ ఆప్‌తో సీట్ల పంపకాన్ని ఫైనల్ చేసింది. గుజరాత్‌లో కాంగ్రెస్ పార్టీ, ఆప్ పొత్తులో భాగంగా పోటీ చేయనున్నాయ. గుజరాత్‌లో కాంగ్రెస్ పార్టీ.. ఆప్‌కు రెండు సీట్లను ఆఫర్ చేసింది. ఈ మేరకు ఇరు పార్టీలు అధికారికంగా ప్రకటించాయి. అయితే కాంగ్రెస్, ఆప్ పొత్తుపై పలువురు నేతలు స్పందిస్తున్నారు.





తాజాగా అహ్మద్ పటేల్ కూతురు ముంతాజ్ పటేల్ ఎక్స్ ' ట్విటర్' వేదికగా స్పందించారు. 'భారుచా జిల్లా కాంగ్రెస్ కార్యకర్తలు, పార్టీ కేడర్‌కు క్షమాపణలు తెలుపుతున్నా. కాంగ్రెస్, ఆప్ పొత్తులో భాగంగా భారుచా లోక్‌సభ స్థానం పొందలేకపోయాం. మీ నిరాశను నేను పంచుకుంటాను. మనమంతా కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేద్దాం. 45 ఏళ్ల అహ్మద్ పటేల్ వారసత్వాన్ని వృథా కానివ్వం' అని ఆమె తెలిపారు. గుజరాత్‌లో పొత్తులో భాగంగా భారుచా లోక్‌సభ స్థానాన్ని కాంగ్రెస్ పార్టీ.. ఆప్‌కు కేటాయించింది. ఈ క్రమంలో ముంతాజ్ ఖాన్ ఆ స్థానంపై ఆశపెట్టుకున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంనే ఆమె తన జిల్లా కేడర్‌కు క్షమాపణలు చెప్పినట్లు చర్చ జరుగుతోంది. మరోవైపు.. అహ్మద్ పటేల్ కుమారుడు ఫైసల్ కూడా స్పందించారు. 'నేను మరోసారి కాంగ్రెస్ అధిష్టానాన్ని కలిసి మాట్లాడుతా. నామినేషన్ వేయడానికి ఇంకా చాలా సమయం ఉంది. గాంధీ కుటుంబం నా కుటుంబంతో సమానం. భారుచా లోక్‌సభ స్థానానికి సంబంధించి.. అహ్మద్ పటేల్ కుటుంబానికి ఉన్న సెంటిమెంట్‌ను అధిష్టానం అర్థం చేసుకుంటుందని ఆశిస్తున్నా'అని తెలిపారు. 'పార్టీ నిర్ణయంపై కార్యకర్తలు, నేను సంతోషంగా లేము. ఈ నిర్ణయం తీసుకోకూడదని మేము కోరుకున్నాము. కానీ.. కాంగ్రెస్ హైకమాండ్ తీసుకుంది. కావున మేము దాన్ని అనుసరిస్తాం. పార్టీ నిర్ణయాన్ని నేను, కార్యకర్తలం అనుసరిస్తాం?' అని పేర్కొన్నారు.

# స్పెయిన్‌లో భారీ అగ్నిప్రమాదం

## 14 అంతస్తుల భవనంలో అంటుకున్న మంటలు

## నలుగురు మృతి, మరో 20 మంది గల్లంతు

**వాలెన్సియా,ఫిబ్రవరి24(వెలుతురు):** స్పెయిన్‌లోని వాలెన్సియాలో 14 అంతస్తుల భవనంలో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో నలుగురు మృతి చెందినట్టుగా తెలిసింది. మరో 20 మంది గల్లంతయ్యారు.. వారందరి పరిస్థితి ఎలా ఉందోనని కుటుంబ సభ్యులు, వ్యక్తి బహుళ అంతస్తుల నుండి కిందకు దూకడం కనిపించింది. అతనిని రక్షించడానికి, కింత కొందరు మ్యాట్‌లు ఏర్పాటు చేశారు. మరోవైపు భవనంలోని ఇళ్లలో ఉంటున్న చాలా మంది వ్యక్తులు తమ ఫ్లాట్ బాల్కనీ నుండి సహాయం కోసం అర్థించటం కనిపించింది. దాదాపు 20 మంది అగ్నిమాపక



బంధువులు ఆందోళన వ్యక్తం చేశారు. నివేదికల ప్రకారం, గురువారం సాయంత్రం 5.30 గంటలకు (స్థానిక కాలమానం ప్రకారం) మంటలు చెలరేగాయి. ఈ క్రమంలో దాదాపు 350 మంది భవనంలో చిక్కుకుపోయారు. మంటల నుండి తప్పించుకోవడానికి చాలా మంది అనేక అంతస్తుల నుండి దూకారు. ఈ క్రమంలో భవనం కింద నెట్‌లను ఏర్పాటు చేశారు. ప్రమాదం జరిగిన క్షణాల్లోనే టవర్ అంతటా మంటలు వ్యాపించినట్టుగా సమాచారం. ఆ బిల్డింగ్ నుంచి మరో బిల్డింగ్‌కు మంటలు వ్యాపించాయి. ప్రస్తుతం ఘటనకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. వైరల్ అవుతున్న వీడియోలో ఒక సిబ్బంది మంటల్ని ఆర్పే ప్రయత్నం చేశారు. బలమైన గాలుల వల్ల మంటలు మరింత పెరుగుతున్నాయి.. క్రేన్ల ఆధారంగా ఫైర్‌ఫైటర్లు స్థానికుల్ని రక్షించారు. ఈ ఘటనలో భవనం పూర్తిగా మంటల్లో దగ్ధమైనట్టుగా తెలుస్తుంది.

మంటలు అంటుకున్న బిల్డింగ్‌లో 138 ఫ్లాట్లు ఉన్నాయి. దాంట్లో 450 మంది ఇక్కడ నివసిస్తున్నారు. ప్రమాదంలో ఆరుగురు అగ్నిమాపక సిబ్బందితో పాటు మొత్తం 15 మంది గాయపడ్డారు. అయితే వారి పరిస్థితి నిలకడగా ఉందని అధికారులు చెబుతున్నారు. గల్లంతైన 20 మంది కోసం గాలిస్తున్నామని వాలెన్సియా మేయర్ మారియా జోస్ కటలా తెలిపారు.

## ప్రజల వద్దకే పాలన

# జగన్‌తోనే సాధ్యం

## విజయవాడ ఎంపీ కేశినేని నాని

**అమరావతి,ఫిబ్రవరి24(వెలుతురు):** నాగార్జున నగర్ లో 5.70లక్షలు రూపాయల నిధులతో అభివృధి పనులకు శంకుస్థాపన కార్యక్రమంలో విజయవాడ ఎంపీ కేశినేని నాని, తూర్పు నియోజకవర్గ ఇన్చార్జ్ దేవినేని అవినాష్, నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మీ, వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని నాని మాట్లాడుతూ.. ప్రజల వద్దకే పాలన కల్పన జగన్ తోనే సాధ్యం అయిందన్నారు. విలేజ్ క్లినిక్ ల ద్వారా ప్రజా ఆరోగ్యం భద్రత కల్పించిన జగన్.. వాలంటీర్ వ్యవస్థ ద్వారా ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు అందించిన జగన్ ప్రభుత్వం అని ఆయన పేర్కొన్నారు. మానవ అభివృద్ధి కావాలి.. గ్రాఫిక్స్ అభివృధి ప్రజలకు ఏందుకు అని ప్రశ్నించారు. రాష్ట్రంలో జరిగిన అభివృద్ధిపై టీడీపీతో చర్చకు నేను సిద్ధంగా ఉన్నాను.. బీసీలకు సముచిత స్థానం కల్పన జగన్ కే సాధ్యమన్నారు. టీడీపీలోనే బీసీలకు ఏం న్యాయం చేశారో చెప్పగలరా అని ఎంపీ కేశినేని నాని అడిగారు.ప్రతీ డివిజన్ లో 20 కోట్లపై బడి అభివృద్ధి జరిగింది అని దేవినేని అవినాష్ అన్నారు. టీడీపీ హయాంలో గతుకుల రోడ్లు, నిండిన డ్రైనేజీలు వుండేవి అన్నారు. కొండ ప్రాంతంలో రైలింగ్, మెట్ల నిర్మాణం చేసిన ఘన వైఎస్ఆర్సీపీ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. ఓటు వేసినా వేయక పోయినా సంక్షేమం, అభివృద్ధి ఆపొద్దు అని జగన్ చెప్పారు.. ఓ వర్గానికి చెందిన మీడియా ద్వారా టీడీపీ అసత్య ప్రచారం చేయటం బాధాకరం అని ఆయన చెప్పుకొచ్చారు. గత 10సం టీడీపీ ఎమ్మెల్యేగా ఉండి గద్దె ఏం అభివృద్ధి చేశారు.. మాజీ సీఎం చంద్రబాబు నియోజక వర్గంలో కూడా అనేక అభివృధి, సంక్షేమ పథకాలను జగన్ అమలు చేశారని తెలిపారు. రానున్న ఎన్నికల్లో టీడీపీని తరిమికొట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారు.. ఎన్టీఆర్ జిల్లాలోని 7 నియోజకవర్గాలలో వైసీపీ జెండా ఎగుర వేస్తామని తూర్పు నియోజకవర్గ ఇంఛార్జ్ దేవినేని అవినాష్ వెల్లడించారు.



# అదుపుతప్పిన టూ వీలర్: ఒకరు మృతి

**కుమ్రంభీం ఆసిఫాబాద్,ఫిబ్రవరి24(వెలుతురు):** కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ద్విచక్రవాహనం అదుపుతప్పి ఒకరు మృతి చెందగా మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ విషాదకర సంఘటన సిర్పూర్(టి) మండలం వెంపల్లి రైల్వే గేటు వద్ద శనివారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. గుర్తించిన స్థానికులు క్షతగాత్రులను దవాఖానలో చేర్పించి పోలీసులకు సమాచారమిచ్చారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాగా, ముగ్గురు స్నేహితులు ఒకే బైక్‌పై వెళ్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# జనసంద్రంగా మేడారం జాతర

## అమ్మవార్ల వనప్రవేశంతో దర్శనానికి పోటెత్తిన జనం

**ములుగు,ఫిబ్రవరి24(వెలుతురు):** సమ్మక్క, సారలమ్మ, పగిడిద్ద రాజు, గోవిందరాజులు శనివారం వన ప్రవేశం చేయనుండడంతో భక్తులు భారీగా తరలివచ్చారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి గ్ద్దెల శుద్ధి పక్రియ మొదలై 5 నుంచి 6 గంటల మధ్య జరుగుతుంది.... ఈ కార్యక్రమం అయిపోగానే మేడారం మహాజాతర పూర్తయినట్లు గిరిజన పూజారులు అధికారికంగా ప్రకటిస్తారు. బుధవారం సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజులు రాకతో మొదలైన మహాజాతర వన ప్రవేశంతో ముగుస్తుంది. సమ్మక్క, సారలమ్మను వనం నుంచి జనంలోకి తీసుకొచ్చిన పూజారులే తిరిగి వనప్రవేశం చేయిస్తారు. ఇందుకోసం శనివారం మధ్యాహ్నం నుంచే గద్దెల దగ్గర పూజలు జరుగుతాయి. ఈ క్రమంలో అమ్మవార్లను దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. మూడురోజుల్లో కోటి మందికి పైగా భక్తులు తరలివచ్చారని దేవాదాయశాఖ అధికారులు ప్రకటించారు. సారలమ్మను కన్నెపల్లి నుంచి గ్దదెలపైకి తీసుకొచ్చిన బుధవారం 20 లక్షల మంది దాకా, సమ్మక్కను తీసుకొచ్చిన గురువారం 30 లక్షల మందికిపైగా, శుక్రవారం 50 లక్ష మందికి పైగా మేడారం వచ్చారని వెల్లడించారు. గురువారం నుంచి మేడారం చుట్టూ రెడ్డిగూడెం, ఊరట్టం, నార్లాపూర్, కన్నెపల్లి ఏరియాలన్నీ పూర్తిగా భక్తులతో నిండిపోయాయి. బుధవారం రాత్రి నుంచి శుక్రవారం రాత్రి వరకు మేడారం గ్దదెలు నిమిషం కూడా ఖాళీలేకుండా భక్తులతో నిండిపోయి ఉన్నాయి. ఇలా మూడు రోజుల్లో కలిపి సుమారు కోటి మందికి పైగా మేడారానికి వచ్చారని అధికారులు ప్రకటించారు. మహాజాతరకు శనివారం చివరి రోజు కావడంతో భక్తుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది.

## పాలకుల నిర్లక్ష్యంతో అభివృద్ధికి

# నోచని పటాన్ చెరు

## బిజెపి మాజీ ఎమ్మెల్యే రఘునందన్ రావు

**సంగారెడ్డి,ఫిబ్రవరి24(వెలుతురు):** పాలకుల చిత్తశుద్ధి లోపంతోనే ఆసియాలోనే అతిపెద్ద పారిశ్రామిక ప్రాంతం పఠాన్ చెరు ఏలాంటి అభివృద్ధి చెందలేదని బీజేపీ మాజీ ఎమ్మెల్యే రఘుందన్ రావు విమర్శలు గుప్పించారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ... ఈదుల నాగుల పల్లిలో రైల్వే టెర్మినల్ భూసేకరణ వద్దే ఆగిపోవటం విచారకరమన్నారు. 153 కిలోమీటర్ల రింగ్ రోడ్డు నిర్మాణం సాధ్యమైనా కొల్లూరు వద్ద కిలోమీటర్ సర్వీస్ రోడ్డును ఇవ్వలేకపోవటం బాధాకరమన్నారు. స్థానిక ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డికి రియల్ ఎస్టేట్ మీద ఉన్న ప్రేమ సర్వీస్ రోడ్డు నిర్మాణం పై లేదని మండిపడ్డారు. పటాన్ చెరులో గొప్ప లాండ్ బ్యాంకు ఉన్నా ఐటి సెజ్ అభివృద్ధి చేయలేదన్నారు. లక్డారంలో క్రషర్ల రూపంలో గుట్టలను, కొండలను కరిగించేశారన్నారు. బీఆర్ఎస్ పార్టీకి ప్రజా సమస్యలపై చిత్తశుద్ధి లేదన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికలలో బీజేపీకే ప్రజలు పట్టం కడతారని రఘునందన్ రావు ధీమా వ్యక్తం చేశారు.

# ఢిల్లీ శివారులోనే రైతుల మకాం

## వంటావార్పూ అక్కడే

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి24(వెలుతురు):** దేశ రాజధాని ఢిల్లీలో రైతుల ఆందోళన కొనసాగుతున్నది. తమ డిమాండ్లు నెరవేరుస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చేవరకు ఆందోళన విరమించేది లేదని రైతులు తెగేసి చెబుతున్నారు. ఈ మేరకు ఢిల్లీ, పంజాబ్-హర్యానా సరిహద్దుల్లోనే వారు మకాం వేశారు. కావాల్సిన సరుకు సరంజామా అంతా వెంట తెచ్చుకుని బార్డర్‌లో తిష్టవేశారు. అక్కడే వండుకుతిని గుడారాల్లో తలదాచుకుంటున్నారు. తాము పండించిన పంటలకు కనీస మద్దతు ధర కల్పించాలని, గత ఆందోళనల సందర్భంగా తమపై నమోదు చేసిన కేసులను ఎత్తివేయాలని రైతులు ప్రధానంగా డిమాండ్ చేస్తున్నారు. రైతుల డిమాండ్లపై చర్చకు సిద్ధమంటూనే ప్రభుత్వం తాత్సారం చేస్తూ వస్తున్నది. గతంలోలా రైతులు రాజధానిలోకి చొచ్చుకురాకుండా భారీ బందోబస్తు ఏర్పాటు చేసింది. పంజాబ్-హర్యానా నడుమగల శంభు సరిహద్దులో రైతులు వాహనాలపైనే వంట చేసుకుంటున్న దృశ్యాలను కింది వీడియోలో చూడవచ్చు.



## విద్యార్థుల ప్రవర్తన

పాఠశాల ఒక సామాజిక దేవాలయం. అక్కడ అందరూ సమానం. పేద, ధనిక భేదాలు ఉండకూడదు. పురాణాల కాలం నుంచి మన విద్యావ్యవస్థలో ఇది కనిపిస్తుంది. దశరథ మహారాజు కుమారులైన రామలక్ష్మణభరతశత్రుఘ్నులు వసిష్ఠుడి దగ్గర, బలరామకృష్ణులు సాందీపని ముని దగ్గర ధనవంతుల పిల్లల్లా విద్యనభ్యసించలేదు. నిరాడంబరంగా, సామాన్యుల్లాగే చదువుకున్నారు. సామాజిక, రాజనీతి విషయాలలో శ్రీరామచంద్రుడు ఈనాటికీ ఆదర్శమూర్తిగా భావించడానికి కారణం గురువు దగ్గర వినయంగా విద్యనభ్యసించడమే. శ్రీకృష్ణుడు నిరుపేద అయిన కుచేలుడితో స్నేహం చేశాడు. వారి మైత్రి గురుకులం వరకే పరిమితం కాలేదు. కృష్ణుడు ఎంతో ఉన్నతస్థాయికి ఎదిగాక కూడా కుచేలుడిని ఆదరించాడు. తన సరసన కూర్చోబెట్టుకొని, గౌరవించేంతటి సంస్కారం ఆనాటి విద్యావిధానం నేర్పినదే.

## ఏదైనా.. విజ్ఞాన గని

ప్రతి మనిషి చదువుకోవాలి. చదువుకుంటేనే మంచి మనుగడ. పరిణామ క్రమంలో విద్యావ్యవస్థలో ఎన్నో మార్పులు వచ్చాయి. పురాణకాలంలో గురుకులాల్లో చదువుకునేవారు. బౌద్ధమత రోజుల్లో అది ఆరామాలకు చేరుకుంది. తర్వాత అనేక సంస్కరణలకు నోచుకుంది, అనేక విధానాలు అలవర్చుకుంది. ఒకనాడు గురుకులం.. ఇంకోనాడు ఆరామం.. ఇప్పుడు పాఠశాల.. ఏదైనా విజ్ఞానాన్ని ప్రసాదించే ఆలయమే. అక్కడ గురువే దైవం. అక్కడికి వచ్చే శిష్యుడు పరమభక్తుడు. ఆ భక్తుడిని పరిపూర్ణంగా అనుగ్రహించాల్సింది గురుదేవుడే. ఒత్తిడి లేని చదువును అనుగ్రహించి.. విజ్ఞానాన్ని కటాక్షించి.. వారి జీవిత మార్గానికి వెలుగు ప్రసాదించాలి.

# ఎవరు గురువు? ఏది చదువు?

**విద్యార్థికి ఈ సమాజం అంతా గురువే. తెలియని విషయాలు చెప్పేవారందరూ గురువులే. చేపలు పట్టే వ్యక్తి కూడా ఏకాగ్రత విషయంలో గురువే అని వివరిస్తుంది మహాభాగవతంలోని అవధూత ఉపాఖ్యానం. సమాజం నుంచి సమగ్రమైన విజ్ఞానం లభిస్తుంది. మనసు వికసిస్తుంది. తుదిగా ఆ సమాజంపై గౌరవం ఏర్పడుతుంది.**

గమ్యం తెలియని జీవన గమనానికి దారి చూపే దీపం చదువు. విద్యార్థి జీవితం సజావుగా సాగేందుకు ఆ దీపాన్ని భద్రంగా పట్టుకొని ఉండే జ్ఞానాధారం గురువు. విద్యార్జన మహాయాగం వంటిది. దానిని నిర్వహించే బ్రహ్మ గురువు. ఆయన అనుగ్రహం విద్యార్థిని జ్ఞానవంతుడిని చేస్తుంది. విద్యార్థి చదువు గురువుతో ఉండే అనుబంధం మీద ఆధారపడి ఉంటుంది. గురుశిష్యుల సంబంధం గురించి, సమాజహితాన్ని కోరే చదువు గురించి మన సనాతన ధర్మం ఏం చెప్పిందంటే..

తమ చిన్నారికి మూడో యేడు వచ్చిందో లేదో తల్లిదండ్రులకు ఆరాటం. ఎప్పుడెప్పుడు అక్షరస్వీకారం చేయిస్తామో.. ఎప్పుడెప్పుడు బడికి పంపిస్తామో అని. మన సంప్రదాయంలో పిల్లలను బడిలో వేయడం కూడా ఒక సంబరమే. పప్పు బెల్లాలు, పలకాబలపాలు తోటి పిల్లలకు పంచిపెట్టి.. తమ పిల్లలతో ఓనమాలు దిద్దిస్తారు. ఆనందంగా మొదలయ్యే విద్యార్థి జీవితం ఓ మధురానుభూతి. చదువంటే ఓ సంతోషం, ఓ ఆనందం. బడికి పోవాలనే ఒకటే ఆరాటం. ఎలాంటి ఒత్తిడి లేకుండా, హాయిగా చదువుకోవడం తొలినాళ్ల నుంచి మన విద్యావ్యవస్థలో కనిపిస్తుంది. అప్పుడే పునాది గట్టిగా ఉంటుంది. దానిపై భవిష్యత్ బంగారుమేడ గట్టిగా నిలవగలుగుతుంది.

### మనిద్దరం కలిసి..

విద్యార్థి జీవితం గురువుపైనే ఆధారపడి ఉంటుంది. గురుశిష్యుల బంధం ఎంత బలంగా ఉంటే.. ఆ విద్యార్థి భవిష్యత్తు అంత ఉజ్వలంగా ఉంటుంది. సనాతన విద్యావిధానం గురుశిష్యుల సంబంధాన్ని చాలా సందర్భాల్లో స్పష్టం చేసింది. దీనికి సంబంధించిన సారాంశం కేనోపనిషత్తు శాంతి మంత్రంలో కనిపిస్తుంది.

**"ఓం సహనావవతు, సహనౌభునక్తు..**
**సహవీర్యం కరవావహై**
**తేజస్వినావధీతమస్తు మావిద్విషావహై**
**ఓం శాంతిః శాంతిః శాంతిః"**

ఈ శాంతి మంత్రం విద్యావిధానానికి ఓ దిక్సూచి లాంటిది. దీనిలో ఉన్న గురుశిష్య సంబంధ అంశాలను పరిశీలిస్తే మన సంప్రదాయం వారి బంధానికి ఎంత ప్రాధాన్యం ఇచ్చిందో తెలుస్తుంది. శిష్యుడిని గురువు ఎంత ప్రేమగా చూసుకోవాలో అర్థమవుతుంది. "ఓ శిష్యుడా! మనమిద్దరినీ భగవంతుడు రక్షిస్తూ, పోషిస్తూ ఉండాలి. మనమిద్దరం శక్తిమంతులమై శ్రమిస్తూ ఉండాలి. మన అధ్యయనం తేజోవంతంగా ఉండాలి. మనిద్దరం నిరంతరం ద్వేషం లేకుండా ఉందాం" ఇది కేనోపనిషత్తులోని శాంతిమంత్ర ప్రసాదం. గురుశిష్య సంబంధం గురించి విద్యార్థికి ప్రతి గురువూ తెలియజేయాలి. అప్పుడు ఆ విద్యార్థికి గురువు ప్రాణసమానుడు అవుతాడు.

**వినయమే విద్యార్జనకు తొలిమెట్టు. గురువు కూర్చునే ఆసనం, ఆయన వినియోగించే వస్తువులను కూడా సాక్షాత్తు గురువే అనే భావనతో ఉండేవారు అప్పటి విద్యార్థులు. పాఠం ముగించుకొని గురువు వెళ్లాక.. ఆయన వినియోగించిన ఆసనాన్ని తాకడానికి సాహసించేవారు కాదు. గురువుపై అంతటి భక్తిప్రపత్తులుండేవి.**

### అందరికీ చదువు

విద్య అందరికీ అవసరమే. అందుకే తల్లిదండ్రులు తమ పిల్లల విషయంలో విద్యకు అత్యంత ప్రాధాన్యం ఇస్తారు. పురాణాల కాలంలోనూ ఇదే కనిపిస్తుంది. మనుషులు, దేవతలే కాదు.. చదువు ఎంత గొప్పదో అసురుల్లోనూ నాటుకుపోయింది. ఈ విషయాన్ని పోతన మహాభాగవతం ఏడో స్కందంలోని 130, 132 పద్యాల సారాంశం మనకు విశదీకరిస్తుంది. హిరణ్యకశిపుడు రాక్షసరాజు. ఆయన కుమారుడు ప్రహ్లాదుడు. ఓ రోజు చిన్నారి ప్రహ్లాదుడిని చెంతకు పిలిచిన హిరణ్యకశిపుడు లాలనగా..

**చదువని వాడజ్ఞుండగు,**
**జదివిన సదసద్వివేక చతురత గలుగుం**
**జదువగ వలయును జనులకు, జదివించెద**
**నార్యులొద్ద జదువుము తండ్రీ!'**

అని అన్నాడు. "జీవితానికి చదువు చాలా ముఖ్యం, చదువుకోని వాడు అజ్ఞానిగా ఉంటాడు.. వాడు పశువుతో సమానం. చదువుకుంటే తెలివితేటలు బాగా వస్తాయి. చదువనేది మంచి ఏమిటి? చెడు ఏమిటి? అనే వివేకాన్ని కలిగిస్తుంది. అందుకే పుట్టిన ప్రతివాడూ చదువుకోవాలి. నిన్ను మంచి గురువుల దగ్గర చదివిస్తాను" అని ఆ పద్య భావం. ప్రతి తల్లిదండ్రులు తమ పిల్లలకు విద్య ప్రాధాన్యం తెలియజేయాలి. తగిన విధంగా ప్రోత్సహించాలి. విద్యపై ఆసక్తి కలిగించే విషయాలు చెప్పాలి. అప్పుడు పిల్లలకూ బడిపై మమకారం పెరుగుతుంది. చదువుపై ఆసక్తి కలుగుతుంది.

### సంస్కరించే విద్య..

ఇప్పుడు చదువంటే.. మార్కులు. ఉత్తీర్ణత శాతం. పోటాపోటీ పరుగు. తల్లిదండ్రులు కూడా అలాగే వ్యవహరిస్తున్నారు. బాగా చదవాలంటూ పిల్లలపై ఒత్తిడి చేస్తున్నారు. పాఠశాలకు వెళ్లి తమ పిల్లాడికి మార్కుల గురించి అడుగుతున్నారే కానీ, ఎలాంటి విద్య బోధిస్తున్నారో, ఏం నేర్పించాలో సూచించడం లేదు. కానీ, తల్లిదండ్రులు పిల్లవాడిని బడికి పంపినప్పుడు ఎలా వ్యవహరించారో హిరణ్యకశిపుడి ద్వారా మనకు తెలియజేశారు పోతన. ప్రహ్లాదుడిని గురువులకు అప్పగిస్తూ హిరణ్యకశిపుడు.. "ఓ గురువులారా! మా పిల్లవాడు ఇప్పటిదాకా జీవితానికి సంబంధించిన జ్ఞానం లేకుండా ఉన్నాడు. నేను మా అబ్బాయి పైకి రావాలని అనుకుంటున్నాను. దయచేసి మా పిల్లవాడికి చదువు చెప్పి గ్రంథాలు చదివించండి. నీతిశాస్త్రం నేర్పించి సంస్కరించి మమ్మల్ని రక్షించండి" అని విన్నవించుకున్నాడు. ఇందులో తన కుమారుడికి నైతిక విలువలున్న విద్య నేర్పించండని కోరడం కనిపిస్తుంది. విద్యకు ముందు కావాల్సింది నైతికత. మన సంప్రదాయం నైతిక విలువలకు ప్రాధాన్యమిచ్చింది. ఈ తరం తల్లిదండ్రులు తమ బిడ్డలకు ఉన్నత విద్యతో పాటు, ఉన్నత విలువలు రావాలని ఆకాంక్షించాలి. మన విద్యావిధానంలో ప్రతి అంశానికీ నైతిక విలువలు జోడించి చెప్పడం సాధ్యమేనని విద్యావేత్తలు చెబుతున్నారు. ఫలితంగా పిల్లలకు విజ్ఞానంతో పాటు నైతికత అబ్బుతుంది. నీతిగా మెలగాలన్న స్ఫురణ కలుగుతుంది.

### విలువలకు కట్టుబడి

గురువు విద్యార్థులకు ఆదర్శంగా నిలవాలి. నైతిక విలువలకు కట్టుబడి ఉండాలి. విరాటరాజు కొలువులో బృహన్నలగా ఉన్న అర్జునుడు రాకుమారి ఉత్తరకు నాట్యం నేర్పించేవాడు. ఉత్తర అపురూప సౌందర్యరాశి. అజ్ఞాతవాసం ముగిసిన తర్వాత ఉత్తరను వివాహం చేసుకోవాల్సిందిగా అర్జునుడిని కోరుతాడు విరాటరాజు. అప్పుడు అర్జునుడు 'గురువుగా ధర్మం తప్పడం మంచిది కాదని, ఉత్తరను తన కుమారుడు అభిమన్యుడికిచ్చి వివాహం చేస్తాన'ని విరాటరాజుకు వివరించి చెబుతాడు.

## సత్కార్యాలతోనే సాఫల్యం!

అందమైన ఇల్లు, అనుకూలవతి అయిన భార్య, రత్నాల్లాంటి బిడ్డలు, కావాల్సినంత సంపద, విలాసవంతమైన జీవితం ఇన్ని ఉన్నా.. చాలా మందికి సంతృప్తి ఉండదు. సంపద అనేది పాక్షికమైన ఆనందాన్ని ఇస్తుందే కానీ, పరిపూర్ణమైన సంతోషానికి సోపానం కాదని గుర్తించాలి. మరి మంచి జీవితం, శాంతి, సంతోషం, సంతృప్తి ఇవన్నీ ఎలా లభిస్తాయి? ఇదే ప్రశ్నను ఒక శిష్యుడు ప్రవక్త (స)ను అడిగాడు. అప్పుడాయన 'అల్లాహ్‌ను బాగా స్మరించు, అనాథలను ఆదరించు, పేదలకు శక్తిమేర సాయం చెయ్యి'



అని ఉపదేశించారు. కానీ, నాలుగురాళ్లు సమకూరగానే మనుషుల్లో అహం పెరిగిపోతోంది. దైవాన్ని స్మరించడం మరచిపోతున్నాడు. పేదలను ఈసడించుకుంటున్నాడు. ఇలాంటి భావనలు ఉన్నంత కాలం సంతోషం దరి చేరదు. ప్రవక్త(స) చెప్పినట్లు.. సత్కార్యాల్లోనే సంతృప్తి ఉంది. ధర్మ బద్ధమైన సంపాదన, ధర్మ సమ్మతమైన ఖర్చు, మంచి పనుల కోసం వెచ్చించే సమయం.. ఇవన్నీ సంతోషానికి హేతువులు అవుతాయి. మనసుకు శాంతిని చేకూరుస్తాయి. ఇహపర సాఫల్యాన్ని అందిస్తాయి.

## మనసు జయించిన మహావీరుడు

జిన అనే పదం నుంచి ఆవిర్భవించింది జైనం. ఆ పదానికి జయించినవాడు అని అర్థం. బంధనాలు, కోరికలు, మానసిక వికారాలను జయించి (జినులై) ఉంటే కైవల్యం సాధ్యమనేది జైన మత నినాదం. దీనికోసం జనులు నిర్గ్రంధులు కావాలని వీరి ప్రధాన బోధ. అంటే భవబంధాల నుంచి విముక్తి పొందిన వారని అర్థం.



**స్థాపన:** జైన మత స్థాపకుడు వృషభనాథుడు. ఇతడు మొదటి తీర్థంకరుడు. జీవ ప్రవాహాన్ని దాటడానికి వారధి నిర్మించిన వారిని తీర్థంకరులు అంటారు. వీరు మొత్తం 24 మంది. వీరిలో చివరి ముగ్గురూ ఈ సిద్ధాంతం అభివృద్ధికి కృషి చేశారు. వారు నేమి, పార్శ్వనాథుడు, వర్ధమాన మహావీరుడు. ప్రాచీన జైన సిద్ధాంతాన్ని పూర్తి స్థాయిలో మతంగా రూపుదిద్ది ప్రచారం చేసిన వాడు వర్ధమాన మహావీరుడు. అందుకే ఆ మతం ఆయన పేరుతోనే ప్రచారం లోకి వచ్చింది.

ఇతని అసలు పేరు వర్ధమానుడు. తండ్రి సిద్ధార్థుడు. తల్లి త్రిశల. వైశాలీ నగరం దగ్గరలోని కుంద అనే గ్రామంలో జన్మించాడు. భార్య యశోద. నలందని దర్శించినప్పుడు గోశాల ముష్కర పుత్రుడు అనే సన్యాసితో పరిచయమైంది. ఆయన బోధనల ప్రభావంతో 30వ ఏట సన్యాసాన్ని స్వీకరించాడు. కొన్నాళ్లకు వస్త్రాలను కూడా విడిచి దిగంబరుడై ఆ స్థితిలోనే జృంభక పర్వత సానువుల్లో రుజుపాలిక నదీ తీరంలో మద్ది వృక్షం కింద తపస్సు ప్రారంభించాడు. అంచెలంచెలుగా తపస్సును కఠినతరం చేస్తూ 43వ ఏట జ్ఞానోదయం పొందాడు. అన్నిటినీ జయించినవాడు కాబట్టి జినుడు అని, కోరికలతో పోరాడి గెలిచినవాడు కాబట్టి మహావీరుడు అని పిలుస్తారు. ఇంకా వీర, వీరప్రభు, అతివీర, సన్మతి, జ్ఞానపుత్ర అనే పేర్లున్నాయి.

జైనానికి ఆయువు పట్టు: జైన మతానికి త్రిరత్నాలు ఆధార భూతమైన సూత్రాలు. అవి సమ్యక్ దర్శనం, సమ్యక్ జ్ఞానం, సమ్యక్ జీవనం. మరో అయిదు మార్గదర్శక సూత్రాలున్నాయి. అవి... సత్యం, అహింస, అపరిగ్రహం (ఇతర వస్తువుల కోసం ఆశ పడకపోవడం), అస్థేయం (దొంగతనం చేయకపోవడం), బ్రహ్మచర్యం. వీటన్నిటినీ బోధిస్తూ మహావీరుడు దేశాటనం చేశారు.

**పెద్దపీట:** అహింసా మార్గాన పయనిస్తే సంసారిగా ఉంటూనే కైవల్యం పొందవచ్చనేది వీరి ప్రధాన నినాదం. అందుకే వీరు అహింసకు చాలా ప్రాధాన్యతనిస్తారు. ఎంతగా అంటే... వ్యవసాయం వల్ల భూమిలోని జీవులు హింసకు గురవుతాయని వ్యవసాయం చేయకపోవడం వీరి మార్గగమనానికి పరాకాష్ఠ.

**శాఖలు:** జైనంలో దిగంబర, శ్వేతాంబర అనేవి రెండు ప్రధాన శాఖలు. కొన్ని విషయాల్లో బేధాలున్నా వీరి మౌలిక సూత్రాలు ఒకటే. వీరు నిరీశ్వర వాదులు. వీరి దృష్టిలో సృష్టికర్త లేడు. వేద ప్రామాణ్యాన్ని అంగీకరించరు. ఆత్మ అంటే జీవమని నమ్ముతారు. పర్వతాలు, లోహాల వంటివాటినీ సావర్త జీవులు అంటారు.

**నిర్యాణం:** నేటి పాట్నాను ఆ రోజుల్లో పాటలీపుత్రం అని పిలిచేవారు. అక్కడికి సమీపంలో ఉన్న ఒక గ్రామంలో హస్తిపాలుడు అనే శిష్యుడి ఇంట్లో 73వ ఏట అనారోగ్యంతో మరణించాడు.

## సత్యంతోనే విమోచన

ఒక కార్యాలయంలో ఇద్దరు ఉద్యోగులు ఉండేవారు. ఒకాయన ఉన్నతోద్యోగి. మంచి జీతం, మంచి హోదా. మరొకతను చిరుద్యోగి. తక్కువ జీతం. అతనిది పెద్ద కుటుంబం. పైగా ఆర్థిక సమస్యలు. ఇన్ని ఇబ్బందులున్నా.. ఇవేవీ అతని ముఖంలో కనిపించేవి కావు. ఎప్పుడూ ప్రశాంతంగా ఉండేవాడు. ఉన్నతోద్యోగికి ఏ సమస్యలూ లేకపోయినా.. అతని ముఖంలో ఎప్పుడూ బాధ, అభద్రత కనిపించేవి. ఆ చిరుద్యోగి ప్రశాంతంగా ఉండటానికి, ఈ పెద్ద ఉద్యోగి ఆలోచనలతో సతమతమవ్వడానికి కారణం రెండు అక్షరాలు. అదే సత్యం.

చిరుద్యోగి ఏనాడూ అబద్ధమాడేవాడు కాదు. నిజం దాచేవాడు కాదు. అందుకే నిరంతరం ఆత్మవిశ్వాసంతో ఆనందంగా ఉండేవాడు. ఉన్నతోద్యోగి ఇంటాబయటా అబద్ధాలు చెప్పేవాడు! అందుకే ఎప్పుడూ అపరాధ భావంతో ఆంతర్మథనం చెందుతూ ఉండేవాడు. ఈ సందర్భంగా క్రీస్తు చెప్పిన ఒక అద్భుతమైన వాక్యాన్ని గుర్తు చేసుకోవచ్చు.

"మీరు సత్యాన్ని గ్రహిస్తారు. ఆ సత్యం మిమ్మల్ని స్వతంత్రులుగా చేస్తుంది" అంటారు ప్రభువు. సత్యంగా బతికేవారు ఎవరికీ భయపడాల్సిన పనిలేదు. వారికి ఏ ఆందోళనా ఉండదు. వారిలో ఆత్మవిశ్వాసం తొణికిసలాడుతుంటుంది. అలాంటి వారు ఏ హోదాలో ఉన్నా.. ఏ సంపదలూ లేకపోయినా.. లోకం వారికి దాసోహం అవుతుంది. అందుకే 'సత్యమే జయం' అన్నారు



పెద్దలు. అబద్ధం అనేది బతుకును బంధీలను చేస్తే.. సత్యవంతమైన జీవితం మనిషికి స్వేచ్ఛ కలిగిస్తుంది.

# టిడిపి,జనసేన తొలిజాబితా విడుదల

## 94 టిడిపి, 24 జనసేన అభ్యర్థులకు చోటు

## జనసేనకు 3 లోక్‌సభ స్థానాల కేటాయింపు


## యువత,మహిళలకు పెద్దపీట వేసిన టిడిపి

**అమరావతి,ఫిబ్రవరి24 (వెలుతురు):**
తెలుగుదేశం, జనసేన పార్టీ ల తరపున శాసనసభ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల తొలి జాబితా విడుదలైంది. తెదేపా అధినేత చంద్రబాబు, జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ ఒకే వేదికపై నుంచి అభ్యర్థుల పేర్లను ప్రకటించారు. తొలి విడతగా 94 చోట్ల పోటీ చేసే తెదేపా అభ్యర్థుల పేర్లను చంద్రబాబు వెల్లడించారు. పొత్తులో భాగంగా జనసేన 24 అసెంబ్లీ స్థానాలు, 3 లోక్‌సభ స్థానాల్లో పోటీ చేయనుంది. ఇందులో 5 అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థులను పవన్ ప్రకటించారు. తెదేపా అధినేత చంద్రబాబు నాయుడు కుప్పం, సినీ నటుడు నందమూరి బాలకృష్ణ హిందూపురం, తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ మంగళగిరి నుంచి పోటీ చేస్తుండగా, జనసేన ముఖ్య నేత నాదెండ్ల మనోహర్ తెనాలి నుంచి బరిలో నిలబడ్డారు. టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కల్యాణ్ కలిసి విడుదల చేససిన తొలి విడత అభ్యర్థుల జాబితాలో చాలా విశేషాలు ఉన్నాయంటున్నాయి ఆపార్టీ వర్గాలు. ఇందులో టీడీపీ 94 మందికి ఈ లిస్ట్‌లో చోటు కల్పించగా... 24 స్థానాల్లో పోటీ చేయబోతున్న జనసేన కేవలం ఐదుగురు పేర్లు మాత్రమే వెల్లడించింది. మిగతా వారి వివరాలు త్వరాలనే చెబుతామంటున్నారు పవన్ కల్యాణ్.

94 మందితో కూడిన టీడీపీ మొదటి జాబితా పరిశీలిస్తే జాగ్రత్తగా జాబితా విడుదల చేసినట్టు చెబుతున్నారు. అన్ని సామాజిక వర్గాలకు, గతంలో హామీ ఇచ్చినట్టు యువతకు కూడాచోటు కల్పించారు. మహిళలకు తగిన స్థాయిలో స్థానం ఇచ్చారు. టీడీపీ ప్రకటించిన జాబితాలోని 94 మందిలో 23 మంది కొత్తవారికి పోటీ చేసే అవకాశం కల్పించింది. చాలా వేదికలపై యువతు చోటు కల్పిస్తామని చంద్రబాబుతోపాటు లోకేష్ కూడా చెప్పారు. ఈసారి రాజకీయం మనదేనంటూ యువతను ప్రోత్సహించారు. అన్నట్టుగానే ప్రస్తుతం విడుల చేసిన జాబితాలో 23 మందికి స్థానం కల్పించారు. ఈ జాబితాలో 25 నుంచి 35 ఏళ్లు ఉన్న వాళ్లు ఇద్దరు ఉన్నారు. 36 నుంచి 45 మధ్య వయసు కలిపిన నేతలు 22 మంది ఉన్నారు. 46 నుంచి 60 ఏళ్ల వయసు ఉన్న వాళ్లు 55 మందికి చోటు దొరికింది. 60 ఏళ్లకు పైబడిన వాళ్ల సంఖ్య 20గా ఉంది.
మొదటి జాబితాలో ప్రకటించిన లిస్ట్‌లో 13 మంది మహిళలకు చోటు దక్కింది. ఈ జాబితాలో పీజీలు చదివిన వారు 28 మంది ఉంటే... డిగ్రీ చదివిన వాళ్లు 50 మంది ఉన్నారు. డాక్టర్లు ముగ్గురు, పీహెచ్‌డీలు చేసిన వాళ్లు ఇద్దరు. ఒకరు ఐఏఎస్ ఆఫీసర్ ఉన్నారు. ఈ జాబితా తయారీలో చాలా అధునాతనమైన పద్ధతులను ఉపయోగించి అభ్యర్థులను ఎంపిక చేశామంటున్నారు చంద్రబాబు. కోటీ 3 లక్షల 33 వేల మందికిపైగా ప్రజల అభిప్రాయాలు తీసుకొని అభ్యర్థుల వడపోత జరిగిందన్నారు.

జనసేన అభ్యర్థులు..
నెల్లిమర్ల– లోకం మాధవి
అనకాపల్లి– కొణతాల రామకృష్ణ
రాజానగరం– బత్తుల బలరామకృష్ణ
కాకినాడ రూరల్– పంతం నానాజీ
తెనాలి– నాదెండ్ల మనోహర్

తెదేపా అభ్యర్థుల జాబితా..
ఇచ్ఛాపురం– బెందాళం అశోక్
టెక్కలి–అచ్చెన్నాయుడు
ఆమదాలవలస–కూన రవికుమార్
రాజాం–కోండ్రు మురళి
కురుపాం – తొయ్యక జగదీశ్వరి
పార్వతీపురం – విజయ్ బోనెల
సాలూరు – గుమ్మడి సంధ్యారాణి
బొబ్బిలి–ఆర్ఎస్‌వీకేకే రంగారావు (బేబి నాయన)
గజపతినగరం – కొండపల్లి శ్రీనివాస్
విజయనగరం – అదితి గజపతిరాజు
విశాఖ ఈస్ట్ – వెలగపూడి రామకృష్ణబాబు
విశాఖ వెస్ట్ – పీజీవీఆర్ నాయుడు
అరకు – సియ్యారి దొన్ను దొర
పాయకరావుపేట – వంగలపూడి అనిత
నర్సీపట్నం – చింతకాయల అయ్యన్నపాత్రుడు
తుని–యనమల దివ్య
పెద్దాపురం – నిమ్మకాయల చినరాజప్ప
అనపర్తి – నల్లిమిల్లి రామకృష్ణ రెడ్డి
ముమ్మిడివరం – దాట్ల సుబ్బరాజు
పి.గన్నవరం – రాజేశ్ కుమార్
కొత్తపేట – బండారు సత్యానంద రావు
మండపేట – జోగేశ్వరరావు
రాజమండ్రి సిటీ – ఆదిరెడ్డి వాసు
జగ్గంపేట – జ్యోతుల వెంకట అప్పారావు (నెహ్రూ)
ఆచంట – పితాని సత్యనారాయణ
పాలకొల్లు – నిమ్మల రామానాయుడు
ఉండి – మంతెన రామరాజు
తణుకు – అరిమిల్లి రాధాకృష్ణ
ఏలూరు – బడేటి రాధాకృష్ణ
చింతలపూడి – సోంగ రోషన్
తిరువూరు – కొలికపూడి శ్రీనివాస్
నూజివీడు – కొలుసు పార్థసారథి
గన్నవరం – యార్లగడ్డ వెంకట్రావు
గుడివాడ – వెనిగండ్ల రాము
పెడన – కాగిత కృష్ణ ప్రసాద్
మచిలీపట్నం – కొల్లు రవీంద్ర
పామర్రు – వర్ల కుమార రాజ
విజయవాడ సెంట్రల్ – బోండ ఉమ
విజయవాడ ఈస్ట్ – గద్దె రామ్మోహన రావు
నందిగామ – తంగిరాల సౌమ్య
జగ్గయ్యపేట – శ్రీరామ్ రాజగోపాల్ తాతయ్య
తాడికొండ – తెనాలి శ్రవణ్ కుమార్
మంగళగిరి – నారా లోకేశ్
పొన్నూరు – ధూళిపాళ్ల నరేంద్ర
వేమూరు(ఎస్సీ) – నక్కా ఆనంద్‌బాబు
రేపల్లె – అనగాని సత్యప్రసాద్
బాపట్ల – వి.నరేంద్ర వర్మ
ప్రత్తిపాడు(ఎస్సీ) – బూర్ల రామాంజినేయులు
చిలకలూరిపేట – ప్రత్తిపాటి పుల్లారావు
సత్తెనపల్లి – కన్నా లక్ష్మినారాయణ
వినుకొండ – జీవీ ఆంజనేయులు
మాచర్ల – జూలకంటి బ్రహ్మానందరెడ్డి
యర్రగొండపాలెం (ఎస్సీ) – గూడూరి ఎరిక్సన్ బాబు
పర్చూరు – ఏలూరి సాంబశివరావు
అద్దంకి – గొట్టిపాటి రవికుమార్
సంతనూతలపాడు (ఎస్సీ) – బొమ్మాజి నిరంజన్ విజయ్‌కుమార్
ఒంగోలు – దామచర్ల జనార్దనరావు
కొండపి – డోలా బాల వీరాంజనేయస్వామి
కనిగిరి – ముక్కు ఉగ్రనరసింహారెడ్డి
కావలి – కావ్య కృష్ణారెడ్డి
నెల్లూరు సిటీ – పి. నారాయణ
నెల్లూరు రూరల్ – కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి
గూడూరు (ఎస్సీ) – పాశం సునీల్‌కుమార్
సూళ్లూరుపేట (ఎస్సీ) – నెలవేల విజయశ్రీ
ఉదయగిరి – కాకర్ల సురేశ్
కడప – మాధవిరెడ్డి
రాయచోటి – మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి
పులివెందుల– మారెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి
మైదుకూరు – పుట్టా సుధాకర్ యాదవ్
ఆళ్లగడ్డ – భూమా అఖిలప్రియ
శ్రీశైలం – బుడ్డా రాజశేఖర్‌రెడ్డి
కర్నూలు – టీజీ భరత్
పాణ్యం – గౌరు చరితా రెడ్డి
నంద్యాల – ఎన్ఎండీ ఫరూక్
బనగానపల్లి – బీసీ జనార్దనరెడ్డి
డోన్ – కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి
పత్తికొండ – కేఈ శ్యాంబాబు
కోడుమూరు – బొగ్గుల దస్తగిరి
రాయదుర్గం – కాలవ శ్రీనివాసులు
ఉరవకొండ – పయ్యావుల కేశవ్
తాడిపత్రి – జేసీ అస్మిత్ రెడ్డి
శింగనమల (ఎస్సీ) – బండారు శ్రావణి శ్రీ
కల్యాణదుర్గం – అమిలినేని సురేంద్రబాబు
రాప్తాడు – పరిటాల సునీత
మడకశిర (ఎస్సీ) – ఎం.ఈ. సునీల్‌కుమార్
హిందూపురం – నందమూరి బాలకృష్ణ,
పెనుకొండ – సవిత
తంబళ్లపల్లె – జయచంద్రారెడ్డి
పీలేరు – నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి
నగరి – గాలి భానుప్రకాశ్
గంగాధర నెల్లూరు (ఎస్సీ) – డాక్టర్ వీఎం. థామస్
చిత్తూరు – గురజాల జగన్ మోహన్
పలమనేరు – ఎన్.అమర్‌నాథ్‌రెడ్డి
కుప్పం – నారా చంద్రబాబు నాయుడు



# వైసీపీ ఇన్చార్జిలకు జగన్ ఝలక్



- వైసీపీలో సుబ్బారెడ్డి బాంబు
- ఇప్పటివరకు 7 జాబితాలలో ప్రకటించిన వారు సమన్వయకర్తలే
- వాళ్లు అభ్యర్థులు కారని స్పష్టం
- అద్దంకి సిద్ధం సభకు జనం తరలింపుపై ఇన్చార్జిల నిరాసక్తత
- ఇప్పటిదాకా పెట్టిన ఖర్చుల సంగతేమిటన్న ప్రశ్నలు

**విజయవాడ, (వెలుతురు):**
మేదరమెట్లలో ఆఖరి సిద్ధం సభలో ఎన్నికల మేనిఫెస్టో రిలీజ్ చేస్తామని ఆ తర్వాతే ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల ప్రకటన ఉంటుందని వెల్లడించిన సుబ్బారెడ్డి వైసీపీ ఇన్చార్జిల పక్కలో బాంబు పేల్చారు. టికెట్లు దక్కక పక్క పార్టీల వైపు చూస్తున్న నేతలు వైసీపీలో ఉండేందుకే సుబ్బారెడ్డి ఈ వ్యాఖ్యలు చేశారా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

మరోవైపు సీటు మాదే అనుకొని డబ్బు ఖర్చు పెడుతున్న నేతలు, ఈ వ్యాఖ్యలపై అయోమయంలో పడ్డారు. చివరి నిమిషంలో సీటు వేరే వాళ్లకు ఇస్తే మా పరిస్థితి ఏంటని గగ్గోలు పెడుతున్నారు.

సుబ్బారెడ్డి తాజా ప్రకటనతో.. సీఎం–పార్టీ అధినేత జగన్ సిద్ధం సభకు వేదిక కానున్న అద్దంకి సభ విజయవంతం ఆందోళనలో పడింది. ఇంత ఖర్చు చేసినా, తాము అభ్యర్థులం కాదని సుబ్బారెడ్డి స్పష్టం చేయడంతో.. మళ్లీ అద్దంకి సభకు లక్షలు ఖర్చు పెట్టడం ఎందుకన్న భావన, నియోజకవర్గ ఇన్చార్జులలో మొదలయింది. తమ వరకూ సభకు వెళితే సరిపోతుందని వారు నిర్ణయించుకున్నట్లు సమాచారం.

దీనితో కేవలం రాజ్యసభ ఎన్నికల్లో గెలిచే వ్యూహంతోనే ఇన్చార్జిల ప్రకటన చేశారన్న వైసీపీ నేతల అనుమానాలు, సుబ్బారెడ్డి ప్రకటనతో నిజమయ్యాయి. ఇప్పుడు రాజ్యసభ ఎన్నికల్లో ముగ్గురు అభ్యర్థులూ పోటీ లేకుండానే గెలిచినందున, ఇక నిర్భయంగా ఇన్చార్జిలను మార్చవచ్చన్న ధీమా నాయకత్వంలో వచ్చినట్లు సుబ్బారెడ్డి మాటల్లో స్పష్టమవుతోంది.

ఒకవైపు టీడీపీ–జనసేన ఒకేసారి 118 స్థానాల్లో తమ అభ్యర్థులను ప్రకటించింది. కానీ తమ పార్టీ మాత్రం ఇప్పటిదాకా 7 జాబితాలు ప్రకటించినప్పటికీ, తమను అభ్యర్థులుగా కాకుండా నియోజకవర్గ ఇన్చార్జులుగా ప్రకటించడంపై వారిలో అసంతృప్తి వ్యక్తమవుతోంది.
ఒకవైపు టీడీపీ–జనసేన ఒకేసారి 118 స్థానాల్లో తమ అభ్యర్థులను ప్రకటించింది. కానీ తమ పార్టీ మాత్రం ఇప్పటిదాకా 7 జాబితాలు ప్రకటించినప్పటికీ, తమను అభ్యర్థులుగా కాకుండా నియోజకవర్గ ఇన్చార్జులుగా ప్రకటించడంపై వారిలో అసంతృప్తి వ్యక్తమవుతోంది.

### టీడీపీ–జనసేన పాటి ధైర్యమేదంటున్న సీనియర్లు

ఈ విషయంలో టీడీపీ–జనసేనకు ఉన్న ధైర్యం మా పార్టీకి లేకుండా పోయిందని ఇన్చార్జిలు వ్యాఖ్యానిస్తున్నారు. "ప్రతిపక్షంలో ఉన్న పార్టీలే ధైర్యంగా 118 సీట్లకు అభ్యర్థులను ప్రకటిస్తే, అధికారంలో ఉండి సంక్షేమపథకాలకు బటన్ నొక్కుతున్న మా పార్టీకి ధైర్యం లేకపోవడం ఆశ్చర్యం. అంటే మా నాయకత్వం మమ్మల్ని నమ్మడం లేదని అర్థమవుతూనే ఉంది" అని బాపట్ల జిల్లాకు చెందిన ఓ సీనియర్ ప్రజాప్రతినిధి ఆవేదన వ్యక్తం చేశారు.

## యూట్యూబర్ షణ్ముఖ్‌కు నోటీసులు జారీ

**హైదరాబాద్, ఫిబ్రవరి 24 (వెలుతురు):**
డ్రగ్స్ కేసులో యూట్యూబర్ షణ్ముఖ్‌కు పోలీసులు నోటీసులు జారీ చేశారు. షణ్ముఖ్ తీసుకున్న డ్రగ్ టెస్ట్‌కు సంబంధించిన నివేదిక పదిరోజుల్లో రానుంది. నివేదిక ఫలితం ఆధారంగా అవసరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. షణ్ముఖ్ యూట్యూబ్‌లో సాఫ్ట్‌వేర్ డెవలపర్, సూర్య వంటి వెబ్ సిరీస్‌లతో మంచి గుర్తింపు పొందాడు. బిగ్ బాస్ తెలుగు 5 రన్నరప్‌గా నిలిచారు. షణ్ముఖ్ జస్వంత్‌పై డ్రగ్స్ కేసు నమోదైన విషయం తెలిసిందే. ఈ కేసుకు సంబంధించి విచారణకు హాజరుకావాలని నార్సింగి పోలీసులు సీఆర్‌పీసీ 41 కింద నోటీసులు జారీ చేశారు. ఇదిలా ఉండగా.. షణ్ముఖ్ తీసుకున్న డ్రగ్ టెస్ట్ రిపోర్టు పదిరోజుల్లో రానున్నాయి. రిపోర్టు ఫలితాల ఆధారంగా అవసరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. గంజాయితో పట్టుబడిన షణ్ముఖ్ జస్వంత్ న్యాయపరమైన చిక్కుల్లో పడ్డాడు. ఓ మహిళ ఇచ్చిన ఫిర్యాదుమేరకు అతని సోదరుడు సంపత్ వినయ్‌ని పట్టుకునేందుకు పోలీసులు అతని ఇంటికి వెళ్లగా ఈ ఘటన చోటుచేసుకుంది. సోదాల్లో షణ్ముఖ్ వద్ద 16 గ్రాముల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అతని సోదరుడితో పాటు అతడిని అరెస్టు చేశారు.



# అంగరంగ వైభవంగా తిరుపతి ఆవిర్భావ వేడుకలు

## తిరుపతి పుట్టిన రోజు వేడుకను టీటీడీ క్యాలెండర్‌లో భాగం చేస్తాం

### టీటీడీ ఛైర్మన్ భూమన కరుణాకర రెడ్డి

### తిరుపతి అభివృద్ధికి టీటీడీ సంపూర్ణ సహకారం

### టీటీడీ ఈవో ఎవి ధర్మారెడ్డి

### గోవింద నామ స్మరణలతో పులకించిన తిరునగరి

**తిరుమల,(వెలుతురు):**
తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలను తలపించేలా మన తిరుపతి 894వ ఆవిర్భావ వేడుకలను టీటీడీ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించినట్లు ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి తెలిపారు. తిరుపతి గోవిందరాజస్వామివారి ఆలయ ప్రాంగణంలో శనివారం ఉదయం ఛైర్మన్ ఈ ఉత్సవాలను ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఛైర్మన్ మాట్లాడుతూ, జగద్గురువు శ్రీశ్రీశ్రీ రామానుజాచార్యులు తన అమృత హస్తాలతో 24.02.1130 న శంకుస్థాపన చేశారన్నారు. చిదంబరం నుంచి తీసుకొచ్చిన గోవిందరాజస్వామి ప్రతిమను ప్రతిష్టించడంతోపాటు, ఈ ప్రాంతానికి గోవిందరాజపురంగా నామకరణ చేయగా, నేడు తిరుపతిగా భాసిల్లుతున్నదన్నారు. 140 కోట్ల మంది హిందువులు పూజించే దేవుడైన శ్రీవెంకటేశ్వర స్వామి పాదాల చెంత నివాసం ఏర్పరచుకుని, జీవనం సాగించడం మనందరి జన్మజన్మల పుణ్యఫలమని చెప్పారు.

ప్రతిరోజు అర్చకులు గోవిందరాజస్వామి ఆలయంలో జరిగే మంత్రపుష్పంలో తిరుపతి ఆవిర్భావం గురించి చదువుతున్నారన్నారు. గోవింద రాజస్వామి ఆలయ గోపురం మీద కూడా మొట్టమొదటి శాసనంలో తిరుపతి ఆవిర్భావం గురించి చారిత్రక ఆధారాలు ఉన్నాయని ఛైర్మన్ వివరించారు.

ప్రపంచంలోనే అత్యంత పురాతన సంస్కృతి కలిగిన మెసెప్టోమియా, ఈజిప్ట్ లలోని నిప్పర్, లష్కర్ వంటి మహానగరాలు కాలగర్భంలో కలిసిపోయాయని, ఏథెన్స్, రోమ్, మాయన్ వంటి సంస్కృతులు ఎప్పుడు పుట్టాయో ఎవరికీ తెలియదన్నారు. కానీ తిరుపతి పుట్టినరోజు వేడుకలు జరపడం భగవత్ సంకల్పమన్నారు.

ప్రపంచంలో ఒక్క తిరుపతి నగరానికి మాత్రమే ఆవిర్భావ దినం ఉందిని చెప్పారు. ఇక నుంచి ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 24న సాంప్రదాయంగా, ఆచారంగా తిరుపతి పుట్టిన రోజు వేడుకను టీటీడీ క్యాలెండర్ లో భాగం చేస్తూ, పాలక మండలిలో తీర్మానించనున్నట్లు ఛైర్మన్ తెలిపారు. తిరుమల శ్రీవారి ఆశీస్సులతోనే ఈ పండుగను ఇంత అద్భుతంగా నిర్వహించుకుంటున్నట్లు చెప్పారు.




ఇందులో వేద పండితుల వేద ఘోష, కళాకారుల అద్భుత విన్యాసాలతో తిరుపతిలో కూడా బ్రహ్మోత్సవాలు జరుగుతాయనేలా మైమరిపించారన్నారు. టీటీడీ యంత్రాంగమంతా కదలివచ్చి మన తిరుపతి పుణ్యక్షేత్ర ఆవిర్భావ వేడుకలు అంగరంగ వైభవంగా నభూతో న భవిష్యత్ అనేలా నిర్వహించిందన్నారు. ఈ కార్యక్రమ విజయానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. తిరుపతి నగరం ప్రపంచానికి ఓ ఆదర్శ నగరం కావాలని ఆకాంక్షించారు.

అనంతరం టీటీడీ ఈవో ఎవి ధర్మారెడ్డి మాట్లాడుతూ, ప్రపంచ నలుమూలల నుంచి శ్రీవారి దర్శనానికి తిరుపతి మీదుగా తిరుమలకు వెళ్తారన్నారు. కావున భక్తులకు మరింత ఆధ్యాత్మిక ఆనందన్ని కలిగించేందుకు తిరుపతి నగరాన్ని కూడా తిరుమల తరహాలో సుందరంగా తీర్చిదిద్దేలా చర్యలు చేపట్టడం జరిగిందన్నారు.

తిరుపతి అభివృద్ధికి టీటీడీ సంపూర్ణ సహకారం అందిస్తోందన్నారు. తిరుపతి అభివృద్ధికి అందరూ సహకరించాలని, అందుకోసమే టీటీడీ పాలక మండలి కృషి చేస్తోందన్నారు. మన తిరుపతి ఆవిర్భావ దినోత్సవాన్ని మూడోసారి నిర్వహించు కుంటున్న తరుణంలో పురప్రజలకు, శ్రీవారి భక్తులకు ఈవో శుభాకాంక్షలు తెలియజేశారు.

### అలరించిన ఆధ్యాత్మిక శోభా యాత్ర

అంతకుముందు ఛైర్మన్ శ్రీగోవిందరాజ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, శోభాయాత్రను ప్రారంభించారు. టీటీడీ డిపిపి, అన్నమాచార్య ప్రాజెక్టు, దాస సాహిత్య ప్రాజెక్టుకు చెందిన వందలాది మంది కళాకారులు చెక్క భజనలు, కోలాటాలతో లయబద్ధంగా ఆడుతూ, గోవింద నామ సంకీర్తనలు, వేదపండితులు మంత్రోచ్చారణల మధ్య భక్తి చైతన్య యాత్ర జరిగింది. అదేవిధంగా కళాకారుల వివిధ దేవతామూర్తుల, పౌరాణిక వేషధారణలు పురప్రజలను విశేషంగా ఆకర్షించాయి.

ఈ కార్యక్రమంలో తిరుమల శ్రీశ్రీశ్రీ పెద్ద జియర్ స్వామి, శ్రీశ్రీశ్రీ చిన్న జీయర్ స్వామి, పార్లమెంటు సభ్యులు గురుమూర్తి, జిల్లా కలెక్టర్ లక్ష్మీ షా, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, టీటీడీ జేఈవో వీరబ్రహ్మం, ఎస్పీ మల్లిక గార్గ్, నగర మేయర్ డాక్టర్ శిరీష, నగర డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డి, ఎఫ్ ఎ అండ్ సిఎవో బాలాజి, సిఇ నాగేశ్వరరావు, సిపిఆర్ఓ డాక్టర్ టి.రవి, తదితరులు పాల్గొన్నారు.



# అద్దంకి సిద్ధం సభను విజయవతం చేస్తాం

### - మీడియా సమావేశంలో ఎంపీ విజయసాయి రెడ్డి

**నెల్లూరు, ఫిబ్రవరి 24, (వెలుతురు):**
ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రజలనుద్దేశించి ప్రసంగించే సిద్ధం మహాసభలకు ప్రజల నుండి అనూహ్య రీతిలో స్పందన లభిస్తోందని, మార్చి 3న అద్దంకి అసెంబ్లీ నియోజకవర్గం, కొర్సిపాడు మండలం, పిచ్చికలగుడిపాడు గ్రామం, జాతీయ రహదారి పక్కన జరగనున్న చివరి సిద్ధం మహాసభకు 15 లక్షల మంది వరకు హాజరు కానున్నారని పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాజ్యసభ సభ్యులు విజయసాయి రెడ్డి తెలిపారు.

ఈ మేరకు శనివారం నాడు నెల్లూరు పార్టీ కార్యలయంలో నెల్లూరు, ప్రకాశం, తిరుపతి పార్లమెంటు నియోజకవర్గాల పరిధిలో 21 అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి మంత్రులు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, సమన్వయకర్తలతో సన్నాహక సమావేశం నిర్వహించారు. మార్చి 3 తేదీన జరగనున్న సిద్ధం సభలో సాయంత్రం 3 గంటలకు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారని అన్నారు. ఎన్నికల ముందు కొందరు పార్టీలను వీడడం, మరికొందరు పార్టీల్లో చేరడం సర్వసాధారణమని, దీనిని బూతద్దంలో చూడ కూడదని అన్నారు. పార్టీలను వీడడానికి, కొత్త పార్టీల్లో చేరడానికి అనేక కారణాలు ఉంటాయని అన్నారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యేలు నల్లపురెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డి,రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి, మేకపాటి విక్రం రెడ్డి, కిలివేటి సంజీవయ్య,అన్న రాంబాబు, నాగార్జున రెడ్డి,ఎమ్మెల్సీలు పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, బల్లి కళ్యాణ్ చక్రవర్తి,పార్టీ సమన్వయకర్తలు పాల్గొన్నారు..

Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at **SRI SHANTHI PUBLICCATIONS** H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. **EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609.** Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com